

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




ఆర్థిక ఉగ్రవాది జగన్‌రెడ్డివి అబద్ధాలు

7



## చంద్రబాబైనా టికెట్ కొనాల్సిందే

- తలసేమియా బాధితుల కోసం 15న విజయవాడలో మ్యూజికల్ నైట్
- టికెట్‌పై వచ్చే ప్రతిరూపాయీ వారికే వెళుతుంది
- అడిగిన వెంటనే తమన్ అంగీకరించారు
- చేసిన మంచి పనులే మనతో ఉంటాయి
- సమాజ సేవకోసం ఎన్టీఆర్ స్ఫూర్తితో ట్రస్ట్ ఏర్పాటు
- ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి స్పష్టీకరణ

3



2

# పెట్టుబడులు, ఉపాధి లక్ష్యంగా..!

- వివిధ ప్రతిపాదనలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- కీలక పాలసీలలో సవరణలకు ఓకే
- విద్యుత్ సహా పలు కంపెనీలకు రాయితీలు
- నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ఓకే
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రిమండలి భేటీ
- నిర్ణయాలు వెల్లడించిన మంత్రి కొలుసు

## విద్యుత్ ఛార్జీలు తగ్గాలి

రానున్న రోజుల్లో విద్యుత్ ఛార్జీలు పెరగటానికి వీల్లేదని సీఎం తేల్చి చెప్పారు. సమగ్ర పవర్ మేనేజ్‌మెంట్‌తో విద్యుత్ ఛార్జీలు వీలైతే తగ్గాలే తప్ప పెరగటానికి వీల్లేదన్నారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాలను వేగవంతం చేసేలా కలెక్టర్లు, విద్యుత్ ఎస్‌ఈలకు ఆదేశాలు ఇవ్వాలన్నారు.



2





## ఫస్ట్ ఫరూఖ్ లాస్ట్ సుభాష్...

6

### ఏపీ మంత్రులకు ర్యాంకులు..

డిసెంబరు వరకు దస్త్రాల క్లియరెన్స్‌లో మంత్రుల పనితీరును ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గ సమావేశంలో వెల్లడించారు. తాను 6వ స్థానంలో ఉన్నట్టు వెల్లడించారు. దస్త్రాలు వేగంగా క్లియర్ చేయాలని మంత్రులకు సూచించారు.



## బడిపిల్లలకు.. సన్నబియ్యం అన్నం

- మంత్రి లోకేష్ చొరవతో కేబినెట్ మరో కీలక నిర్ణయం
- ఇకపై చిన్నారులకు మరింత నాణ్యంగా మధ్యాహ్న భోజనం
- దీంతో పాఠశాలల్లో పెరగనున్న హాజరుశాతం
- మంత్రి లోకేష్‌కు సహచర మంత్రుల అభినందనలు

3



## ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక ముందడుగు

- విశాఖ కేంద్రంగా సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధి ఖరారు
- వాల్తేర్ డివిజన్ పేరు విశాఖ డివిజన్‌గా మార్చి జోన్‌లో కొనసాగింపు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

3

## జగన్ పాలనలో రాష్ట్రం 30ఏళ్లు వెనక్కి..

5



- కూటమి ప్రభుత్వ అప్పులపై పిచ్చి ప్రేలాపనలు
- అధికారంలో కాదు.. జీవితాంతం జైల్లో ఉండాలి
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల ధ్వజం

# కట్టుకథల కనికట్టు!

నిజాలు సైతం నివ్వెరపోయేలా అబద్ధాల గోడలు కట్టడం -జగన్‌రెడ్డికి అవకాశవాదంతో పెట్టిన విద్య. తన అసహజ, అసమర్థ పాలనా విధానానికి మూల్యం చెల్లించుకున్న తరువాత కూడా.. పచ్చి అబద్ధాలను ప్రచారంలోకి తెచ్చి -కూటమి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్న జగన్‌ను రాష్ట్ర జనం ఏవగిస్తున్నారు. పాలనా విధానంమీదే కాదు, ప్రభుత్వంలోని విభాగాలపైనే ఏమాత్రం పట్టులేని జగన్ -కూటమిపై విషంగక్కడం.. అతని చేతగాని తనాన్ని బయటపెట్టుకోవడమే. జగన్ చెప్పిందంతా నిజమని నమ్మడానికి -రాష్ట్ర ప్రజానీకం అంత అమాయకులు కాదు. ఐదేళ్ల జగన్ పాలన అనుభవంలోకి వచ్చిన తరువాత -జగన్‌ను ఎంత ఏవగించారో.. సార్వత్రిక ఎన్నికల్లో 11 స్థానాలకు పరిమితమైన వైసీపీ ఇకనైనా గ్రహించాలి. లేదంటే -జగన్‌ను, అతని పరివారాన్ని గంగలోకి విసిరేసి.. వైసీపీ ఆనవాళ్లు లేకుండా -ఏపీ చరిత్రనుంచే చెరిపేయడం పెద్ద కష్టం కాదు. కాకపోతే -ఆ రోజు కోసమే ఎదురు చూస్తున్నట్టు.. జగన్ తప్పుడు మార్గాల్లో తప్పుడు ప్రచారాలు చేసుకుంటూ తన గోరీ తనే కట్టుకుంటున్నాడని చెప్పడానికి సందేహించక్కర్లేదు.



4

# పెట్టుబడులు, ఉపాధి లక్ష్యంగా..!



అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగిన ఇ-క్యాబినెట్ సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలను సమాచార పౌర సంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి పెట్టుబడుల ప్రవాహం మొదలైందని, పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు కార్పొరేట్ దిగ్గజాలు రాష్ట్రానికి వచ్చి ఒప్పందాలు చేసుకుంటున్నట్టు వెల్లడించారు. ఇప్పటివరకూ రూ.6,78,345కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించి 34 ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందాలు కుదిరాయన్నారు. దీంతో 4,28,705మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలగనున్నాయని మంత్రి కొలుసు వెల్లడించారు.

- వివిధ ప్రతిపాదనలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- కీలక పాలసీలలో సవరణలకు ఓకే
- విద్యుత్ సహా పలు విభాగాలకు రాయితీలు
- నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ఓకే
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రిమండలి భేటీ
- నిర్ణయాలు వెల్లడించిన మంత్రి కొలుసు




### పరిశ్రమలు మరియు వాణిజ్యం

2024-29 ఐదేళ్ల కాలానికి సంబంధించి రూపొందించిన పలు పాలసీల సవరణలను ఏపీ కేబినెట్ ఆమోదించింది. ఎంఎస్ఎంఈ, ఎంఈడీపీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, టెక్స్ టైల్ అండ్ గార్మెంట్స్ పాలసీల్లో పలు సవరణలకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూత అందించేలా పాలసీల్లో సవరణలకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. వారికి విద్యుత్ సహా పలు విభాగాల్లో ప్రత్యేక రాయితీలు, అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, విభిన్న ప్రతిభావంతులు, మహిళా పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి పలు నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగా ప్రోత్సాహాలను (35శాతం పెట్టుబడి రాయితీని 45శాతానికి) పెంచడం, ఇప్పటివరకూ మాన్యుఫ్యాక్చరింగ్ యాక్టివిటీస్‌కు ఈ పెట్టుబడి రాయితీ అందజేయడం జరుగుతుంటే, ఇకపై రవాణా, లాజిస్టిక్స్ ఆక్టివిటీస్‌కూ 45శాతం రాయితీ గరిష్టంగా రూ.75 లక్షల వరకూ ఇవ్వాలని నిర్ణయించింది. కొత్తగా పెట్టుబడులు పెట్టే వారికే ఈ పెట్టుబడి రాయితీలు వర్తిస్తాయి. ఇంతకుముందు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు భూమి విలువపై 50 శాతం రాయితీని గరిష్టంగా రూ.2 లక్షలు ఇవ్వడం జరిగేది. కానీ నేడు తీసుకున్న నిర్ణయం ప్రకారం 75 శాతం రాయితీని గరిష్టంగా రూ.25 లక్షలు ఇవ్వడం జరుగుతుంది. అలాగే, ఎంఎస్ఎంఈ డీపీ-4.0 పాలసీలో మహిళలు, బీసీ, విభిన్న ప్రతిభావంతులకు ఆరేళ్లపాటు విద్యుత్ రాయితీగా ప్రతి యూనిట్‌కు రూపాయి ఇవ్వడం జరిగేది. ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ రాయితీగా ప్రతి యూనిట్‌కు రూ.1.50లు ఐదేళ్లపాటు ఇవ్వడం జరిగేది. ఇప్పుడు అన్ని వర్గాలకూ.. అంటే మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు విభిన్న ప్రతిభావంతులకు విద్యుత్ రాయితీగా ప్రతి యూనిట్‌కూ రూ.1.5 ఐదేళ్లపాటు ఇవ్వనున్నారు. స్టేట్ జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ ప్రోత్సాహాన్ని ఐదేళ్లపాటు అన్ని వర్గాలకూ అమలు చేయనున్నారు. ఇటీవల జరిగిన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశం సిఫార్సులను కేబినెట్ ఆమోదించింది. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, ఎలీప్, ఇఎంసి (కొప్పర్తి) తదితర కంపెనీల విజ్ఞప్తి మేరకు కొన్ని ప్రోత్సాహకాలు అందించే అంశంపై కేబినెట్ చర్చించి నిర్ణయాలు తీసుకుంది. రెవిన్యూ వివాదాల పరిష్కార అధికారాలను డీఆర్వోల నుంచి ఆర్డీవోలకు దఖలుపరుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. 2014-2019 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్‌లో నీరు-చెట్టు కింద చేపట్టిన పనుల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కేబినెట్ ఆమోదించింది. అలాగే, నీరు-చెట్టు పనులు అమలుచేసిన 386మంది ఇంజనీర్లపై గత ప్రభుత్వం చేపట్టిన క్రమశిక్షణా చర్యల ఉపసంహరణకూ కేబినెట్ ఓకే చెప్పింది. పెండింగ్ బిల్లుల మొత్తం రూ.50.56 కోట్లు ప్రభుత్వం చెల్లించనుంది.

సీఆర్‌డీఏ పరిధిలో, జల్ జీవన్ మిషన్ పనులు, అమృత్, జలవనరుల శాఖలో దాదాపు లక్ష కోట్ల అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టనుంది. ఇన్ని పనులొ నిర్వహణకు ప్రీ క్వాలిఫికేషన్ కాంట్రాక్టర్లు దొరడకం కష్టమనే నేపథ్యంలో.. బిడ్ సామర్థ్యంలో ప్రభుత్వం మార్పులు చేసింది. సవరించిన నియమం అన్ని శాఖలకూ వర్తించేలా కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

పోలవరం ప్రాజెక్టులోని ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో హౌసింగ్ బ్యాలెన్స్ పనుల కోసం తాజాగా టెండర్లు పిలవడానికి. ప్రస్తుతం అమల్లో ఉన్న కాంట్రాక్టులను రద్దు చేసేందుకు, ధరల సర్దుబాటు ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదం తెల్పింది. 2027కల్లా ప్రాజక్టును పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో నిర్వాశితులకు సత్వరమే న్యాయం చేయాలని నిర్ణయించింది. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ క్రింద నిర్మించే దాదాపు 50 హౌసింగ్ కాలనీల్లో అన్ని మౌలిక వసతుల కల్పనతోపాటు సామాజిక మౌలిక సదుపాయాలనూ కల్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తితిదేలో పోటు కార్మికులకు సంబంధించిన 15 పోస్టులను సూపర్వైజర్ స్థాయికి పెంచేందుకు మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నారు. తిరుపతి జిల్లా తమ్మినపట్నం, కొత్తపట్నంలో చెన్నై-బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి పరిహారం కింద ఎకరాకు రూ.8లక్షలు చొప్పున దాదాపు రూ.79కోట్లు చెల్లించేందుకు అంగీకారం తెలిపారు. మద్యం ధరలపై క్యాబినెట్‌లో చర్చించారు. ఆంధ్రప్రదేశ్ నాలెడ్జ్ సొసైటీ మరియు కెపాసిటీ బిల్డింగ్ పాలసీ 2025 ముసాయిదాను కేబినెట్ ఆమోదించింది. రాష్ట్రం మరియు ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని క్రమంగా తగ్గించాలనే లక్ష్యంతో గ్రీన్ ఎనర్జీ పాలసీని రూపొందించారు. అందుకు తగ్గట్టుగా ఇంధన శాఖ చేసిన పలు ప్రతిపాదలను నేడు మంత్రి మండలి ఆమోదించింది. 3,200 మెగా వాట్ల సోలార్ పవర్ కెపాసిటీని కేటాయించాలని పలు కంపెనీలు ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. తద్వారా దాదాపు రూ.5,500 కోట్ల పెట్టుబడులు, 3,500 ఉద్యోగ అవకాశాలు కలుగనున్నాయి. ఇంతకు ముందు కేటాయించని ప్రాంతాల్లో సోలార్ పవర్ కెపాసిటీని కేటాయించనుంది. ఇక, ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో ఆమోదం తెలిపిన దాదాపు రూ.45వేల కోట్ల పెట్టుబడులకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.

# విద్యుత్ ఛార్జీలు తగ్గాలి

- బడులు తెరిచేనాటికి డిఎస్సీ పూర్తిచేయాలి
- కేబినెట్ తరువాత మంత్రులతో సీఎం భేటీ
- వివిధ పథకాల అమలు తీరుపై విస్తృత చర్చ

అమరావతి (చైతన్య రథం): ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత కొద్ది సేపు మంత్రులతో మాట్లాడారు. వచ్చే మూడు నెలలు జనంలోకి వెళ్లే పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంత్రులు కీలకంగా వ్యవహరించి ప్రచారం నిర్వహించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే 'తల్లికి వందనం' పథకం అమలుపై మంత్రులతో చర్చించారు. ఏప్రిల్‌లో మత్స్యకార భరోసా ఇవ్వడంపై దృష్టి పెట్టాలని మంత్రులకు సూచించారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు రాష్ట్రం మరో రూ.14 వేలు కలిపి ఇచ్చే అంశంపై దృష్టి పెట్టాలన్నారు. కేంద్రంతోపాటు మూడు విడతలుగా రాష్ట్రం ఆర్థికసాయం ఇవ్వాలని యోచిస్తున్నట్టు తెలిపారు. బడులుతెరిచే నాటికి డీఎస్సీ పోస్టులు భర్తీ చేయాలని ఆదేశించారు.

రానున్న రోజుల్లో విద్యుత్ ఛార్జీలు పెరగటానికి వీల్లేదని సీఎం తేల్చి చెప్పారు. సమగ్ర పవర్ మేనేజ్‌మెంట్‌తో రానున్న రోజుల్లో విద్యుత్ ఛార్జీలు వీలైతే తగ్గాలే తప్ప పెరగటానికి వీల్లేదన్నారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాలను వేగవంతం చేసేలా కలెక్టర్లు, విద్యుత్ ఎస్ఈలకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. విద్యుత్ సంస్కరణల్లో భాగంగా 7.5లక్షల ఉద్యోగాల హామీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఎన్ని పెట్టుబడులు అమల్లోకి వచ్చాయో ఎప్పటికప్పుడు పరిశీలించి అందుకు తగ్గట్టు ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా డీఎస్సీ నియామకాలు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. నకిలీ రిజిస్ట్రేషన్లను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.




### మంత్రులు గేరు మార్చాలి...

శాఖలపరంగా మంత్రుల పనితీరు మెరుగుపడాలని సీఎం అన్నారు. అందరూ గేరు మార్చాలని సూచించారు. "మొదటి ఆరు నెలలు మంత్రుల పనితీరును అంతగా పట్టించుకోలేదు. ఇకపై ఎవరినీ ఉపేక్షించను. నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. ఆప్కోస్ ద్వారా కాకుండా ఔట్ సోర్సింగ్ సిబ్బందిని శాఖల వారీగా తీసుకోవచ్చు. వాట్సప్ గవర్నెన్స్‌కు మంచి స్పందన వస్తోంది. వివిధ పథకాల అమలు తీరుపై చేయిస్తోన్న సర్వేల్లో సానుకూల స్పందన వస్తోంది" అని అన్నారు.

### సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన పథకం

ఇకపై నాణ్యమైన, పోషక విలువలు కలిగిన సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై కేబినెట్‌లో చర్చ జరిగింది. మెనూలో చేసిన మార్పులపై సమావేశంలో లోకేశ్ వివరించారు. ప్రాంతాల వారీగా పిల్లలు ఇష్టపడి తినే విధంగా మెనూలో తీసుకొచ్చిన మార్పులను లోకేశ్ ప్రస్తావించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుకు పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ సహకారాన్ని లోకేశ్ కోరారు. ఈ పథకం అమలుకు అవసరమైన నాణ్యమైన పోషకాలు కలిగిన సన్న బియ్యం పౌరసరఫరాల శాఖ వద్ద అందుబాటులో ఉన్నాయని ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ తెలిపారు.

# బడిపిల్లలకు.. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం

- మంత్రి లోకేష్ చొరవతో కేబినెట్ మరో కీలక నిర్ణయం
- ఇకపై చిన్నారులకు మరింత నాణ్యంగా మధ్యాహ్న భోజనం
- దీంతో పాఠశాలల్లో పెరగనున్న హాజరుశాతం
- మంత్రి లోకేష్‌కు సహచర మంత్రుల అభినందనలు




అమరావతి (చైతన్యరథం): విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలతో ఏపీ మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు శ్రీకారం చుట్టిన రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే చిన్నారులకు అందించే మధ్యాహ్న భోజనానికి ఇకనుంచి సన్నబియ్యం వినియోగించాలని నిర్ణయించారు. అమరావతి సచివాలయంలో గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుతీరుపై ఆసక్తికర చర్చ సాగింది. ఇప్పటికే ప్రాంతాల వారీగా పిల్లలు ఇష్టపడి తినే విధంగా మెనూలో తెచ్చిన మార్పుల గురించి మంత్రి లోకేష్ కేబినెట్ సమావేశంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ సన్నబియ్యం ప్రతిపాదనను తేగా, సహచర మంత్రులు బలపర్చారు. నాణ్యమైన పోషకాలు కలిగిన సన్న బియ్యం (ఫైన్ రైస్ ) అందిస్తే మరింత క్వాలిటీతో చిన్నారులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని క్యాబినెట్ ముందు ప్రస్తావించారు. ఇందుకు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సహకారం కావాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన నాణ్యమైన పోషకాలు కలిగిన సన్న బియ్యం పౌరసరఫరాల శాఖ వద్ద అందుబాటులో ఉంటుందని, ఆ బియ్యం ఇవ్వడానికి తమకు ఎటువంటి ఇబ్బంది లేదని మంత్రి నాదెండ్ల చెప్పారు. దీంతో ఇక నుండి నాణ్యమైన పోషకాలు కలిగిన సన్న బియ్యం (ఫైన్ రైస్) తో మధ్యాహ్న భోజన పథకం అమలు చెయ్యాలని కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నారు. దీనిపై సహచర మంత్రులు మంత్రి లోకేష్ ను అభినందిస్తూ...మీ చొరవతో ప్రభుత్వ స్కూళ్లలో చదివే పేదపిల్లలకు పౌష్టికాహారం అందుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెరగడానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని అన్నారు. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల మెరుగుదల కోసం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్న మంత్రి లోకేష్... చూపిన చొరవతో ఇకపై చిన్నారులకు మరింత నాణ్యమైన భోజనం అందనుంది.

## సీఎం చంద్రబాబు కూడా టికెట్ కొనాల్సిందే

- తలసేమియా బాధితుల కోసం 15న విజయవాడలో మ్యూజికల్ నైట్
- టికెట్‌పై వచ్చే ప్రతిరూపాయీ వారికే వెళుతుంది
- అడిగిన వెంటనే తమన్ అంగీకరించారు
- చేసిన మంచి పనులే మనతో ఉంటాయి
- సమాజ సేవకోసం ఎన్టీఆర్ స్ఫూర్తితో ట్రస్ట్ ఏర్పాటు
- ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి స్పష్టీకరణ




విజయవాడ: విజయవాడలో నిర్వహించే మ్యూజికల్ నైట్‌కు ముఖ్యమంత్రి అయినా, ఆయన వెంట వచ్చే పీఏలు, భద్రతా సిబ్బంది.. ఎవరైనా టికెట్ కొనుగోలు చేస్తేనే లోనికి అనుమతి అని ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. ఈ నెల 15న తలసేమియా బాధితుల సహాయార్థం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడలో ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ ఆధ్వర్యంలో యుఫోరియా మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. యుఫోరియా కార్యక్రమ వివరాలను గురువారం భువనేశ్వరి వెల్లడించారు. తమ కుటుంబ సభ్యులకు రూ.6 లక్షలు వెచ్చించి చంద్రబాబే మ్యూజికల్ నైట్ టికెట్లు కొని టేబుల్ బుక్ చేశారని తెలిపారు. ఎవరి కాళ్లమీద వాళ్లే నిలబడాలి అని భావించే వ్యక్తి చంద్రబాబు అని పేర్కొన్నారు. అందుకే ట్రస్టు కార్యక్రమాల గురించి ఆయనను తానేమీ అడగనని, అడిగినా వెంటనే అంగీకరించరని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కూడా మ్యూజికల్ నైట్ ఈవెంట్‌కు ఆహ్వానించామని భువనేశ్వరి తెలిపారు. ఆయన తప్పకుండా వస్తారని ఆకాంక్షించారు. టికెట్ పై వచ్చే ప్రతి రూపాయి తలసేమియా బాధితులకు అందిస్తామని భువనేశ్వరి తెలిపారు.

'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అని ఎన్టీఆర్ గట్టిగా నమ్మారని భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ట్రస్టు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని.. అది చాలా మంది జీవితాలను నిలబెడుతుందన్నారు. రక్తదానం చేసిన వ్యక్తులు ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపుతారు. ఫండ్ రైజింగ్ కోసం మ్యూజికల్ నైట్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. దీని గురించి చెప్పగానే.. తమన్ కూడా ఒక్క నిమిషం ఆలోచించకుండా వెంటనే మ్యూజికల్ నైట్ కి వస్తా అన్నారు. ఎంతో గొప్ప మనసుతో ఈ షో ఫ్రీ గా చేస్తా అని చెప్పారు. ప్రతి ఒక్కరు తెలుగు తల్లి రుణం తీర్చుకోవాలి. అందరూ సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేయాలి. మనం చేసిన మంచి పనులే మనతో ఉంటాయని భువనేశ్వరి తెలిపారు. మనం వెళ్ళేటప్పుడు మన వెంట డబ్బు రాదు...ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తే అందరికి గుర్తు ఉంటుంది.

**ఇంత పెద్ద బాధ్యత అప్పగించారు: తమన్**

మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ ఈ షో తానుచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. తలసేమియా బాధితుల కోసం ఈ కార్యక్రమం చేయాలని భువనేశ్వరి అడిగారు. తలసేమియా బాధితులకు సహాయం కోసం అని చెప్పగానే నేను వెంటనే ఈకార్యక్రమానికి వస్తా అని చెప్పాను.ఈ టికెట్‌పై పెట్టె ప్రతిరూపాయి తలసేమియా బాధితులకు వెళ్తుంది. భువనేశ్వరి నాపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద కార్యక్రమం నా చేతిలో పెట్టినందుకు కృతజ్ఞతలు. ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్రం కోసం పగలు, రాత్రి నిర్విరామంగా శ్రమిస్తున్నారని తమన్ కొనియాడారు.

## నేడు, రేపు ఢిల్లీలో మంత్రి డోలా పర్యటన

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఈనెల 7,8 తేదీలలో ఢిల్లీలో పర్యటించనున్నారు. 7 వ తేదీన కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత (సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ ) శాఖ మంత్రి డా. వీరేంద్ర కుమార్‌తో సమావేశమై రాష్ట్రానికి రావలసిన నిధులు, ప్రాజెక్టుల గురించి చర్చిస్తారు.

8వ తేదీ P.M - AJAY (ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన పథకం) పై జరిగే సమన్వయ సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాల సాంఘిక సంక్షేమశాఖ మంత్రులు హాజరవుతారు.



## ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక ముందడుగు

- విశాఖ కేంద్రంగా సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధి ఖరారు
- వాల్తేర్ డివిజన్ పేరు విశాఖ డివిజన్‌గా మార్చి జోన్‌లో కొనసాగింపు
- 410 కిలోమీటర్ల పరిధిలో సౌత్ కోస్టల్ రైల్వే జోన్
- కూటమి ప్రభుత్వ విజ్ఞప్తిని మన్నించిన కేంద్రానికి ప్రత్యేక ధన్యవాదాలు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



అమరావతి (చైతన్యరథం): వెనుక బడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహద పడే విధంగా వాల్తేర్ డివిజన్‌ను విశాఖ డివిజన్‌గా పేరు మార్చి, విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్వాగతించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదం చేసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా హర్షిస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటుచేసిన దక్షిణకోస్తా రైల్వేజోన్‌లో వాల్తేరు డివిజన్‌ను పూర్తిగా తొలగించడం సరికాదంటూ కేంద్రానికి కూటమి ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందన్నారు. ఆ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం విశాఖ కేంద్రంగా నాలుగు డివిజన్లతో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. ఇది ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన కీలక ముందడుగుగా అభివర్ణించారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం కూటమి ప్రభుత్వం సాధించిన మరో ఘన విజయం.విశాఖ రైల్వే అభివృద్ధిలో చారిత్రాత్మకమైన ముందడుగుగా నిలిచిపోతుంది. ఉత్తరాంధ్ర ప్రజలకు మెరుగైన రైలు సేవలు అందించడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి ఇది మరింత ఊతమిస్తుంది. విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు రైల్వే కేటాయింపుల్లో మరింత ప్రాధాన్యం లభించేందుకు ఈనిర్ణయం దోహదం చేస్తుందని పల్లా శ్రీనివాసరావు అన్నారు.

**ఉత్తరాంధ్రపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి**

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే నష్టాల్లో ఉన్న స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం నుంచి రూ.11,440 కోట్ల నిధులు సాధించడంతోపాటు కేంద్ర బడ్జెట్‌లో క్యాపిటల్ షేర్ కింద మరో రూ.3,295కోట్లు కేటాయించేలా కృషి చేశారు. దేశ ప్రధానే విశాఖకు వచ్చి రూ.2లక్షల కోట్లు విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారు. రైల్వే జోన్ సాధించడంలో ఎంపీ ఎం.శ్రీభరత్, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా చాలా కృషి చేశారు. రాష్ట్రం మరింత ప్రగతి సాధించేలా టీడీపీ కృషి కొనసాగిస్తుంది. కేంద్రంతో సమన్వయం చేస్తూ రాష్ట్రప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు కట్టుబడి ఉంటామని గురువారం ఒక ప్రకటనలో పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# జగన్‌రెడ్డి కట్టుకథల కనికట్టు



**నిజాలు సైతం నివ్వెరపోయేలా అబద్ధాల గోడలు కట్టడం -జగన్‌రెడ్డికి అవకాశవాదంతో పెట్టిన విద్య. తన అసహజ, అసమర్థ పాలనా విధానానికి మూల్యం చెల్లించుకున్న తరువాత కూడా.. పచ్చి అబద్ధాలను ప్రచారంలోకి తెచ్చి -కూటమి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్న జగన్‌ను రాష్ట్ర జనం ఏవగిస్తున్నారు. పాలనా విధానంమీదే కాదు, ప్రభుత్వంలోని విభాగాలపైనే ఏమాత్రం పట్టులేని జగన్ -కూటమిపై విషంగక్కడం.. అతని చేతగాని తనాన్ని బయటపెట్టుకోవడమే. జగన్ చెప్పిందంతా నిజమని నమ్మడానికి -రాష్ట్ర ప్రజానీకం అంత అమాయకులు కాదు. ఐదేళ్ల జగన్ పాలన అనుభవం లోకి వచ్చిన తరువాత -జగన్‌ను ఎంత ఏవగించారో.. సార్వత్రిక ఎన్నికల్లో 11 స్థానాలకు పరిమితమైన వైసీపీ ఇకనైనా గ్రహించాలి. లేదంటే -జగన్‌ను, అతని పరివారాన్ని గంగలోకి విసిరేసి.. వైసీపీ ఆనవాళ్లు లేకుండా -ఏపీ చరిత్రనుంచే చెరిపేయడం పెద్ద కష్టం కాదు. కాకపోతే -ఆ రోజు కోసమే ఎదురు చూస్తున్నట్టు.. జగన్ తప్పుడు మార్గాల్లో తప్పుడు ప్రచారాలు చేసుకుంటూ తన గోరీ తనే కట్టుకుంటున్నాడని చెప్పడానికి సందేహించక్కర్లేదు.**

అబద్దానికి ప్యాంటు, చొక్కా వేస్తే అది జగన్ రెడ్డి. అబద్ధాల పునాదులపైనే పార్టీని నిర్మించిన జగన్ -ఎల్లకాలం తను చెప్పే అబద్ధాలు జనం నమ్ముతారన్న భ్రమలో ఉన్నట్లున్నాడు. ఐదేళ్లపాటు అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డులా చెప్పిన అబద్ధాలనే జగన్ చెప్పడాన్ని గ్రహించిన జనం.. 11 సీట్లిచ్చి వైసీపీని మూలన కూర్చోబెట్టారు. ఇప్పుడు మరోమారు అబద్ధాలతో మైకుల ముందుకొచ్చాడు జగన్. అధికారాన్ని అడ్డుపెట్టుకుని 8 లక్షల కోట్ల రూపాయల రాష్ట్ర సంపద దోచుకున్న జగన్‌రెడ్డి.. ఇప్పుడు తన అరాచకాలు బయటపడడంతో వాటిని కప్పి పుచ్చుకునేందుకు కూటమి ప్రభుత్వానికి తన తప్పులను అంటగడుతూ విషం చిమ్ముతున్నాడు.

## వాస్తవాలివీ..

చంద్రబాబు వచ్చిన ఏడు నెలల్లోనే తెచ్చిన, తేనున్న అప్పులు రూ.1.54 లక్షల కోట్లని జగన్ ప్రచారం చేస్తున్నాడు. బడ్జెట్ అప్పులే రూ.80,827 కోట్లు. అమరావతి పేరుతో రూ.52,000 కోట్లు, మార్క్‌ఫెడ్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా రూ.8000 కోట్లని నోటికొచ్చిన లెక్కలు చెబుతూ పచ్చి అబద్ధాలను ప్రచారంలోకి తెస్తున్నాడు జగన్‌రెడ్డి. ఈ సొమ్మంతా ఎవరి జేబుల్లోకి వెళ్లిందోనని రాగాలు తీస్తున్నాడు. ఈ అప్పుల్లో రూ.20,000 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో జగన్ ప్రభుత్వం చేసిన అప్పులే. మరి వివిధ శాఖల్లో జగన్‌రెడ్డి పెట్టిన బకాయిలు ఎవరు తీర్చాలి. గతంలో ఏ ప్రభుత్వం పెట్టని విధంగా రూ.1.4 లక్షల కోట్ల బకాయిలను జగన్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. కేంద్ర ఆర్థిక సంఘం నిధులనూ జగన్ సర్కారు ముందుగానే తినేసింది.

జగన్‌రెడ్డి దోపిడీతో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ దివాళా తీసింది. జగన్‌రెడ్డి పాపం కూటమి ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రజలకు శాపంగా మారింది. ఇన్ని ఇబ్బందులున్నప్పటికీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఏడు నెలల్లో గత ప్రభుత్వ బకాయిలు చెల్లించింది. రైతులకు ధాన్యం బకాయిలు రూ.1674 కోట్లు, ఆరోగ్య శ్రీకి రూ.1800 కోట్లు, ఉద్యోగులకు జీపీఎఫ్ పెండింగ్ బిల్లులు రూ.519 కోట్లు, పోలీసులకు సరెండర్ లీవ్ బకాయిలు రూ.214కోట్లు, సీపీఎస్‌కు సంబంధించిన బకాయిలు రూ.300 కోట్లు, టీడీఎస్ కింద పెండింగ్ బిల్లులు రూ.265 కోట్లు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.788 కోట్లు.. ఇలా వివిధ రంగాలలో రూ.22 వేల కోట్లు గత ప్రభుత్వ బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించింది.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు ఇప్పటివరకు రూ.21 వేల కోట్లు ఖర్చు చేశారు. అదీగాక జగన్‌రెడ్డి చేసిన అప్పులకు, అసలు, వడ్డీ కలిపి ఏడాదికి రూ.71వేల కోట్ల చెల్లింపులు చేయాల్సిన భారం కూటమి ప్రభుత్వంపై పడింది. అంటే ఈ ఎనిమిది నెలలకి జగన్ చేసిన అప్పుకి రూ.45వేల కోట్ల భారం కూటమి ప్రభుత్వంపై పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన కేవలం 5 నెలల్లోనే రూ.12,367 కోట్ల జగన్ ప్రభుత్వ అప్పులను క్లియర్ చేసింది. ఇది కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని కల్పించడంతో పాటుగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పుంజుకుందనడానికి నిదర్శనం.

గత జగన్ ప్రభుత్వం మొదటి ఏడు నెలల్లో పింఛన్‌లు రూ.250 పెంచడం తప్ప.. ఆర్భాటంగా ప్రకటించిన నవరత్న హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదు. చంద్రబాబు ప్రభుత్వం పింఛను ఒకేసారి రూ.1000 పెంచి రూ.4 వేల మొత్తంగా ప్రతీ నెలా 1నే ఇళ్ల వద్దకెళ్లి మరీ ఇస్తోంది. ఏడాదికి రూ.33 వేల కోట్లు, ఐదేళ్లలో రూ.1.6 లక్షల కోట్లు పింఛన్‌లకు ఖర్చు చేయనుంది. ఇది దేశంలోనే రికార్డ్. 263 అన్న క్యాంటిన్లను ప్రారంభించి పేదల ఆకలి తీర్చుతోంది. దీపం-2 కింద 90 లక్షలకు పైగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తుంది. రాబోయే ఉగాదికి మహిళలకు ఉచిత బస్సు పథకం, మే నెలనాటికి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను అమల్లోకి తీసుకురానుంది.

పౌర సరఫరాల శాఖ, మార్క్‌ఫెడ్ నుంచి రూ.8 వేల కోట్ల రుణమని ప్రచారం చేస్తున్నాడు జగన్. ఇందులో జగన్ పెట్టి వెళ్ళిన ధాన్యం బకాయిలు రూ.1674 కోట్లు కూటమి ప్రభుత్వం తీర్చింది. ఇక ఈ సీజన్లో రాష్ట్రంలో 5,08,261 మంది రైతులనుంచి 31,93,769 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేసి రూ.7,354.37 కోట్లు రైతుల ఖాతాల్లో 24 గంటల్లోనే జమ చేసింది కూటమి ప్రభుత్వం. మార్క్‌ఫెడ్ రుణాల ను దారిమళ్లించి తాడేపల్లి పాలస్ ఖజానా నింపుకున్న జగన్‌రెడ్డి, ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతుల ధాన్యం సొమ్ముల్నీ 3 నెలలకు కూడా జమ చేయకపోగా చంద్రబాబు ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరమే.

అమరావతి పేరుతో రూ.52 వేల కోట్ల అప్పు అని ప్రచారం చేస్తున్నాడు. ప్రపంచ బ్యాంక్ ఇస్తున్న అప్పు రూ.15 వేల కోట్లతో రాష్ట్రానికి సంబంధం లేదు. అది కేంద్రం తీరుస్తుంది. అసలు ఈ అప్పు, రాష్ట్ర ప్రభుత్వ అప్పుగా జగన్‌రెడ్డి లాంటి సైకో తప్ప ఎవరూ చెప్పరు. అమరావతికి హడ్కో ఇచ్చే రుణం రూ.11 వేల కోట్లు కూడా పూర్తిగా సీఆర్డీఏ లావాదేవీ. అమరావతి భూములు మీద వచ్చే 2 లక్షల కోట్ల ఆదాయంతో సీఆర్డీఏ తీరుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం సంబంధం లేదు. 21వేల కోట్లు సీఆర్డీఏ ప్రతిపాదించి న అప్పుని కూడా తీసేసుకున్నట్టు జగన్ ప్రచారం చేయడం.. జగన్ అజ్ఞానానికి నిలువుటద్దం. అది కేవలం ప్రతిపాదన మాత్రమేనన్న విషయం జగన్ గ్రహించాలి.

కాగ్ లెక్కల ప్రకారం 6నెలలు.. అంటే జూన్ నుంచి నవంబర్ వరకు అయిన ప్రభుత్వ ఖర్చు: రూ.1,09,328.46 కోట్లు. (Expenditure on Revenue Account, Interest payment, Salaries, Employees Pensions, Subsidy Amounts. Source CAG). ఈ ఏడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఖర్చులు ఇవీ. జగన్‌రెడ్డిలాగా రుషికొండ ప్యాలెస్‌లు కట్టుకోలేదు. ప్రజల సొమ్ము కోట్లు దుర్వినియోగం చేసి ఇంటిచుట్టూ ఇనుప కంచెలు వేసుకొలేదు. కోట్లు వెచ్చించి.. తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని ఎగ్‌పఫ్‌లూ మెక్కలేదు.

## జగన్‌రెడ్డి సాగించిన ఆర్థిక విధ్వంసం

జగన్ ఐదేళ్ల పాలనలో అడ్డగోలుగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాడు. జూన్ 2024 నాటికి రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ అప్పులే రూ.6,46,531 కోట్లు కాగా, రూ.2 లక్షల కోట్లకు పైనే బడ్జెటేతర అప్పులున్నాయి. ఇవికాక పెండింగ్ బిల్లులు మరో రూ.1.42 లక్షల కోట్లు. జగన్ నిర్వాకంతో మొత్తం 12 లక్షల కోట్లకు పైగా అప్పులు, ఏడాదికి చెల్లించాల్సిన అసలు, వడ్డీ కలిపి రూ.71,881 కోట్లు. ఇవి కేవలం ఇప్పటివరకు బయటపడిన అప్పులే. బయటపడాల్సింది ఇంకెంతుందో. తవ్వే కొద్దీ బయట పడుతూనే ఉన్నాయి జగనాసురుడి అరాచకాలు.

| 2024 జూన్‌నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అప్పులు, బకాయిలు రూ.కోట్లలో | |
|---|---|
| ప్రభుత్వ అప్పు | 4,38,278 |
| పబ్లిక్ డెబిట్ | 80,914 |
| కార్పొరేషన్ల అప్పు | 2,48,677 |
| పౌర సరఫరాలకు బకాయిలు | 36,000 |
| విద్యుత్ శాఖకు బకాయిలు | 34,267 |
| సరఫరాదారులకు బకాయిలు | 1,13,244 |
| ఉద్యోగులకు బకాయిలు | 21,980 |
| సింకింగ్ ఫండ్ లోటు | 1,196 |
| మొత్తం | 9,74,556 |

ఒక్క విద్యుత్ రంగంలోనే అప్పులు రూ.1.29 లక్షల కోట్లకు చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిధులు దారి మళ్లించడమే కాకుండా విద్యుత్, ఆర్టీసీ చార్జీలు, పన్నులు, ఇసుకపై చివరకి చెత్తపై కూడా పన్నువేసి ప్రజలపై భారం మోపారు. జీఎస్డీపీ గ్రోత్ రేట్ పడిపోవడంతో రాష్ట్రం రూ.6.94 లక్షల కోట్ల ఆదాయం కోల్పోయింది. వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు 16శాతం నుంచి 11.9శాతానికి దిగజారింది. సేవారంగంలో 11.9శాతం నుంచి 9.9శాతానికి పడిపోయాము. ఇదీ జగన్ నిర్వాకం.

2019 నాటికి టీడీపీ హయాంలో ఉన్న 13.5 శాతం గ్రోత్ రేట్ అలాగే కొనసాగి ఉంటే రాష్ట్రానికి రూ.76,195 కోట్ల అదనపు ఆదాయం వచ్చేది. రూ.40,000 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి ఆ సొమ్ముని సైతం దోచేశాడు జగన్‌రెడ్డి. ఐదేళ్లలో విపత్తు నిధులు, పోలవరం, గ్రామపంచాయతీలు సహా కేంద్రం ఇచ్చిన నిధులన్నీ దారి మళ్లించాడు. ప్రజాధనాన్ని కొల్లగొట్టి తాడేపల్లి ఖజానా నింపుకున్నాడు. రూ.3142 కోట్ల స్థానిక సంస్థల నిధులూ దారి మళ్లించారు.

ఉద్యోగుల పొదుపు సొమ్ము నిధులు రూ.5,243 కోట్లు, జెన్కో, ట్రాన్స్కో, డిస్కమ్‌లకు చెందిన పెన్షన్, పీఎఫ్ నిధులు రూ.3,143 కోట్లను రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ బాండ్లలో పెట్టి ఇతర అవసరాలకు మళ్లించారు. డ్వాక్రా మహిళల అభయ హస్తం కింద రోజుకు రూపాయి పొదుపు చేసే నిధులు రూ. 2,100 కోట్లనూ కొట్టేశారు. జగన్‌రెడ్డి నిర్వాకంతో 2024-25 సంవత్సరానికి రూ.1,46,909 కోట్లు లోటులో ఉన్నట్టు తేలింది.

రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా కేవలం రుణాలు సమీకరించి.. వాటిని దారి మళ్లించేందుకు ఏపీఎస్డీసీని ఏర్పాటు చేశాడు జగన్. దీనిద్వారా తీసుకున్న అప్పుల గురించి బడ్జట్ పుస్తకాల్లో చూపకుండా బ్యాంకుల నుండి రూ.25 వేల కోట్ల రుణాల సమీకరణకు ఒప్పందాలు చేసుకున్నారు. దీనికి మద్యం ద్వారా వచ్చే అదనపు సుంకాన్ని ఎస్క్రూ చేస్తూ మద్యం డిపోల నుండి వచ్చే ఆదాయాలను ఏపీఎస్డీసీ ఖాతాలకు మళ్లించి.. వాటిని బ్యాంకు రుణాల చెల్లింపులకు వర్తించే విధంగా ఒప్పందాలు చేసుకున్నారు. పదిహేనేళ్ల భవిష్యత్ ఆదాయాలను సైతం జగన్ ప్రభుత్వం తాకట్టు పెట్టడం చూసి దేశం నివ్వెరబోయింది. ఇది రాజ్యాంగంలో పేర్కొన్న బారోయింగ్ కండిషన్లకు పూర్తి విరుద్ధం.

జగన్మోహన్‌రెడ్డి, ఆయన అనుచరుల లూటీలు, దుబారా కారణంగానే రాష్ట్ర ఆదాయాలు అడుగంటాయి. ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తమైంది. గతంలో ఆర్థిక సూచీలో 3, 4వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ని.. జగన్‌రెడ్డి 17వ స్థానానికి దిగజార్చాడని నీతి ఆయోగ్ నివేదిక చాచి కొట్టినట్లు ప్రకటించింది. జగన్‌రెడ్డి నిర్వాకంతో రాష్ట్రంలోని అన్ని రంగాలు దారుణ విధ్వంసానికి గురై వెంటిలేటర్‌పై ఉన్న పేషెంట్‌లా ఏపీ పరిస్థితి మారింది. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా రాష్ట్రాన్ని నిలబెట్టేలా, సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని చూసి ఓర్చుకోలేని జగన్.. అబద్దాలు, కట్టు కథలు, కల్లబొల్లి కబుర్లతో ప్రజా ప్రభుత్వంపై నిందలు వేస్తున్నాడు. ఇకనైనా తీరు మార్చుకోకుంటే రాష్ట్ర ప్రజలే జగన్‌రెడ్డి పార్టీ ఉనికి లేకుండా చేస్తారనడంలో సందేహం లేదు.

- బొర్రా సౌజన్య,
అనలిస్ట్

చైతన్యరథం

# మైనారిటీ సంక్షేమానికి కేంద్ర నిధులు రాబట్టుకోవాలి

- తెలంగాణ నుంచి రావాల్సిన రూ.50 కోట్లపై దృష్టి సారించాలి
- మైనార్టీ సంక్షేమ శాఖపై సమీక్షలో అధికారులకు మంత్రి ఫరూక్ ఆదేశం



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి ఉద్దేశించిన ప్రణాళికల అమలుకు కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను రాబట్టుకునేందుకు ఢిల్లీకి వెళ్లి సాధించాలని మైనార్టీ సంక్షేమశాఖ అధికారులను రాష్ట్రన్యాయ,మైనార్టీ సంక్షేమశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయంలోని తన పేషీలో మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి హర్షవర్ధన్, కమిషనర్ శ్రీధర్, తదితర అధికారులతో మంత్రి సమీక్ష చేశారు. 2024-2025 బడ్జెట్లో కేటాయించిన నిధులను విడుదల చేయించుకోవడంతో పాటు, 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి త్వరలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మైనార్టీ శాఖకు కావాల్సిన ఆర్థిక బడ్జెట్ సంబంధ విషయాలను క్రోడీకరించి పూర్తి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. సీసీ టీవీలు, డ్రోన్లు, తదితర సాంకేతిక పరికరాలను అవసరమున్న చోట వినియోగించాలని సూచించారు. రంజాన్ మాసం సమీపిస్తున్న నేపథ్యంలో మసీదుల నిర్వహణకు ప్రతి నెల రూ.5000 ఆర్థిక సాయం పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గన్నవరం ఎయిర్ పోర్టు నుండి హజ్‌కి వెళ్లే యాత్రికులకు రూ. లక్ష ఆర్థిక సాయం పంపిణీకి సంబంధించి మార్గదర్శకాలు తయారు చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ వాడాలని, పేపర్ ఫైళ్లను వెనక్కి పంపాలని ఆదేశించారు. రాష్ట్రంలోని దర్గాలు, పెద్దపెద్ద మసీదులు, హాస్టళ్లలో సీసీ టీవీలతో పర్యవేక్షణ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మైనార్టీలకు సంబంధించిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకి అందేలా జిల్లాల వారీగా అధికారులు సమీక్షా సమావేశాలు, క్షేత్ర పర్యటనలు చేస్తూ ప్రజా సంబంధాలు కొనసాగించాలని సూచించారు. డీఎస్సీ కోచింగ్, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఐఐటీ, నీట్ పోటీ పరీక్షలకు శిక్షణ,పూర్తయిన పీఎంజేవీకే భవనాలకు సిబ్బంది, బడ్జెట్ కేటాయింపు, నంద్యాలలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, సీఈడీఎం శాఖ ఏర్పాటుపై అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకానున్న నేపథ్యంలో మైనారిటీ సంక్షేమశాఖ డైరెక్ట్ రిక్రూట్మెంట్ ఖాళీలను ఏపీపీఎస్సీ దృష్టికి తీసుకువెళ్లి నోటిఫై అయ్యేలా చర్యలు తీసుకోవడం, ప్రజా ఫిర్యాదులను పరిష్కరించేందుకు, ప్రజలకు సత్వర, కచ్చితమైన సమాచారం అందించేందుకు వీలుగా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. వెబ్‌సైట్లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. తెలంగాణ నుంచి రావాల్సిన రూ.50 కోట్లు, ఫైళ్లు,రికార్డులు పొందేందుకు హైదరాబాదుకు వెళ్లి అక్కడి అధికారులతో మాట్లాడి సాధించాలని అధికారులను మంత్రి ఆదేశించారు

### హైకోర్టు బెంచి, నల్సార్, ఇంటర్నేషనల్‌లా స్కూల్ ఏర్పాటుపై సమీక్ష

కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటు, రాజధాని అమరావతిలో నల్సార్ విశ్వవిద్యాలయం, ఇంటర్నేషనల్ లా స్కూల్ ఏర్పాటుకు సంబంధించి అవసరమైన స్థల సేకరణ, నిధుల కేటాయింపులు, తదితర అంశాలపై రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమీక్షించారు. గురువారం తన పేషీ కార్యాలయంలో న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, తదితరులతో న్యాయ శాఖకు సంబంధించి పాలనాపరమైన పలు అంశాలపై మంత్రి సమీక్ష చేశారు. హైకోర్టు బెంచి, నల్సార్, ఇంటర్నేషనల్ లా స్కూల్ కు సంబంధించి అన్ని చర్యలు వేగవంతం చేయాలని, అవసరమైతే సమావేశాలు, క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని న్యాయశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కొత్త కోర్టుల ఏర్పాటు, కొత్త భవనాలు, క్వార్టర్స్ నిర్మాణానికి, వసతుల కల్పనకు అవసరమైన అంచనాలతో 2025-2026 బడ్జెట్‌లో కేటాయింపుల కోసం నివేదిక తయారుచేయాలని ఆదేశించారు. న్యాయ సలహా కోసం వచ్చే ఫైళ్లకు సంబంధించి వీలైనంత త్వరగా సలహా ఇవ్వాలని మంత్రి సూచించారు. న్యాయశాఖకు సంబంధించి మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వ పథకాల నుండి నిధులు రాబట్టేందుకు అవసరమైతే ఢిల్లీకి వెళ్లేందుకు సిద్ధం కావాలని ఆదేశించారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, స్పెషల్ కోర్టులు, జూనియర్ న్యాయవాదులకు శిక్షణతో పాటు పలు అంశాలపై మంత్రి ఫరూక్ సమీక్ష చేశారు.

## అత్యున్నత స్థానాల్లో బీసీ బిడ్డలు



- ఇదే సీఎం చంద్రబాబు లక్ష్యం
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఉద్ఘాటన

విజయవాడ (చైతన్యరథం): బీసీ బిడ్డలు అత్యున్నత స్థానాల్లో ఉండాలనే సీఎం చంద్రబాబు లక్ష్యం నెరవేరేలా బీసీ యువత సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఉత్తీర్ణులై అత్యున్నత కొలువులు సాధించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆకాంక్షించారు. విజయవాడలోని గొల్లపూడిలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సివిల్స్ కోచింగ్ సెంటర్‌ను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వంట గది, విశ్రాంతి గదులను పరిశీలించారు. అనంతరం సివిల్స్‌కు సిద్ధం అవుతున్న అభ్యర్థులతో మంత్రి సవిత మాట్లాడారు. మౌలిక వసతులు, భోజన సదుపాయం గురించి అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థుల హాజరు, అధ్యాకుల బోధన గురించి కూడా ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు విద్యాబోధన కూడా బాగుందని అభ్యర్థులు సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా బీసీ స్టడీ సర్కిల్ ద్వారా సివిల్స్ సర్వీసెస్ శిక్షణ అందజేస్తున్నామన్నారు. బీసీ బిడ్డలు అత్యున్నత స్థానాల్లోనూ, ఉన్నత కొలువుల్లోనూ నిలవాలన్నది సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకుని సివిల్స్‌లో ఉత్తీర్ణత సాధించాలని మంత్రి సవిత ఉద్బోధించారు. ఇప్పటికే తన దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కారించామన్నారు. ఇంకా సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తనకు ఫోన్ చేయాలంటూ తన ఫోన్ నెంబర్‌ను అభ్యర్థులకు అందజేశారు. గతంలో బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఎంతోమంది సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించారన్నారు. అదే స్ఫూర్తితో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. మీ విజయాలే రాబోయే బీసీ అభ్యర్థులకు సోపానాలని, మెరుగైన ఫలితాలు సాధిస్తే బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా మరింత మందికి వచ్చే విద్యా సంవత్సరం నుంచి సివిల్స్ పరీక్షలకు శిక్షణ ఇవ్వడానికి అవకాశం కలుగుతుందని మంత్రి సవిత తెలిపారు. మీ నుంచి మేం ఆశించేది మీ విజయమే అని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం 30ఏళ్లు వెనక్కి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మంచి ప్రభుత్వాన్ని దూరం చేయాలనే కుట్రలు
- తనను ఓడించిన ప్రజలపై కక్ష సాధింపునకు జగన్ ఎత్తుగడ
- కూటమి ప్రభుత్వ అప్పులపై పిచ్చి ప్రేలాపనలు
- 30 ఏళ్లు అధికారంలో కాదు.. జగన్ జీవితాంతం జైల్లో ఉండాలి
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల ధ్వజం



అమరావతి (చైతన్యరథం): ఒక్కఛాన్స్ ఇస్తే రాష్ట్రం స్థితిగతులు మార్చేస్తా... మీ బతుకులన్నీ మార్చేస్తా... అని 2019 ఎన్నికల ముందు ఆర్భాట ప్రచారం చేసిన జగన్మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు అధికారం ఇస్తే...రాష్ట్రాన్ని 5 ఏళ్లలో 30ఏళ్లు వెనక్కి నెట్టాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు విమర్శించారు. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి ఐదేళ్లలో రూ.12 లక్షల కోట్లు పైబడి అప్పులు చేసిన జగన్మోహన్‌రెడ్డి నేడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అప్పులు చేసిందని మాట్లాడడం హాస్యాస్పదం అన్నారు.కూటమి ప్రభుత్వం చేసిన రూ.60వేల కోట్ల అప్పు..రైతులకు, జగన్‌రెడ్డి తన పాలనలో పెట్టిన పెండింగ్ బకాయిలు, పెన్షన్లు, జీతాలకు వాడారే తప్ప... జగన్మోహన్‌రెడ్డి మాదిరి స్కీముల చాటున స్కాములు చేయలేదని స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం స్కీముల పేర్లు చెప్పి అప్పులు చేయలేదనే విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసు. జగన్మోహన్‌రెడ్డివి దోచుకునే స్కీములు అయితే... కూటమి ప్రభుత్వం తెచ్చే స్కీములు ప్రజలను సొంతకాళ్లపై నిలబెట్టేవి అనే విషయాన్ని జగన్ గమనించాలి. 2019-2024 మధ్య కాలంలో తాలిబన్ల మాదిరి పరిపాలన చేసిన జగన్మోహన్‌రెడ్డి నేడు రెడ్ బుక్ రాజ్యాంగం అని చేస్తున్న వ్యాఖ్యలు దొంగే దొంగ.. దొంగ.. అని అన్నట్లు ఉంది. జగన్ పాలనలో రాజ్యాంగానికి అడుగడుగునా తూట్లు పొడిచారు. ప్రజాస్వామ్యాన్ని మంటగలిపారు. అవినీతి, అరాచకం రాజ్యమేలింది. ప్రజలను సంక్షేమానికి, అభివృద్ధికి దూరం చేశారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారు. మూడు ప్రాంతాలతో మూడు ముక్కలాటలాడి... ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టాలని జగన్ అండ్ కో అనేక కుట్రలు చేశారు. వారానికి ఒకరోజు ఏపీకి వచ్చే టూరిస్టు జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర రాజకీయాలు, సంక్షేమం, ప్రజల గురించి మాట్లాడడం చూస్తేంటే అతని మానసిక స్థితి ఇంకా బాగుపడినట్లు లేదనే విషయం స్పష్టంగా అర్థమవుతోందని యనమల ధ్వజమెత్తారు.

### ప్రజలపై కక్ష పెంచుకున్న జగన్

తనను ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని రాష్ట్ర ప్రజలపై జగన్ కక్ష పెంచుకున్నాడు. మంచి పరిపాలన, ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చే ప్రభుత్వం, ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ప్రజలకు దూరం చేసి...ప్రజలకు లేని పోని అబద్ధాలు చెప్పి మోసం చేసి తాను అధికారంలోకి వచ్చి, ప్రజలపై కక్ష తీర్చుకోవాలని జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలు ప్రజలకు కళ్లకు కట్టినట్లు కనబడుతున్నాయి. జగన్మోహన్‌రెడ్డి మరోసారి అబద్ధాలతో తన అవినీతి పునాదులను నిలబెట్టుకోవాలని, తన అవినీతి సామ్రాజ్యాన్ని పునఃనిర్మించుకోవాలని ఆరాటపడుతున్నాడు. మనిషికి విషం ఎంత ప్రమాదమో...జగన్మోహన్ రెడ్డి పరిపాలన కూడా అంతే ప్రమాదం అని గత ఐదేళ్లలో నిరూపితమైందని యనమల దుయ్యబట్టారు.

### జీవితాంతం జైల్లో ఉండాలి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అడుగడుగునా ద్రోహం చేసిన జగన్మోహన్ రెడ్డి మరోసారి వారిని అధఃపాతాళానికి తొక్కాలని చేస్తున్న ప్రయత్నాలు ఎప్పటికీ సఫలీకృతం కావు. మరోసారి జగన్ చేతిలో హత్యలకు గురికావడానికి దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీలు సిద్ధంగా లేరు. జగన్మోహన్ రెడ్డి వద్దు అని రాష్ట్రమంతా ఓటుతో తమ వైఖరిని విస్పష్టంగా వెల్లడిస్తే... జగన్మోహన్‌రెడ్డి ప్రజల తీర్పును పలుమార్లు తప్పు బట్టడం... అవమానించడం వంటివి చేస్తున్నాడు. జగన్మోహన్‌రెడ్డి కుట్రలు, కుతంత్రాలకు కాలం చెల్లింది. కూటమి ప్రభుత్వం... ప్రజల ప్రభుత్వం, ప్రజలు ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వం. ఐదేళ్ల పాటు అరాచకాలకు గురైన మహిళలు జగన్మోహన్‌రెడ్డిని ఛీదరించుకున్నారు. కనీసం గత ఐదేళ్లలో రోడ్డు మీదకు రావాలన్నా భయపడిన మహిళలు..నేడు స్వేచ్ఛా వాయువులు పీల్చడం జగన్‌కు నచ్చడం లేదు. అందుకే రాష్ట్రంపై కక్ష పెంచుకుని,ఆగ్రహంతో రగిలిపోతున్నాడు. ప్రజలను సంక్షేమ పథకాల పేరుతో రెచ్చగొట్టి, తన కక్ష తీర్చుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. జగన్ కుట్రలను రాష్ట్ర ప్రజలంతా అర్థం చేసు కున్నారు, నమ్మే పరిస్థితుల్లో లేరు. జగన్మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో చేసిన తప్పులు,చట్టాల ఉల్లంఘనలు, దోపిడీలు, హత్యలు, ఇతర అరాచకాలకు 30ఏళ్లు సీఎంగా ఉండడం కాదు... జీవితాంతం జైల్లో ఉండాల్సిందేనని యనమల స్పష్టం చేశారు.

# ఏపీ మంత్రులకు ర్యాంకులు..

## ఫస్ట్ ఫరూఖ్, లాస్ట్ సుభాష్

అమరావతి (చైతన్య రథం): డిసెంబరు వరకు దస్త్రాల క్లియరెన్స్‌లో మంత్రుల పనితీరును ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గ సమావేశంలో వెల్లడించారు. తాను 6వ స్థానంలో ఉన్నట్టు వెల్లడించారు. దస్త్రాలు వేగంగా క్లియర్ చేయాలని మంత్రులకు సూచించారు.

**మంత్రులకు సీఎం చంద్రబాబు కేటాయించిన ర్యాంకులివే..**

1 ఎన్‌ఎండీ ఫరూఖ్
2. కందుల దుర్గేశ్
3. కొండపల్లి శ్రీనివాస్
4. నాదెండ్ల మనోహర్
5. డోలా బాలవీరాంజనేయస్వామి
6. సీఎం చంద్రబాబు
7. సత్యకుమార్
8. నారా లోకేశ్
9. బీసీ జనార్ధన్రెడ్డి
10. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
11. సవిత
12. కొల్లు రవీంద్ర
13. గొట్టిపాటి రవికుమార్
14. నారాయణ
15. టీజీ భరత్
16. ఆనం రామనారాయణ రెడ్డి
17. అచ్చెన్నాయుడు
18. రాంప్రసాద్ రెడ్డి
19. గుమ్మడి సంధ్యారాణి
20. వంగలపూడి అనిత
21. అనగాని సత్యప్రసాద్
22. నిమ్మల రామానాయుడు
23. కొలుసు పార్థసారథి
24. పయ్యావుల కేశవ్
25. వాసంశెట్టి సుభాష్

# సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

## సిమెంట్ ఫ్యాక్టరీల యాజమాన్య ప్రతినిధులతో భేటీలో మంత్రి సుభాష్ హామీ



అమరావతి (చైతన్యరథం): సిమెంట్ ఫ్యాక్టరీల కార్మికులు, యాజమాన్యాల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. గురువారం సచివాలయంలో సిమెంట్ ఫ్యాక్టరీల యాజమాన్యాలతో మంత్రి సుభాష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిమెంట్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రికి యాజమాన్య ప్రతినిధులు విన్నవించారు. ఈ భేటీలో కార్మికుల సమస్యలపైనా మంత్రి సుభాష్ చర్చించారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ భేటీ లో కార్మికుల సమస్యలపైనా మంత్రి సుభాష్ చర్చించారు. యాజమాన్యాల సమస్యలను పరిష్కరిస్తూనే.. కార్మికులకు కూడా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

# హంద్రీనీవా పనులపై నిమ్మల సమీక్ష

## హాజరైన సత్యకుమార్ యాదవ్, సవిత



విజయవాడ(చైతన్యరథం): హంద్రీనీవా ప్రాజెక్టు పనుల పురోగతిపై సంబంధిత ప్రాంతాల మంత్రులు, ఎమ్మెల్యేలతో విజయవాడ ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో గురువారం మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్షించారు. మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత, కదిరి ఎమ్మెల్యే కందికోట వెంకటప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే రాజు, హిందూపూర్ ఎమ్మెల్యే ప్రతినిధి శ్రీనివాసరావు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు. గత ఐదేళ్ల పాలనలో హంద్రీనీవాకు అర బస్తా సిమెంట్, ఒక రూపాయి కూడా జగన్ ఖర్చు పెట్టలేదని మండిపడ్డారు.

హంద్రీనీవా ప్రాజెక్టులో ఉన్న పంపులను కూడా పూర్తి సామ ర్ధ్యంతో ఉపయోగించుకోలేకపోయారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2629 కోట్లతో చంద్రబాబు హంద్రీనీవా ప్రాజెక్టు పనులు ప్రారంభించారని తెలిపారు.

# అదుపులోనే నిత్యావసరాల ధరలు



- జాతీయ సగటు కంటే తక్కువే
- రవాణా ఖర్చులపై సమీక్షించుకోవాలి
- పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్
- ధరలపై మంత్రుల కమిటీతో సమావేశం

అమరావతి(చైతన్యరథం): పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన సచివాలయంలో గురువారం ధరల పర్యవేక్షణపై మంత్రుల కమిటీ సమావేశం జరిగింది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముఖ్యంగా మార్కెట్ ధరలపై నిత్యం పర్యవేక్షణ, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు, మిల్లెట్ల కు ప్రోత్సాహం, ప్రస్తుతం మార్కెట్‌లో ధరల పరిస్థితిని చర్చించారు.

నాదెండ్ల మాట్లాడు తూ గత డిసెంబర్‌లో ఆంధ్రప్రదేశ్ ద్రవ్యోల్బణం రేటు 4.34% కాగా.. జాతీయ సగటు 5.22% కంటే తక్కువగా ఉందన్నారు. 154 మండల కేంద్రాల్లోని సీపీ యాప్ ద్వారా ప్రతిరోజూ ధరల సేకరణపై విశ్లేషణ, అదేవిధంగా 151 రైతుబజార్ ధరలను విశ్లేషిస్తు న్నట్లు చెప్పారు. 69 నిత్యావసర సరుకులు ధరలను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. వీటిలో ధాన్యాలు, కూరగాయలు, వంటనూనెలు, మసాలాలు ఉన్నాయని పేర్కొన్నారు. గత ఏడా దితో పోల్చితే కందిపప్పు (13%), గ్రౌండ్‌నట్ ఆయిల్ (4%), మిర్చి (27%) ధరలు తగ్గినట్లు వివరించారు. ఏపీ మిషన్ మిల్లెట్ వంటి పథకాల ద్వారా జొన్నలు, రాగులను ప్రోత్సహించేందుకు నిర్ణయించారు. మిడ్-డే మీల్స్, సంక్షేమ పథకాలలో మిల్లెట్లు చేర్చడం, మిల్లెట్ వాడకాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై చర్చించారు. రైతులకు ధరల సమాచారం ఎప్పటికప్పుడు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణా ఖర్చులు అధికంగా ఉండటంతో కొన్ని ప్రాంతాల్లో ధరలు పెరగడా నికి కారణంగా విశ్లేషిస్తూ ధరల అదుపునకు తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికా రులకు ఆదేశాలు జారీ చేశారు.

# జగన్‌వి ఉత్తర కుమార ప్రగల్భాలు

- పెద్దిరెడ్డి కుటుంబ అక్రమాలపై కొత్త పేర్లను కూడా ఆయనే బయట పెట్టుకుంటున్నారు
- వైసీపీ కోలుకుంటుందనే నమ్మకం లేకనే నేతలు ఆ పార్టీని వీడుతున్నారు
- మంత్రి డోలా డోలా ఎద్దేవా




అమరావతి (చైతన్యరథం): గుమ్మడి కాయ దొంగెవ్వరంటే జగన్‌రెడ్డి భుజాలు తడుముకుంటూ.. పెద్దిరెడ్డి కుటుంబ అక్రమాలపై మీడియాలో రాయని పేర్లను కూడా ఆయనే బయటపెట్టుకుంటున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఎద్దేవా చేశారు. గురువారం నాడు వెలగపూడి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... జగన్, ఆయన బ్యాచ్‌లో తప్పులు చేసినవారికి శిక్ష తప్పదని స్పష్టం చేశారు. జగన్ అహంకారానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పి 11 సీట్లకు పరిమితం చేసినా ఆయనలో ఎ మాత్రం మార్పు రాలేదని విమర్శించారు. జగన్ మానసిక పరిస్థితి బాగాలేనందునే ప్రస్తుతం 0.0లో ఉన్న వ్యక్తి 2.0 అంటున్నాడన్నారు. జగన్ పార్టీ మళ్లీ కోలుకోడం అసాధ్యమనే భావనతోనే నేతలు ఒక్కొక్కరుగా వైసీపీని వీడుతున్నారు. వైసీపీని, జగన్‌ని ప్రజలు ఎప్పుడో బంగాళాఖాతంలో కలిపేశారు. మేము గేట్లు తెరిస్తే ఆ పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలంతా కూటమిలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారు. జగన్ అసెంబ్లీకి రావడం లేదంటే ఆయనకు ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధి లేనట్టేనని మంత్రి డోలా వ్యాఖ్యానించారు. సూపర్ సిక్స్ గురించి మాట్లాడుతున్న జగన్ నవరత్నాలు ఎప్పటినుంచి అమలు చేశారో చెప్పాలన్నారు. నాడు ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు ప్రజలు జగన్ చొక్కా పట్టుకుంటారనే భయంతోనే ప్రజల్లో రాకుండా జగన్ పరదాల మాటున తిరిగారు. జగన్‌లా మేం ప్రజలను మోసం చేయం, ప్రజలకిచ్చిన అన్ని హామీలు అమలు చేస్తామని మంత్రి డోలా స్పష్టం చేశారు.

# మంత్రి మండిపల్లితో ఆర్టీసీ రీజనల్ చైర్మన్లు, డైరెక్టర్ల భేటీ

అమరావతి (చైతన్యరథం): ఏపీఎస్ ఆర్టీసీని లాభాలబాట పట్టించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సంస్థ రీజనల్ చైర్మన్లు, బోర్డు డైరెక్టర్లతో రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చర్చించారు. రాష్ట్రంలోని ఆర్టీసీ రీజనల్ జోన్ బోర్డు చైర్మన్లు, నూతనంగా నియమితులైన ఆర్టీసీ బోర్డు డైరెక్టర్లు గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి మండిపల్లిని మర్యాదపూర్వకంగా కలిశారు. విజయనగరం జోనల్ చైర్మన్ దున్నుదొర, విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి, కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు, తదితరులు మంత్రి మండిపల్లిని కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం రానున్న రెండేళ్లు పాటు ఆర్టీసీ వ్యవహారాలు, పర్యవేక్షించాల్సిన అంశాలపై రీజనల్ ఛైర్మన్లు, బోర్డు డైరెక్టర్లతో మంత్రి చర్చించారు.



**మంత్రి మండిపల్లిని కలిసిన మిస్ గ్లోబల్ ఆసియా విజేత**

మలేషియాలో జరిగిన మిస్ గ్లోబల్ ఏషియా పోటీల్లో విజయం సాధించిన భావన సచివాలయంలోని రవాణా శాఖ మంత్రి చాంబర్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ గారిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి జిల్లాకు చెందిన భావన మోడలింగ్‌పై మక్కువతో ర్యాంప్ వాక్, ఇతర అంశాల్లో శిక్షణ తీసుకుని రాణిస్తోంది. చదువుతో పాటు మోడలింగ్‌లోనూ రాణిస్తున్న భావనను మంత్రి మండిపల్లి ఈ సందర్భంగా అభినందించారు.

# బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు పెంపు

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత వెల్లడి
- ఈ నెల 12 వరకూ దరఖాస్తుల స్వీకరణ
- 2 నెలల్లో యూనిట్లు గ్రౌండయ్యేలా చర్యలు
- అర్హులకే ఆర్థిక చేయూత ఇవ్వాలి



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బీసీ కార్పొరేషన్ల రుణాలను అర్హులందరికీ అందజేయాలని, గడువులోగా యూనిట్లు గ్రౌండింగ య్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. లబ్ధిదారుల నుంచి వస్తున్న వినతుల ను దృష్టిలో పెట్టుకుని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సహా వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న యూనిట్లకు రుణాల దరఖాస్తుల గడవును ఈ నెల 12 వ తేదీన వరకూ పొడిగిస్తున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. గురువారం విజయవాడ నగరం గొల్లపూడిలోని బీసీ భవన్‌లో వివిధ బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లతో రుణాలు-సద్వినియోగంపై అవగా హన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, వెనుకబడిన తరగతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని స్వయం ఉపాధి పథ కాల కోసం రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరం మరో 2 నెలల్లో ముగినుందని, తక్షణమే అర్హులను గుర్తించే ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో అర్హులకుమాత్రమే ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రభుత్వం అందజేసే ఆర్థిక చేయూతను వినియోగించుకునేలా లబ్ధిదారుల్లో చైతన్యం కలిగించి, తక్షణమే యూనిట్లు గ్రౌండింగయ్యేలా చూడాలన్నారు.ప్రస్తుత ప్రభుత్వంలో కార్పొరేషన్లకు విధులతో పాటు నిధులు కూడా కేటాయించామన్నారు.

## గడువు పెంపు లబ్ధిదారులకు తెలిసేలా చూడాలి

స్వయం ఉపాధి కల్పనకు స్వీకరిస్తున్న దరఖాస్తుల గడువును ఈ నెల 12 తేదీ వరకూ పొడిగించిన విష యంపై జిల్లాల్లో లబ్ధిదారులకు సమాచారమందించా లని మంత్రి సవిత సూచించారు. కుల,ఆదాయ ధ్రువీ కరణ పత్రాల జారీలో ఆలస్యం చోటుచేసు కోకుండా తహసీల్దార్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. రాబోయే బడ్జెట్‌లో బీసీ కార్పొరేషన్లకు మరింత ఎక్కువగా నిధులు కేటాయించేలా కృషి చేస్తామన్నారు. కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు వ్యక్తం చేసిన సమస్యల ను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి పరి ష్కారానికి కృషిచేస్తానని మంత్రి సవిత హామీఇచ్చారు. అనంతరం మంత్రి సవితను కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు వీరంకి గురుమూర్తి, డూండీ రాకేష్, నందం అబద్ధయ్య, సదాశివం, దేవేంద్రప్ప, కృష్ణంనాయుడు, చిలకలపూడి పాపారావు, సావిత్రి, పీవీజీ కుమార్, మళ్ల సురేంద్ర, కప్పట్రాల సుశీలమ్మ, పాలవలస యశస్విని, నరిసింహా యాదవ్ సహా పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

# ఆర్థిక ఉగ్రవాది జగన్‌రెడ్డి అబద్ధాలు

- ఆర్థిక వ్యవస్థపై నీతులు మాట్లాడటం విడ్డూరం
- రూ.10 లక్షల కోట్ల అప్పులతో విధ్వంసం చేశారు
- 199 హామీలు నెరవేర్చకుండా గంగలో కలిపారు
- ఐదేళ్ల విధ్వంస పాలనలో వ్యవస్థలు సర్వనాశనం
- అందుకే ఆయన పార్టీని ఓడించి గంగలో కలిపారు
- పులివెందుల పోతుంది.. జైలుకు పోవడం తథ్యం
- ప్రెస్ మీట్ పెట్టి అసత్యాలు చెబితే ప్రజలు నమ్మరు
- కూటమి ప్రభుత్వంపై కుతంత్రాలు మానుకోవాలి
- చంద్రబాబు వ్యవస్థలను గాడిలో పెడుతున్నారు
- గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు చెల్లిస్తున్నారు
- శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ



మంగళగిరి(చైతన్యరథం): రాష్ట్ర ఆర్థిక రంగాన్ని చిన్నాభిన్నం చేసి అన్ని రంగాలను అథఃపాతాళంలోకి నెట్టేసిన జగన్‌రెడ్డి నేడు కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడం విడ్డూ రంగా ఉందని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ మండిపడ్డారు. చెప్పిన అబద్ధాన్నే మరలా మరలా చెప్పడం, అబద్ధాలను నిజాలుగా చిత్రీకరించడంలో జగన్‌రెడ్డి ఆరితేరాడని ధ్వజమెత్తారు. గురువారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జగన్‌రెడ్డి వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తిని సంబోధించిన తీరు జగన్‌రెడ్డి సంస్కారహీనుడనడానికి నిదర్శనం. చంద్రబాబును ఏకవచనంతో సంబోధించడాన్ని మేము తీవ్రంగా ఖం డిస్తున్నాం. చంద్రముఖిలా ప్రవర్తించి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసిన నీ చంద్రముఖి ప్రవర్త నను చూసి ఓటర్లు రజనీకాంత్‌లా మారి నీ మాడు పగులగొట్టినా బుద్ధి రాలేదు. ఆర్థిక ఉగ్రవాదైన ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడడం విడ్డూరం. లక్షల కోట్లు లూటీలు చేసిన 31 క్రిమినల్ కేసుల్లో నిందితుడు ప్రజలకు సమాధానం చెప్పలేక పారిపోయిన వ్యక్తి విలువలు, విశ్వనీయత, విధ్వంసాల గురించి మాట్లాడడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశా రు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు గంటల పాటు కూటమి ప్రభుత్వంపై పచ్చి అబద్ధాలాడాడు. మీడియాను దొంగలముఠా అంటూ కొన్ని ఛానెళ్లపై ఆయన విరుచు కుపడ్డాడు. జగన్‌రెడ్డి కన్నా మరో దొంగల ముఠా ఈ రాష్ట్రంలోనే కాదు దేశంలోనే లేద ని ప్రజలు గుర్తించే ఇంటికి పంపారని హితవుపలికారు. 90 శాతం ఆర్థిక నేరగాళ్లు, హత్యలు, మహిళలను మోసం చేసినోళ్లకు ఎంపీ, ఎమ్మెల్యేల సీట్లిచ్చిన మీరు దొంగల ముఠా అంటూ మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

## చంద్రబాబు గాడిలో పెడుతున్నారు

జగన్‌రెడ్డి విధ్వంసం చేసిన ప్రజారాజధాని అమరావతి, పోలవరాన్ని నేడు చంద్రబాబు వేగ వంతం చేశారు. ఐదేళ్లలో జగన్‌రెడ్డి యువతకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు. నేడు 20లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. అది 90 శాతం పూర్తి కాబోతుందని దావోస్ పర్యటనతో తేలి పోయింది. జగన్‌రెడ్డి నాశనం చేసిన అనేక సంక్షేమ పథకాలను చక్కదిద్దుతున్నారు. రూ.4వేల సామాజిక పెన్షన్, దివ్యాంగులకు రూ.6వేలు, మంచంలో ఉన్న వారికి రూ.15 వేలు పెన్షన్ అందించి దాదాపు 64 లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపారు. లేని చట్టాలను తీసుకువచ్చి రాష్ట్రంతో జగన్‌రెడ్డి ఐదేళ్లు ఆడుకున్నాడు. 30 వేల మంది ఆడపిల్లలు ఏమ య్యారో తెలియలేదు. రాష్ట్రాన్ని గంజాయికి అడ్డాగా మార్చారు. విద్యారంగాన్ని జగన్‌రెడ్డి భ్రష్టు పట్టించా డు. నేడు కూట మి ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపింది. గాడితప్పిన విద్యా రంగాన్ని లోకేష్ గాడిలో పెట్టేందుకు అహర్నిశలు కష్టపడుతు న్నారు. 80శాతం విధానపరమైన నిర్ణయాలను తీసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్య, పాఠశాలల్లో అనువైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఐదేళ్ల ల్లో జగన్‌రెడ్డి పారిశ్రామిక రంగాన్ని ఏనాడు పట్టిం చుకోలేదు. విశాఖపట్టణాన్ని నాశనం చేసి రుషి కొండపై సుమారు రూ.500 కోట్లతో విశాలవంత మైన భవనాన్ని కట్టుకున్నాడు. ప్రజాధనాన్ని వృథా చేసిన ఆయన నేడు ఉత్తముడిలా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడటం సిగ్గుచేటు. నేడు విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం అడుగు లు వేస్తోంది. రూ.2 లక్షల విలువైన ప్రాజెక్టులకు ఏకంగా దేశ ప్రధానే వచ్చి శంకుస్థాపన చేయించిన ఘనత చంద్రబాబుది. స్టీల్ ప్లాంట్‌ను అమ్మేసి ఆస్తులు పంచుకుందామని జగన్‌రెడ్డి చేయని ప్రయత్నం లేదు. నేడు స్టీల్ ప్లాంట్ పరిరక్షణ బాధ్యతను తన భుజాలపై వేసుకుని ఆర్థిక భరోసాతో పాటు శాశ్వత పరిష్కారా న్ని తీసుకువచ్చిన ఘనత చంద్రబాబుది. పెట్టుబడుల గురించి మా ట్లాడే అర్హత జగన్‌రెడ్డికి లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల్లోనే రాష్ట్రానికి రూ.6 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. జగన్‌రెడ్డి నాశనంచేసిన విద్యుత్‌రంగానికి నూతన సంస్కరణలు తీసుకువచ్చి కాపాడారు. చంద్రబాబు నాడు టీడీపీ హ యాంలో ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానాన్ని గత వైసీపీ రద్దు చేసి బ్లాక్‌లో ఇసుకను అమ్ముకుని వేల కోట్లు సంపాదించారు. ఇసుకను దూరం చేసి భవననిర్మాణ రంగాన్ని అథఃపాతాళంలోకి జగన్‌రెడ్డి నెట్టాడు. కూటమి వచ్చాక ఇసుకను ఉచితం చేసి భవన నిర్మాణ రంగాన్ని కాపాడారని పేర్కొన్నారు.

## రూ.10 లక్షల కోట్ల అప్పులతో విధ్వంసం

రాష్ట్ర అప్పుల గురించి ఆర్థిక ఉగ్రవాది కాకమ్మ కబుర్లు చెబుతున్నాడు.ప్రెస్‌మీట్ పెట్టేముందు అప్పుల గురించి పూర్తిఅవగాహనతో పెట్టాలనిసూచిస్తున్నా. నాడు జగన్‌రెడ్డి ప్రభుత్వం పెట్టిన బకాయిలు కేవలం రూ.6.46 లక్షల కోట్లు మాత్రమే అని చెబుతున్నాడు. కానీ రూ.1.40లక్షల కోట్ల ఇతర బకాయిలు చెల్లించా ల్సి ఉంది.బడ్జెటేతర అప్పులు రూ.2లక్షల కోట్లకుపైగా ఉంది. ఇవన్నీ కలిపితే రూ.9.72 లక్షల కోట్లకు పైగా జగన్‌రెడ్డి అప్పులు చేసినట్లు తేలింది. ఇన్ని అప్పులు చేసి ఒక్క రూపాయి కూడా రాష్ట్రానికి ఆదాయం రాకుండా చేసి నాశనం చేసిన ఆర్థిక విధ్వంసకుడు జగన్‌రెడ్డి. జగన్‌రెడ్డి పెట్టిన బకాయిలను తీర్చడానికి రోజుకు 18 గంటలు చంద్రబాబు పని చేయాల్సి వస్తుంది. ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.2,200 కోట్లు, ధాన్యం కొనుగోలు బకా యిలు రూ.1,674 కోట్లు, ఇళ్లు కట్టుకోవడానికి ఇవ్వాల్సిన బకాయిలు రూ.7,800 కోట్లు, ఉద్యోగస్తులకు చెల్లించాల్సిన బకా యిలు రూ.20వేల కోట్లు, విద్యాశాఖలో బకాయిలు రూ.3,800కోట్లు. ఆఖరికి చిక్కీలకు కూడా రూ.200 కోట్లు బకాయిలు పెట్టాడు. కూలీలకు కూడా ఊపాధి హామీ బకాయిలు రూ.2,100కోట్లు పెట్టిన పార్టీ వైసీపీ. ఇలా అన్నిశాఖల్లో బకాయిలు పెట్టిపోయారు. విద్య, విద్యను బోధించే వారి విలువ కూడా ఆయ నకు తెలియదు. అది తెలియకే కరోనా సమయంలో మద్యం దుకాణాల ముందు కాపలాకు డ్యూటీలు వేయించాడని విరుచుకుపడ్డాడు.

## నాడు సెలక్షన్స్.. నేడు ఎలక్షన్స్..

వైసీపీ కార్పొరేటర్లే తమ పార్టీల్లోకి వచ్చేస్తామని బతిమలాడుకుంటున్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 16శాతం రిజర్వేషన్‌ను తీసేసి చోద్యం చూసిన జగన్ రెడ్డి నేడు మున్సిపల్ ఎన్నికల గురించి మాట్లాడుతు న్నాడు. నేడు చట్టబద్ధంగా మున్సిపాలటీల్లో మేయర్లు, డిప్యూటీ మేయర్లను కార్పొరేటర్లు ఎన్నుకున్నారు. కానీ జగన్‌రెడ్డి హయాంలో మున్సిపాలి టీలు, పంచాయతీ ఎన్నికల్లో జరిగినవి ఎలక్షన్స్ కావు సెలక్షన్స్ అని తెలిపారు.

## 199 హామీలు పాయే.. జగన్‌రెడ్డి పాయే

జగన్ రెడ్డి పుణ్యమా అంటూ వచ్చిన 151 సీట్లు పాయే.. సొంత చెల్లి పాయే.. ఫ్రస్టేషన్‌లో జగన్‌రెడ్డి బుర్ర పాయే. త్వరలో పులివెందుల పాయే.. జగన్‌రెడ్డి శాశ్వతంగా బెంగళూరు ప్యాలెస్ నుంచి జైలుకు పాయే.. ఇది తథ్యం. జగన్‌రెడ్డి 2019 అధికారంలోకి వచ్చే ముందు ప్రజలు అనేక హామీలిచ్చాడు. మద్యం పానం నిషేధం పాయే.. ఐదేళ్లలో 25లక్షల ఇళ్లు కట్టి స్తానని చెప్పిన మాట పాయే.. ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పాయే..బీసీ సంక్షేమానికి ఏటా రూ.15 వేల కోట్లు ఇస్తామన్న మాట పాయే.. అన్ని నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ లు ఇస్తామని, చట్టం తీసుకువస్తామన్న హామీపాయే.. ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.5 లక్షల భీమా ఇస్తామన్న మాట పాయే.. అర్చకులకు పాయే.. కుల మతతత్వం లేని సమసమాజవర్గం కోసం పాటు పడతామన్న మాట పాయే.. సీపీఎస్ రద్దు పాయే.. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ మాట పాయే.. 27శాతం ఐఆర్ హామీ పాయే.. స్కూల్స్‌లో మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచుతామన్న మాట పాయే..జాబ్ క్యాలెండర్ పాయే..ఇలా సుమారు 199 వాగ్దానాలన్నీ పాయే. ఈ హామీలను గంగలో కలిపాడు కాబట్టే ప్రజలు జగన్‌రెడ్డిని, వైసీపీని గంగలో కలిపేశారని హితవుపలికారు.అన్ని వ్యవస్థలను కూటమి వచ్చిన ఏడు నెలల్లోనే గాడిలో పెట్టాం. జగన్‌రెడ్డి పెట్టిన బకాయిలను ఒక్కొ క్కటిగా తీర్చు కుంటూ వస్తున్నాం. ఇది చూసి ఓర్వలేని జగన్‌రెడ్డి భూటకపు ప్రెస్ మీట్ పెట్టి అసత్యాలు చెబితే ప్రజలు నమ్మేస్థితిలో లేరు. అబద్ధాన్ని నిజాలుగా చిత్రీకరించాలనే కుతంత్రాన్ని జగన్‌రెడ్డి ఇకనైనా మానుకోవాలని హితవుపలికారు.

చైతన్యరథం

# రుణం ఇప్పిస్తామని మూడెకరాల భూ కబ్జా

- ప్రశ్నిస్తే రౌడీలను పెట్టి బెదిరిస్తున్నాడు
- నంద్యాలకు చెందిన వైసీపీ నాయకుడి దందా
- టిడ్కో ఇలు ఇప్పిస్తామని రూ.5 లక్షలకు టోకరా
- ప్రజావినతుల కార్యక్రమంలో బాధితుల ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన రెడ్డప్పగారి శ్రీనివాసులు, అశోక్‌బాబు







మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా వినతుల కార్యక్రమంలో భూ కబ్జాలు, మోసాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల నుంచి అర్జీదారులను పొలిట్‌బ్యూరో సభ్యులు రెడ్డప్ప గారి శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్సీ అశోక్‌బాబు అర్జీలు స్వీకరించారు.

నంద్యాల జిల్లా సంజామల మండలం నొస్సం గ్రామానికి చెందిన అల్లూరి సత్యరాజు సమస్యను వివరిస్తూ తన తండ్రి దేవరాజు పేరుపై ఉన్న 3 ఎకరాల డీకే పట్టాను అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మలికిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి తమ ప్రభుత్వం వస్తే రుణం ఇప్పిస్తానని చెప్పి తన తండ్రి నుంచి తీసుకున్నట్లు ఫిర్యాదు చేశారు. తన తండ్రి మరణించిన తర్వాత ఆ భూమిని తనదేనని రౌడీలను పెట్టి బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. తన భూమిని విడిపించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

– సర్వే నెం.488-1లో ఉన్న తన 5 ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన కాపు శ్రీదేవి అనే మహిళ తన పేరుకు బదిలీ చేసుకున్నట్లు అనంతపురం జిల్లా కుందుర్తి మండలం యర్రగుంట గ్రామానికి చెందిన ఎం.మంజునాథ్ ఫిర్యాదు చేశారు. ఉన్నతాధి కారులు విచారణ చేసి తన భూమిని కబ్జా నుంచి విడిపించి వారిపై కఠిన చర్యలు తీసు కోవాలని కోరారు.

– 2018లో టిడ్కో ఇంటిని అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయిస్తే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఇంటిని రద్దు చేశారని విశాఖపట్నం డాబా గార్డెన్స్‌కు చెందిన వృద్ధురాలు కున్నత్తు నాగమణి ఆవేదన వ్యక్తం చేసింది. తనకు ఇల్లు ఇప్పించి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేసింది.

– విజయవాడ రామవరప్పాడుకు చెందిన రామ్, పోరంకికి చెందిన పృథ్వీ అనే ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వం నుంచి ఇల్లు ఇప్పిస్తామని నాలుగేళ్ల క్రితం రూ.5 లక్షలు తీసుకుని మోసం చేశారని విజయవాడకు చెందిన పఠాన్ సూరియా సుల్తాన్ ఫిర్యాదు చేసింది. వారిపై కఠిన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

– పల్నాడు జిల్లా గురజాల మండలం గంగవరం గ్రామానికి చెందిన పేరుపోగు ఏసమ్మ సమస్యను వివరిస్తూ తనకు చెందిన 3.1/2 సెంట్ల భూమిని గ్రామానికి చెందిన పేరుపోగు పెదమల్లయ్య ఆక్రమించుకున్నాడని ఫిర్యాదు చేసింది. తన భూమిని కబ్జా నుంచి విడిపించి న్యాయం చేయాలని కోరారు.

– తన గ్రామంలో నాలుగేళ్లుగా ఉన్న తాగునీటి సమస్య, స్మశాన వాటిక సమస్యలు పరిష్కరించాలని అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం జంపపాలెం గ్రామానికి చెందిన శిలపరశెట్టి సత్యనాగదేవికి విజ్ఞప్తి చేశారు.

– గత ప్రభుత్వంలో తన భూమికి సంబంధించిన సర్వే నెంబర్లను వైసీపీ నాయకు లు తప్పుగా నమోదు చేయించారని తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన కుదుపూడి రామారావు ఫిర్యాదు చేశారు.

# లక్షల కోట్ల అప్పులు.. అభివృద్ధి శూన్యం

- జగన్‌రెడ్డీ ప్రజలకు సమాధానం చెప్పు
- రాష్ట్రాన్ని లూటీ చేసి కాకమ్మ కబుర్లా
- ప్రభుత్వంపై విషప్రచారం చేస్తే నమ్మరు
- పులివెందులకే నీళ్లివ్వని నువ్వా మాట్లాడేది
- వాలంటీర్లు, నిరుద్యోగులను మోసగించారు
- ప్రాజెక్టులను భ్రష్టు పట్టించి రైతులను ముంచావ్
- అందుకే గాలికి పుట్టిన పార్టీ వైసీపీ గాలి తీశారు
- చంద్రబాబు సారథ్యంలో అభివృద్ధి దిశగా అడుగులు
- చెప్పిన విధంగా సూపర్‌సిక్స్ అమలు చేస్తున్నాం
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి



మంగళగిరి(చైతన్యరథం): పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డి పరిస్థితి చూస్తే జాలివేస్తోందని.. అధికారం కోల్పోయి ఏం చేయాలో పాలుపోక నేడు ప్రజల ముందుకు వచ్చి ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నాడని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసులురెడ్డి ధ్వజమెత్తారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయం లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని దోపిడీ చేసి దేశంలోనే ఏపీని 29వ స్థానంతో అథః పాతాళానికి తీసుకెళ్లాడు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో రాష్ట్రం విడిపో యి అనేక కష్టాల్లో ఉన్నా రాష్ట్రానికి రాజధాని కావాలని చెప్పి సంకల్పించుకుని అప్పటి సీఎం చంద్రబాబు 33 వేల ఎకరాలు ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించారు. పోలవరం ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన నిర్మిస్తే రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర ప్రజలకు తాగు, సాగు నీటికి ఎంతో ఉపయోగపడుతుందని ఢిల్లీ చుట్టు పరుగులు పెట్టి 2019 కల్లా 72 శాతం పనులు పూర్తి చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి మూడు రాజధానుల పేరుతో రాజధాని అమరావతిని సర్వనాశనం చేశాడు. పోలవరం ప్రాజెక్ట్ ను గాలికొదిలేశాడు. అమరావతిలో జరుగుతున్న అనేక నిర్మాణాన్ని ధ్వంసం చేశాడు. రాయలసీమ ప్రాజెక్టులను పూర్తిగా నిర్వీర్యం చేశాడు. సొంత జిల్లా కడపలో ఒక్క నీటి ప్రాజెక్ట్‌ను కూడా నిర్మించలేదు. కనీసం ఒక్క రూపా యి ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేయలేదు. పోని సొంత నియోజకవర్గమైన పులివెందుల ప్రజలకు ఏమైనా చేశావా అంటే ఐదేళ్ల కాలంలో తాగునీరు లేదని ప్రజలురోడ్డెక్కే పరిస్థితికి తీసుకొచ్చావ్. ఇప్పుడు బయటకు వచ్చి కూటమి ప్రభుత్వంపై ఏడునెలల కాలంలో అప్పులు చేశారని అబద్దాలు చెబుతున్నావ్. నువ్వు రూ.12లక్షల కోట్ల అప్పు చేసి ఒక్క రూపాయి తో ఎక్కడైనా అభివృద్ధి కార్యక్రమం చేపట్టావా? సంక్షే మం పేరుతో దోపిడీచేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించావ్. రూ.12 లక్షల కోట్లకు ముందు సమా ధానం చెప్పు. కూటమి ప్రభుత్వంపై విషప్రచారం చేస్తే ప్రజలునమ్ముతారా అని ప్రశ్నించారు. 2019లో అనేక సంక్షేమ పథకాలు రద్దు చేసిన నువ్వు... ఈ రోజు మళ్లీ సంక్షేమ పథకాలపై మాట్లాడతావా? అసలు సంక్షేమ పథకాలు మీరు ఎక్కడ అమలు చేశారు? లక్షల మంది పెన్షన్‌దారులు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు మాయమాటలతో రకరకాల కారణాలతో పెన్షన్ల లో కోత విధించి ఇబ్బంది పెట్టావ్.ఈరోజు కూటమి ప్రభుత్వం పెన్షన్లు పెంచి అందజేస్తుంటే విమర్శలు చేస్తున్నావ్. మహిళ లకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను దశల వారీగా అమలు చేస్తు న్నాం. ఈ ఏడునెలల సమయంలోనే మతిపోయి ఇష్టం వచ్చినట్లు అవి పాయే.. అవి పాయే అంటూ విషం చిమ్ముతున్నావ్. ఏ పథకాలు పోలేదు..అన్ని అమలు చేస్తున్నాం. ఇది మంచి ప్రభుత్వమని ప్రజలుహర్షిస్తున్నారు. నీ మాయ మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని హితవుపలికారు.

## చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి దిశగా రాష్ట్రం

చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రం దూసుకుపో తోంది. 6.78 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి రాష్ట్రాన్ని సంపద రాష్ట్రంగా తయారుచేసేందుకు కృషి చేస్తున్నారు. దీన్ని ప్రజలు హర్షిస్తున్నారు. ఇప్పటికే 4.28 లక్షల మందికి ఉద్యోగ కల్పన చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సబ్ ప్లాన్ నిధులు ఇచ్చి ప్రోత్స హించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. మా హయాం లో 2.50లక్షల వాలంటీర్ ఉద్యోగాలు పోయాయని ఏడుస్తున్నావ్. వాలం టీర్లను రెన్యువల్ చేయాల్సిన బాధ్యత మీదే. కానీ ఆ పని మీరు చేయలేదు. ఎన్ని కల వేళ రాజకీయం కోసం వాడుకుని వారిచేత రాజీ నామాలు చేయించి 2.50 లక్షల మందిని పచ్చి మోసం చేసింది నువ్వు కాదా? ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నావ్. ప్రజల్లో మేము తిరుగుతున్నాం. ప్రతి వాలంటీర్ జగన్‌రెడ్డి మోసం చేశాడని మాట్లాడుతున్నారు.ఐదేళ్లలో ఒకడీఎస్సీ పోస్టు అయినా ఇచ్చావా... చంద్రబాబు అధికారంలోకి రాగానే 16347 డీఎస్సీ పోస్టులకు ఆరు నెలల్లోనే భర్తీకి చర్యలు తీసుకుంటున్నారు. 6100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నాం. మీ హయాంలో విదేశీ విద్య నాశనం చేశావ్ అని ధ్వజమెత్తారు.

## రైతులకు ఏం చేశావ్ జగన్‌రెడ్డీ...

రైతులకు గత ఐదేళ్ల కాలంలో ఒకక్క డ్రిప్ పరికరం అయినా ఇచ్చారా? మా ప్రభుత్వంలో 5 ఎకరాలు ఉంటే 90 శాతం, 10 ఎకరాలు ఉన్న వారికి 70 శాతం సబ్సి డీతో డ్రిప్ పరికరాలు అందచేస్తున్నాం. రాయలసీమను హార్టీ కల్చర్ హబ్‌గా చేయడానికి సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారు. పెండింగ్ ప్రాజెక్టులను మొదలు పెట్టేందుకు ప్రక్రియ కొనసాగుతోంది. నీ ఐదేళ్ల కాలంలో రాయలసీమపై కానీ.. కడపపై కానీ ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. పులివెందుల రింగ్ రోడ్ సుందరీకరణకు వందల కోట్లు ఖర్చు చేసిన నువ్వు... సొంత నియోజకవర్గ ప్రజలకు నీరు ఇవ్వలేకపోయావ్. కూటమి ప్రభుత్వం వచ్చాక పోలవరం ప్రాజెక్టుకు కావాల్సిన నిధులను కేంద్రం నుంచి రాబట్టి 2027 లోపు పూర్తి చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నాం. పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర రాయల సీమకు నీరు తీసుకొచ్చి వ్యవసాయం రంగం అంద లం ఎక్కించేలా చేస్తు న్నాం. రాజధాని నిర్మాణానికి నిధులు సమీకరించి పనులు ప్రారంభించాం. మూడేళ్ల లో పనులు పూర్తి చేసి అద్భుతమైన రాజధానికి చూపి స్తాం. హంద్రీనీవా ఇతర పెండింగ్ ప్రాజెక్ట్ పనులకు నిధులు కేటాయించాం. టెండర్లు పిలిచి పనులు అప్ప గించాం. ఒక్క నీటి బొట్టు కూడా వృథా కాకూడదనే సంకల్పంతో చంద్రబాబు పనిచేస్తున్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కోసం సంపద సృష్టించి అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నాం. సూపర్ సిక్స్ పథకాలు ఆరు నూరైనా తల తాకట్టు పెట్టయినా అమలు చేస్తాం.

ఇది ప్రజలు గుర్తుపెట్టుకోవాలి. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని లూటీ చేసి పేదలను ముంచేసి రూ.10 లక్షల కోట్లు విలువ చేసే భూములు కొట్టేసి లక్షల కోట్లు దోపిడీ చేశావ్. ఈ రోజు విషప్రచారం చేస్తుంటే ప్రజలు నమ్మరని హితవుపలికారు. మీరు ప్రజల్లోకి వెళ్లే నైతిక అర్హత కోల్పోయారు. ప్రజలు మళ్లీ మళ్లీ మీకు ఛాన్స్ ఇవ్వరు. ఇప్పటికే మీ పార్టీని వదిలేసి అంతా పోతున్నారు. 42 ఏళ్ల టీడీపీని భూస్థాపితం చేస్తామంటున్నారు. గాలికి వచ్చిన పార్టీ..గాలికి పుట్టిన పార్టీ.. అక్రమ సంపాదనతో వచ్చిన పార్టీ వైసీపీ పార్టీ.. 2024లో ప్రజలు మీ పార్టీ గాలి తీసేశారు. మీరు గాలికి కొట్టుకుపోయారు. ప్రజలు ఇంకా మీ మాయ మాటలను నమ్మే పరిస్థితిలో లేరని గుర్తుపెట్టుకోవాలని హితవుపలికారు.

చైతన్యరథం

# పర్యాటకంతో అభివృద్ధికి ఊతం

- ఫైళ్ల క్లియరెన్స్‌లో సీఎం చంద్రబాబు అభినందనలు శాఖ పనితీరుకు నిదర్శనం
- 26 జిల్లాల్లో పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి
- పర్యాటక రంగానికి అద్భుతమైన ట్యాగ్‌లైన్ సిద్ధం చేసి విస్తృత ప్రచారం కల్పించాలి
- నూతన పర్యాటక పాలసీపై పెట్టుబడిదారులకు అవగాహన కల్పించాలి
- పర్యాటక శాఖ అధికారులకు మంత్రి దుర్గేష్ దిశా నిర్దేశం



అమరావతి (చైతన్యరథం): రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో పర్యాటక రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధించి, తమదైన ముద్రవేయాలని పర్యాటక శాఖ అధికారులకు మంత్రి కందుల దుర్గేష్ దిశానిర్దేశం చేశారు. గురువారం గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీఐఐసీ బిల్డింగ్ 11వ ఫ్లోర్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ శాఖల అధికారులతో మంత్రి కందుల దుర్గేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఐదేళ్లలో పర్యాటక రంగంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులకు మంత్రి దుర్గేష్ మార్గనిర్దేశం చేశారు. రాష్ట్ర పర్యాటక రంగానికి అద్భుతమైన ట్యాగ్ లైన్ సిద్ధం చేసి తీసుకురావాలని, ఈ నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో జరిగే సమావేశంలో అనుమతి తీసుకొని విస్తృత ప్రచారం కల్పించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి దుర్గేష్ సూచించారు. రాష్ట్రంలో జరుగుతున్న పర్యాటక అభివృద్ధిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపడుతున్న అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టుల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. తిరుపతి తరహాలో శ్రీశైలం క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో శాఖాపరంగా తలెత్తిన సిబ్బంది సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. సూర్యలంక మైపాడు బీచ్‌లను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఆయా ప్రాంతాల్లో పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన ప్రాంతాలకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేసుకుని రావాలని అధికారులకు సూచించారు. స్థానికంగా ఏ తరహా పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తే బాగుంటుందో చెప్పాలన్నారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా అటవీ, దేవాదాయ శాఖల అనుమతులు అవసరం వస్తే తాను సంబంధిత కేబినెట్ సబ్‌కమిటీలో మెంబర్ గా ఉన్నానని, తక్షణమే ఆయా సమస్యలను పరిష్కరించే దిశగా సంబంధిత శాఖల మంత్రులు పవన్ కళ్యాణ్, ఆనం రాంనారాయణ రెడ్డిలతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అధికారులకు మంత్రి దుర్గేష్ తెలిపారు. కూటమి ప్రభుత్వంపై పెట్టుబడిదారుల్లో అమితమైన విశ్వాసం ఉందని, ఆసక్తితో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి సరైన వివరాలు అందించి పీపీపీ విధానంలో పర్యాటక అభివృద్ధికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. సీఎస్సార్ నిధులు రాబట్టడం పై దృష్టి పెట్టి తద్వారా పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడాలన్నారు. ఈ సందర్భంగా టూరిజం, కల్చర్ ఈవెంట్ క్యాలెండర్ సిద్ధం చేయాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు అనుమతితో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి ఈవెంట్లు చేద్దామన్నారు.

### అధికారులకు మంత్రి అభినందనలు

ఫైళ్ల క్లియరెన్స్ అంశంలో పర్యాటక శాఖ పేషీ పనితీరును కేబినెట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారని శాఖ అధికారులకు మంత్రి దుర్గేష్ వివరిస్తూ అభినందనలు తెలిపారు. పర్యాటకశాఖ అధికారులు తనకు కుటుంబ సభ్యులతో సమానమని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. పర్యాటకం పరంగా ఏమేం అభివృద్ధి చేయాలో మరింత సృజనాత్మకంగా ఆలోచించాలన్నారు. కేరళ, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాల కన్నా అంతకుమించి అందాలు, సహజ సిద్ధ ప్రదేశాలు, ప్రకృతి రమణీయ ప్రదేశాలు ఎక్కువున్నప్పటికీ ప్రాచుర్యంలో వెనుకబడ్డామన్నారు. ఆడియో, వీడియోల రూపంలో ప్రమోషన్స్ పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా తిరుపతి, కోనసీమ, వైజాగ్ లాంటి ప్రాంతాలే కాకుండా 26 జిల్లాల్లో పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన ప్రాంతాలను గుర్తించి సరైన ప్రతిపాదనలతో రావాలని అధికారులకు సూచించారు. పర్యాటక రంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశ్రమ హోదా కల్పించారని గుర్తుచేస్తూ నూతన పర్యాటక పాలసీపై పెట్టుబడి దారులకు అవగాహన కల్పించి పెట్టుబడులు రాబట్టాలన్నారు. ఇన్వెస్టర్స్ టీం కి ప్రోత్సాహకాలు ఇచ్చే కార్యక్రమాలు చేద్దామన్నారు. ఇటీవలే విజయవాడ విశాఖపట్నం లాంటి ప్రాంతాల్లో ఇన్వెస్టర్ సమ్మిట్లు నిర్వహించామని త్వరలో తిరుపతిలో ఇన్వెస్టర్ సమిట్ నిర్వహిద్దామని తెలిపారు. అంతేగాక ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో సైతం ఇన్వెస్టర్స్ సమ్మిట్లు నిర్వహించి ఇన్వెస్టర్లను ఆకర్షిద్దామని తద్వారా రాష్ట్రంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసి భారీ సంఖ్యలో యువతకు ఉపాధి కల్పిద్దామని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ తెలిపారు.

తిరుపతి లాంటి అధ్యాత్మిక ప్రాంతాల్లో హోం స్టే లు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేశారు. విభిన్న తరహా టూరిజంలను అభివృద్ధి చేసేందుకు సంకల్పించామని టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి అన్నారు. ప్రీ వెడ్డింగ్ షూట్స్, అడ్వెంచరస్ స్పోర్ట్స్, చిల్డ్రన్స్ గేమ్స్, ఫిషింగ్ విత్ ఫిషర్ మెన్ వంటివి పర్యాటక ప్రాంతాల్లో ప్రవేశపెడతామని అన్నారు. పర్యాటకుడు పర్యాటక ప్రాంతంలో ఎక్కువ రోజులు గడిపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకునేందుకు కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పర్యాటకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఇటీవల నియమితులైన అజయ్ జైన్, ఎండీగా ఆమ్రపాలి కాట పనితీరును మంత్రి కందుల దుర్గేష్ ప్రశంసించారు. పర్యాటకశాఖ పరంగా ఉత్సాహంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, శ్రద్ధ వహించి పర్యాటక ప్రాంతాల్లో పర్యటిస్తూ పర్యాటకాభివృద్ధికి కృషి చేయడమే గాక, అధికారులకు దిశా నిర్దేశం చేస్తుండటం పై మంత్రి హర్షం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో టూరిజం ప్రిన్సిపల్ సెక్రెటరీ అజయ్ జైన్, ఎండి ఆమ్రపాలి, ఈడీలు పద్మావతి, శేషగిరి, ఏపీ టీడీసీ, ఏపీ టీఏ అధికారులు, ఆర్‌డీలు, డీవీఎం లు, డీటీసీలు, 26 జిల్లాల టూరిజం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మండలి కూడా ప్రక్షాళన జరగాలి

- విలువల్లేని జగన్‌రెడ్డి ముఠాతో అగౌరవం
- అబద్ధాలతో రెచ్చగొట్టాలని చూస్తున్నారు
- కాగ్ కడిగేసినా..11 సీట్లిచ్చినా బుద్ధి రాలేదు
- వైసీపీ దోపిడీని గుర్తించబట్టే ఇంటికి పంపారు
- కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపుతోనే అభివృద్ధి
- నేటి నామినేషన్ ర్యాలీని విజయవంతం చేయండి
- ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు



మంగళగిరి(చైతన్యరథం): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు పిలుపునిచ్చారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం విలేకరుల సమా వేశంలో వారు మాట్లాడారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 27న జరిగే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేస్తున్న తాను శుక్రవారం నామినేషన్ వేయనున్న సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి నామినేషన్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటికే 3,46,000 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారని చెప్పిన ఆయన రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు పెట్టాలంటే కూటమి నాయకత్వానికి మద్దతు పలకాల్సిన అవసరం ఎం తైనా ఉందన్నారు. గత పాలనలో రాష్ట్రానికి ఎంత నష్టం జరిగిందో అందరికీ తెలుసు.. వైసీపీని ఓడించి ఇంటికి పంపినా కూడా జగన్‌రెడ్డి ఆలోచనలో ఏ మాత్రం మార్పులేదు. రాజకీయాల్లో విలువలు లేని వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క జగన్‌రెడ్డి మాత్రమే.. 16నెలలు జైలులో ఉండి బెయిల్‌పై వచ్చిన ఆయన ఏ రకంగా పాలన సాగించావో అందరూ చూశారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి విధ్వంసం సృష్టించారు. ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇచ్చి రాజ్యాంగానికి విఘాతం కలిగించారు..ప్రతిపక్ష హోదా కూడా లేదు.. అసెంబ్లీ అంటేనే భయంతో పారిపోతున్నారు.. ప్రజలను వదిలి పారిపోతున్న జగన్‌రెడ్డి.. ఈ రోజు ఏ రకంగా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారో చూస్తు న్నాం. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద నిలబెట్టిన ఘనత ఆయనకే దక్కుతుం ది. మద్యంపై ప్రేమ.. దోచుకోవాలనే ఆలోచన.. తీరు మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో 11 కూడా మిగలవని హితవుపలికారు. రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చి నట్లు స్వయంగా కాగ్ చెబుతోంది. జగన్ అరాచక పాలనతో అన్ని రంగాల్లో రాష్ట్రం 25 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయింది. అంతకు ముందు చంద్రబాబు పాలనలో రాజధాని, పోలవ రాన్ని తీసుకువచ్చి.. పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలను తీసుకువచ్చారు. కానీ, జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అందరిని హింసించి వెనక్కి వెళ్లిపోయేలా చేశా రు. ఆయన దిగిపోయే నాటికి ఏ ఒక్కటి అయినా ఉందా? ఎవరికైనా ఉద్యోగం కల్పిం చారా? అని ప్రశ్నించారు. ప్రతి జనవరికి జాబ్ క్యాలెండర్ అని చెప్పి జాబ్ లెస్ క్యాలెం డర్‌ను ప్రకటించిన ఘనత జగన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుంది. నాడు-నేడు కార్యక్రమాన్ని కేవలం అవినీతి కోసమే వినియోగించుకుని విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారు. ప్రజలు మీ మోసాలను, దోపిడీని గుర్తించబట్టే కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పట్టారని హితవుపలికారు.

### ఆలపాటిని గెలిపించి మండలికి గౌరవం తెద్దాం

ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ శుక్రవారం కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ నామినేషన్ దాఖలు కార్యక్రమాన్ని కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరై ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ వేదికగా చంద్రబాబును అవమానించిన తీరు, అసెంబ్లీలో జరిగిన విధానాన్ని ప్రజలు గమనించారు. ఇది కౌరవ సభ రాను..గౌరవ సభ అయితేనే వస్తాను అని చంద్రబాబు చెప్పడం.. ఆయనను నమ్మి ప్రజలు 164 సీట్లతో అత్యధిక మెజార్టీతో గెలిపించారు. అసెంబ్లీ ప్రక్షా ళన అయిపోయింది.. ఇంకా కౌన్సిల్ ప్రక్షాళన మాత్రమే మిగిలి ఉంది. గత ప్రభుత్వం ముద్దాయిలు, నిందితులు, రౌడీ షీటర్లను, స్త్రీలను అపహాస్యం చేసిన వారిని ఎమ్మెల్సీగా నియమించింది. వారిని చూస్తే రాష్ట్రం ఎటు పోతుందో కూడా అర్థం కాదు.. కౌన్సిల్ కూడా ప్రక్షాళన జరిగితేనే ప్రభుత్వం సజావుగా సాగుతుంది. కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు సోషల్ మీడియా ద్వారా సమాచారం అందజేశాం. 27న కచ్చితంగా లోకల్ సెలవు ఉంటుంది.. వ్యక్తిగత పనులు వాయిదా వేసుకుని ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, పెన్షనర్లు, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉన్న వాళ్లు, ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగులు కూటమి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. వివరాలు కావాల్సిన వారు స్థానిక నాయకులను సంప్రదించాలి. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలో 416 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశాం. కానీ, 80 అవసరమని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశాం. ప్రతిఒక్కరూ కూడా ఓటును బాధ్యతగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# విధ్వంసకుడి నోట.. 'విధ్వంసం' మాట?



నమ్మి గెలిపించిన ప్రజల ఆశలను భగ్నం చేసి, రాష్ట్రాభివృద్ధికి గండికొట్టి, యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసి, ఐదేళ్ల పాటు అన్ని రంగాలను కుప్పకూల్చి, అరాచక పాలన, దోపిడీ, అవినీతితో పరిపాలించిన వ్యక్తి ఇప్పుడు 'విధ్వంసం' గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించడమే!

ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేయడం, ఉపాధ్యాయులను బోధనేతర పనుల్లో నిమగ్నం చేయడం, విద్యార్థులపై నిర్బంధంగా ఆంగ్ల మాధ్యమాన్ని రుద్దడంవంటి అనాలోచిత నిర్ణయాలవల్ల రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు తీవ్రంగా దిగజారాయి. దీంతో వేలాది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వదిలి ప్రైవేట్ విద్యాసంస్థలకు మారిపోయారు. చదువుపై ఆసక్తి తగ్గడంతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు కూడా క్షీణించాయి. ఇది కదా విధ్వంసమంటే జగన్‌రెడ్డీ?

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై బలవంతంగా ఆంగ్ల మాధ్యమాన్ని రుద్దడం సరికాదని విద్యారంగ నిపుణులు ఎంత విజ్ఞప్తి చేసినా, జగన్ ప్రభుత్వం నియంతలా వ్యవహరించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో 50శాతం మందికి ఆంగ్ల భాషపై భయముందని పలు అధ్యయనాలు వెల్లడించినా, వాటిని పూర్తిగా విస్మరించి మొండితనంతో ముందుకు వెళ్లి విద్యార్థుల పాలిట శాపంలా మారాడు. ఇంగ్లీష్ మీడియం చదవలేక విద్యార్థులు చదువును మానేసి, కొందరు గంజాయి రవాణా సహా ఇతర నేరాలకు పాల్పడి తమ జీవితాలను నాశనం చేసుకున్నారు. ఇది కదా విధ్వంసమంటే జగన్‌రెడ్డీ?

అన్న ప్రభుత్వం అధికారంలోకి వస్తే... ఎన్ని లక్షలు ఖర్చైనా సరే అన్న చదివిస్తాడు. ఇదీ 2019 ఎన్నికల ముందు ప్రచార సభల్లో విద్యార్థులు, తల్లిదండ్రులకు జగన్ ఇచ్చిన హామీ. ఇచ్చిన హామీ నిలబెట్టుకోకపోగా విద్యా వ్యవస్థను జగన్‌రెడ్డి సర్వనాశనం చేశాడని చెప్పడానికి సవాలక్ష ఉదాహరణలు.

విద్యార్థులందరికీ అమ్మఒడి ఇస్తానని హామీనిచ్చి.. 40 లక్షలమందికి ఎగనామం పెట్టాడు.

అమ్మఒడి ఐదేళ్లిస్తానని హామీనిచ్చి ఒక ఏడాది ఎగవేసాడు.

అమ్మఒడి రూ. 15వేలు ఇస్తానని రూ. 13వేలకు కోత పెట్టాడు.

డిజిటల్ వర్చువల్ క్లాస్‌రూంలు, ఫైబర్ గ్రిడ్ సదుపాయాలు, మున్సిపల్ పాఠశాలల్లో వర్చువల్ క్లాస్‌రూంలను తీసివేశాడు.

సిలబస్ మార్చి విద్యార్థులను తికమక పెట్టాడు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉనికే లేకుండా చేశాడు.

ఎయిడెడ్ పాఠశాలలను బెదిరించి మూయించాడు.

విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ రద్దు చేశాడు.

విద్యార్థులకు ఇచ్చే స్కూల్ డ్రస్‌లు, బూట్లలో కూడా డబ్బులు మింగేశాడు.

చిక్కీలో రూ. 200కోట్ల అవినీతి, ఆఖరికి కోడిగుడ్లలోనూ దోచుకున్నాడు.

తరగతుల విలీనం కారణంగా డ్రాపవుట్స్ పెరిగి.. 587 ప్రభుత్వ బడులు మూతపడ్డాయి. 1365 ఎయిడెడ్ బడులు కాలగర్భంలో కలిసిపోయాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు రోడ్ల మీద ధర్నా చేసే దుస్థితి తెచ్చాడు

సీబీఎస్‌ఈ తీసుకొచ్చి రెండేళ్లు తిరగకముందే మళ్లీ బైజూస్, తరువాత ఐబీ... ఇలా కాసుల కోసం విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నాడు

నాడు-నేడు అని ప్రభుత్వ పాఠశాలలకు రంగులేసే నెపంతో రూ. 3వేల కోట్లు కొట్టేశాడు.

విద్యార్థులకు ట్యాబుల పేరిట దాదాపు రూ. 1200 కోట్లు దోచుకున్నాడు.

ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం రద్దు చేసి విద్యార్థుల పొట్ట కొట్టాడు.

ఉపాధ్యాయులు తనకు సహకరించడం లేదని, సీపీఎస్ రద్దు చేయాలని పదే పదే అడగడంతో వారిపై ఉన్న అక్రోశాన్ని వెళ్లగక్కేందుకు జీఓ-117ను అస్త్రంగా వాడాడు.

ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తానని హామీనిచ్చి యువతను నట్టేటముంచాడు.

ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏలు.. ఇతర అరియర్స్ అన్నీ బకాయి పెట్టాడు.

సబ్జెక్టు టీచర్లతో బోధనంటూ 3, 4, 5 తరగతులను ప్రాథమిక బడులను, ఉన్నత పాఠశాలల్లో కలిపేసి సెకండరీ గ్రేడ్ టీచర్లను సర్దుబాటు చేసి టీచర్ల మీద ఒత్తిడి తెచ్చాడు.

రాష్ట్రంలో 7 వేల ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్, ఎస్జీటీ పోస్టులు రద్దు చేశాడు.

పీఆర్సీ సాధన కోసం ఉద్యమించిన ఉపాధ్యాయులపై లాఠీఛార్జ్ చేయించాడు.

గౌరవప్రదమైన వృత్తిలో ఉన్న గురువులను మద్యం దుకాణాల ముందు కాపలా పెట్టించాడు, మరుగుదొడ్లు కడిగించాడు.

సకాలంలో ఏ ఒక్క నెల జీతాలు ఇవ్వకుండా ఉపాధ్యాయులను మానసిక క్షోభకి గురి చేశాడు.

ఫీజు రీయింబర్స్‌ని విద్యా దీవెనగా మార్చి రూ. 4,271 కోట్లు బకాయిలు పెట్టిపోయాడు.

2014-19 టీడీపీ ప్రభుత్వం ఏటా 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ని అందిస్తే, దాన్ని 9.86లక్షల మందికి కుదించి అంటే 6లక్షల మందికి కోత పెట్టాడు.

ఇంటర్న్ షిప్ పేరుతో డిగ్రీ విద్యార్థులను మోసం చేశాడు.

యూనివర్సిటీ ఫీజులు, హయ్యర్ ఎడ్యుకేషన్ ఫీజులు, అఫిలియేషన్ ఫీజులు, ఎగ్జామ్ ఫీజులు, ఏపీహెచ్‌ఈఆర్‌ఎంసీ ఫీజులు 40 నుంచి 50 శాతం ఫీజులు పెంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు క్వాలిటీ విద్యను దూరం చేశాడు.

విదేశీ విద్య ఊపిరి తీసాడు

విద్యను వింత మిథ్యగా మార్చి, నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం దేశంలో 3వ స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని 19వ స్థానానికి కూలదోసాడు. మొత్తంగా చెప్పాలంటే... ఐదేళ్ల జగన్ పాలనలో విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించాడు.

కూటమి ప్రభుత్వంలో విద్యా విప్లవం

కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరిచే దిశగా కీలక సంస్కరణలు అమలు చేస్తోంది. 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్, 729 నాన్-టీచింగ్, 700 కోయభారతి టీచర్ పోస్టులు భర్తీ చేసింది. జూనియర్ కాలేజీల్లో 3619 లెక్చరర్లను పునర్నియమించింది

ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో రూ. 788 కోట్లు విడుదల చేసి, విద్యార్థుల సర్టిఫికెట్ సమస్యలను పరిష్కరించింది.

రూ. 110 కోట్ల డైట్ ఛార్జీలు, రూ. 20.52 కోట్ల కాస్మొటిక్ ఛార్జీల బకాయిలను చెల్లించి సంక్షేమ హాస్టళ్లను బలోపేతం చేసింది. విదేశీ విద్య కోసం రూ. 33 కోట్లు విడుదల చేసి, 640 మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించింది.

సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ద్వారా రూ. 953.71 కోట్లతో విద్యార్థులకు నాణ్యమైన కిట్లు, ఉచిత పాఠ్యపుస్తకాలు, పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించింది.

475 ప్రభుత్వ జూనియర్ కళాశాలలను తిరిగి ప్రారంభించి 1.48 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తోంది.

యువ నాయకత్వంలో 'రాష్ట్ర విద్యావ్యవస్థ' కొత్త జవసత్వాలతో ముందుకు సాగుతోంది!

- స్వరూప,
అనలిస్ట్

# సిట్ పడింది - తగలబడింది!

- తాడేపల్లి ప్యాలెస్ వద్ద నిప్పు.. నిజాలేమిటి?
- మదనపల్లె ఫైల్స్ తరహాలో.. మద్యం లెక్కల పత్రాలు తగలెట్టేశారా
- జగన్ నివాసం వద్ద అగ్ని ప్రమాదంపై ఎన్నో అనుమానాలు
- దొంగే దొంగ..దొంగ అన్నట్లుగా సోషల్ మీడియాలో వైసీపీ తప్పుడు ప్రచారం

అమరావతి (చైతన్యరథం): తాడేపల్లిలో మాజీ సీఎం జగన్ నివాసం వద్ద బుధవారం రాత్రి కొన్ని వస్తువులు, కాగితాలు తగలబెట్టడం చర్చనీయాంశ మైంది. మద్యం కుంభకోణంపై సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం) ఏర్పాటు ప్రకటన వచ్చాక కొన్ని గంటల్లోనే ఈ ఘటన చోటుచేసుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్దేశపూర్వకం గానే కొన్ని పత్రాలకు ఇంటి గేటు బయట తగల బెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. అగ్ని ప్రమాదం మాటున, జగన్ దాచుకున్న కీలకమైన లిక్కర్ డాక్యుమెంట్లు, డైరీలు దగ్ధం చేసినట్లు ఈ సందర్భం గా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా ఉద్దేశ పూర్వకంగా చేసిందేనని టీడీపీ నేతలు అనుమానిస్తున్నారు. ఉదయం లిక్కర్ స్కామ్‌పై సిట్ పడింది.. రాత్రికి తాడేపల్లి ప్యాలెస్ బయట తగల బడింది. ప్యాలెస్ బయట తగలబడిన కాగితాలు, డైరీలు ఏంటి? సిట్ ఇంటి దాకావస్తుందని.. ముందే లిక్కర్ స్కామ్‌కి సంబంధించి తాను రాసుకున్న లెక్కలు, డాక్యుమెంట్లు తగల బెట్టారా? ఇప్పటి వరకు ఇంటి ముందు ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్ ఎందుకు బయట పెట్టలేదు? ఎన్ని కుట్రలు చేసినా వదిలేది లేదు. సిట్ వస్తుంది.. విచారణ చేస్తుంది.. అవినీతిని బయటకు తీస్తుంది..గెట్ రెడీ.. స్టే ట్యూన్డ్ టు తాడేపల్లి ఫైల్స్.. అంటూ టీడీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

మద్యం కుంభకోణంపై దర్యాప్తునకు ఏర్పాటు చేసిన సిట్‌కు విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు నేతృత్వం వహిస్తున్నారు. ఈ కేసులో ఎంతటి వారు ఉన్నా.. వదలద్దని.. ఎవరినైనా ప్రశ్నించాలని.. పేర్కొంటూ.. ప్రభుత్వం విశేష అధికారాలు ఈ సిట్‌కు కట్టబెట్టింది. అంతేకాదు.. ఎంతవారినైనా అరెస్టు చేసే అధికారం కూడా కల్పించింది.

ఈ పరిణామం జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే తాడేపల్లి ప్యాలస్ వద్ద అగ్గి రాజుకోవడం.. దీనిలో కొన్ని ఫైళ్లు, డైరీలు కూడా తగలబడడం వంటివి అనేక సందేహాలకు తావిస్తు న్నాయని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. మదన పల్లె ఫైల్స్ దహనం తరహాలో.. తాడేపల్లి ప్యాలెస్‌లో పోగుపడిన లెక్కల చీటీల మొదలు మొత్తం వదిలిం చుకోవాలని చేసిన ప్రయత్నం లాగా కనిపిస్తోంది అనే చర్చ జరుగుతోంది. జగన్ తాడేపల్లి ప్యాలస్ దగ్గర కిలోమీటర్ వరకు స్పష్టంగా చిత్రీకరించగల సీసీ కెమెరాల వ్యవస్థ ఉంది. అక్కడికి బయటవారు వెళ్లి తగలెట్టే సాహసాలు ఎవరూ చెయ్యలేరు. తమ ప్యాలస్ పక్కన రోడ్డుకు అటు పక్క తగలెట్టించి మళ్లీ భద్రతా లోపాలు అని గగ్గోలు పెడుతూ సానుభూతి పొందే గులకరాయి, కోడికత్తి లాంటి డ్రామాలకు దిగారు అని జనం నవ్వుకుంటున్నారు.

మద్యం కుంభకోణంపై తాజాగా సిట్ ఏర్పాటుతో ఈ విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు వెల్లడికావడంతో జగన్‌లో కంగారు మొదలైందని అంటున్నారు. తాడేపల్లి ప్యాలెస్‌కు జగన్ మోహన్ రెడ్డి చాలా రోజుల తర్వాత వచ్చారు. లండన్ పర్య టన ఆ తర్వాత బెంగళూరు వెళ్లి వ్యవహారాలు చక్క బెట్టుకుని వచ్చిన జగన్.. తాడేపల్లి ప్యాలెస్‌లో లిక్కర్ కుంభకోణానికి సంబంధించిన లెక్కల పత్రాలను కూడా బయటకు తీసి తగులబెట్టించారనే అనుమా నాలు వస్తున్నాయి. అక్కడ ఉంది పచ్చిగడ్డి,మొక్కలు. ఈ విషయం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ఆ గడ్డి మండుతుంది అంటే, ఎవరో ఒకరు అక్కడ పెట్రోల్ పోసి మంట అంటించి ఉంటారు. తగలబడుతున్న ప్రదేశంలో కాగితాలు కూడా ఉన్నట్లు చెబుతున్నారు.

తాడేపల్లి ప్యాలెస్‌లో అధునాతన సీసీటీవీలు ఉన్నాయి. వాటిలో చూస్తే నిజానిజాలు తెలుస్తాయి కానీ ఆ పని చేయకుండా జగనన్న ఇల్లు తగులబెట్టేందుకు కొందరు ప్రయత్నించారు.. అంటూ వైసీపీ సోషల్ మీడియా ప్రచారం చేయడమేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం వైఫల్యం అని చెప్పడం, జగన్ పై సానుభూతి వచ్చేలా చేయడం అనే ద్విముఖ వ్యూహంతో బాటు సీక్రెట్ ఫైళ్లు విజయవంతంగా తగలబెట్టుకోవచ్చుననే దుర్బుద్ధితోనే ఇలా చేశారనేది అందరి అనుమానం. అసలు అక్కడ మంటలు చెలరేగడం, దాన్ని ఆర్పేందుకు ప్రయత్నించకుండా జగన్ రెడ్డి సెక్యూరిటీ సిబ్బంది దాన్ని వీడియో తీయడం లాంటి చర్యలు మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి. మంటలు ఆర్పేందుకు ప్రయత్నించా ల్సిన జగన్‌రెడ్డి సెక్యూరిటీ వాళ్లు ఇద్దరు మాత్రమే మంటలు ఆర్పుతుంటే దాదాపు ఐదుగురు వీడియోలు తీసే పనిలో ఉన్నారు. సెక్యూరిటీ వాళ్లు మంటలు ఆర్పాలా? లేక వీడియోలు తీయాలా? ఈ ప్రశ్నకు మాత్రం సమాధానం లేదు.

ఫిర్యాదు ఇచ్చి, తాడేపల్లి ప్యాలస్ సీసీ కెమెరాల ఫుటేజీ ఇచ్చి జగన్ సహకరిస్తే.. ప్రభుత్వం ఈ విషయంపై దర్యాప్తు చెయ్యవచ్చు. ప్రభుత్వం తాడేపల్లి ప్యాలెస్ లోని సీసీ టీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకుని విచారణ జరిపితే కానీ అసలు విషయం బయటకు రాదు. అయితే ఈ లోపు సీసీటీవీ ఫుటేజీని ఉంచుతారా, తీసేస్తారా అనేది కూడా అనుమానాస్పదంగానే ఉంది.

# క్రీడలకు సాయం.. క్రీడాంధ్రప్రదేశ్ ధ్యేయం

- క్రీడల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకున్న సీఎం చంద్రబాబు
- క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు చొరవతో క్రీడా ప్రోత్సాహకాలు విడుదల
- ఐదేళ్ల వైసీపీ పాలనలో రూ.11,68,62,288 పెండింగ్
- గత నవంబర్‌లో సీఎం దృష్టికి తీసుకెళ్లిన శాప్ ఛైర్మన్
- 189 మంది క్రీడాకారులకు రూ.7,96,62,289 విడుదల
- సీఎంకు శాప్ ఛైర్మన్ కృతజ్ఞతలు
- హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు, క్రీడా సంఘాలు

విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్న సీఎం నారా చంద్రబాబునాయుడు క్రీడల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని నిరూపించుకుంటున్నారని క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు వెల్లడించారు. శాప్ ఛైర్మన్‌గా రవినాయుడు బాధ్యతలు చేపట్టాక క్రీడాప్రోత్సాహకాల బకాయిలు విడుదల చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా పలువురు క్రీడాకారులు పెద్ద ఎత్తున వినతిపత్రాలు సమర్పించారన్నారు. గత ఐదేళ్ల పాలనలో క్రీడాకారుల భవిష్యత్తుతో వైసీపీ ప్రభుత్వం ఆడుకుందని, క్రీడాప్రోత్సాహకాలు మంజూరు చేసినప్పటికీ వాటిని చెల్లించకుండా తమ రాజకీయ విన్యాసాలకు వినియోగించుకుందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో 220 మంది క్రీడాకారులకు రూ.11,68,62,288 క్రీడాప్రోత్సాహకాలను చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులకు



గురిచేసిందన్నారు. దీనిపై గత నవంబర్ నెలలో సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి క్రీడాకారుల సమస్యను తీసుకెళ్లామని, క్రీడాకారుల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. విజ్ఞప్తి చేసిన రెండు నెలల్లోనే సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారని, రాష్ట్రవ్యాప్తంగా క్రీడాప్రోత్సాహకాల కోసం ఎదురుచూస్తున్న 189 మంది లబ్ధిదారులకు రూ.7,96,62,289 క్రీడాప్రోత్సాహకాలను సీఎం చంద్రబాబు విడుదల చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం బకాయిలు పెట్టిన ప్రోత్సాహకాలను కూటమి ప్రభుత్వం విడుదల చేసి క్రీడాకారులకు అండగా నిలిచిందన్నారు.

ఈ ఏడాదిలో రాణించిన క్రీడాకారులకు తదుపరి బడ్జెట్ ప్రారంభంలోనే ప్రోత్సాహకాలను విడుదల చేస్తామని శాప్ ఛైర్మన్ రవినాయుడు హామీ ఇచ్చారు. నిధుల విడుదలపై క్రీడాకారులు, క్రీడాసంఘాల నిర్వాహకులు, డీఎస్‌ఏల అధికారులు, కోచ్‌లు సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రోత్సాహకాలు విడుదల చేసిన సీఎం చంద్రబాబుకు రవినాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు.

## పర్యాటక రంగంలో పెట్టుబడులకు
# అంతర్జాతీయ కంపెనీల ఆసక్తి

- మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసిన అమెరికాకు చెందిన మాక్సీ హెటల్స్ గ్రూప్ ప్రతినిధులు
- సరైన ప్రతిపాదనలు, ప్రణాళికలతో వస్తే సహకరిస్తామన్న మంత్రి



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో పర్యాటక రంగంలో పెట్టుబడులకు అంతర్జాతీయ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయి. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను వెలగపూడి సచివాలయంలోని రెండవ బ్లాక్ లోని మంత్రి ఛాంబర్ లో అమెరికాకు చెందిన మ్యాక్సీ హెటల్స్ గ్రూప్‌నకు చెందిన పెట్టుబడిదారులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక రంగంలో ప్రధానంగా అతిథ్య(హాస్పిటాలిటీ) రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని వారు తెలిపారు. మాక్సీ హెటల్స్ ప్రపంచంలో పేరెన్నికపొందాయని, పర్యాటకులకు విలాసవంతమైన సౌకర్యాలు కల్పించడం తమ ధ్యేయమన్నారు. జాతీయంగా, అంతర్జాతీయంగా తమ హెటల్స్ విస్తరించి ఉన్నాయని వారు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ పర్యాటక రంగ అభివృద్ధిలో పీపీపీ విధానంలో ముందుకు వెళు_న్నామని, పర్యాటక రంగానికి రాష్ట్రంలో పరిశ్రమ హెదా ఉందని వివరించారు. అదే విధంగా నూతన పర్యాటక పాలసీ విధి విధానాలు, ప్రభుత్వం తరపున అందిస్తున్న రాయితీలను తెలిపారు. మంత్రి కందుల దుర్గేష్ వివరణతో పెట్టుబడిదారులు ముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా పెట్టబడులు పెట్టేందుకు వారు ఆసక్తి కనబరచగా అందుకు మంత్రి దుర్గేష్ వారికి కృతజ్ఞతలు తెలుపుతూ సరైన డీపీఆర్, ప్రణాళికలతో వస్తే ప్రభుత్వం తరపున సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల పర్యాటక రంగంలో రూ.1200 కోట్లకు పైగా పెట్టుబడులకు 8 కంపెనీలతో ఎంవోయూలు చేసుకున్న విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. అంతర్జాతీయ పర్యాటకులను సైతం ఆకట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## జాతీయక్రీడల్లో
# బీచ్ వాలీబాల్‌లో రాష్ట్రానికి స్వర్ణం

- మంత్రి మండిపల్లి హర్షం
- క్రీడాకారులకు అభినందనలు



అమరావతి (చైతన్యరథం): ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు నాలుగవ స్వర్ణ పతకం సాధించడపై రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బీచ్ వాలీబాల్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు అత్యుత్తమ ప్రదర్శనతో పసిడి పతకం సాధించడం అభినందనీయమన్నారు. జాతీయ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వైజాగ్‌కి చెందిన క్రీడాకారులు దివ్య సాయి, మణికంఠ రాజును మంత్రి ప్రశంసించారు. జాతీయ క్రీడా పోటీల్లో క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించాలని మంత్రి మండిపల్లి ఆకాంక్షించారు.

# రాజధాని టెండర్లకు ఈసీ అనుమతి

అమరావతి (చైతన్యరథం): ఏపీ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులకు సంబంధించి టెండర్లు పిలిచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) అనుమతిచ్చింది. ప్రస్తుతం ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో సీఆర్డీఏ పరిధిలో చేపట్టబోయే పనులకు అనుమతి కోసం ఇటీవల ఈసీకి సీఆర్డీఏ అధికారులు లేఖ రాశారు. దీనిపై స్పందించిన ఈసీ.. రాజధానిలో పనులకు అభ్యంతరం లేదని లేఖ ద్వారా స్పష్టం చేసింది. టెండర్లు పిలిచేందుకు అనుమతించింది. అయితే, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక మాత్రమే టెండర్లు ఖరారు చేయాలని లేఖలో పేర్కొంది.

# క్రీడాకారులకు అండగా ప్రభుత్వం

- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు
- ఖోఖో ప్రపంచకప్ విజేత పి.శివారెడ్డికి అభినందనలు



విజయవాడ (చైతన్యరథం): క్రీడాకారుల భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్‌ను ఖోఖో ప్రపంచ కప్ విజేత పి.శివారెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ క్రీడాకారుడిని అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. న్యూఢిల్లీ వేదికగా జరిగిన ఖోఖో తొలి ప్రపంచకప్‌లో ఇండియా విజేతగా నిలవడం సంతోషించదగ్గ విషయమని, ఇండియా జట్టులో ప్రకాశం జిల్లాకు చెందిన శివారెడ్డి ప్రాతినిధ్యం వహించడం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, శాప్ నుంచి పూర్తి సహాయసహకారాలు అందిస్తామని శాప్ ఛైర్మన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు, అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, ఏపీ ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి ఎమ్.సీతారామ్‌రెడ్డి, శేషనాథరెడ్డి, కాశీవిశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శాప్ ఛైర్మన్‌ను కలిసిన ఏపీఈఎమ్‌సీఎల్ ఛైర్మన్

ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి



విజయవాడలోని శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ దినేష్‌రెడ్డికి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం వారిరువురూ తమ విభాగాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

# విధ్వంసానికి బ్రాండ్ అంబాసిడర్ జగన్

- మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజం
- అలాంటి వ్యక్తికి ఇతరుల్ని నిందించే హక్కు లేదు
- రాజకీయాల్లో కూడా జగన్ విఫల విద్యార్థి
- అధికారం లేకపోవడంతో భ్రమల్లో బతుకుతున్న జగన్
- సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా నడిపించే దార్శనికతకు బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబు
- జగన్ విమర్శలకు ఆరోగ్యశాఖ మంత్రి ఘాటైన కౌంటర్



అమరావతి (చైతన్యరథం): మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి.. మరే ఇతర రాజకీయ నాయకుడికి సాధ్యం కాని 'విధ్వంసానికి బ్రాండ్ అంబాసిడర్' అనే ఘనతను సంపాదించారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలా పూర్తిగా నాశనం చేశారని మండిపడ్డారు. అధికారాన్ని కోల్పోవడంతో పార్టీని వీడుతున్న నాయకుల్ని, కార్యకర్తల్ని నిలబెట్టుకోవడానికి మళ్లీ అధికారంలోకొస్తాననే భ్రమలు కల్పించడానికి విఫల ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తిరిగి అధికారంలోకి వస్తానని కలలు కంటున్న భ్రమల బాధితుడు జగన్ అని ఆరోగ్య మంత్రి సత్య కుమార్ యాదవ్ అభివర్ణించారు. చంద్రబాబు గత పాలనపైనా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 8 నెలల ప్రభుత్వ పనితీరుపై జగన్ చేసిన ఆరోపణలను మంత్రి సత్యకుమార్ బలంగా తిప్పికొట్టారు. చంద్రబాబు పాలనా తీరు, తన పాలనా తీరుపై ప్రెస్ మీట్లో తాను వివరణ ఇచ్చాక, భవిష్యత్తులో చంద్రబాబుకు ఇక ఎవరూ ఓటేయరన్న జగన్ వ్యాఖ్యలపై మంత్రి తీవ్రంగా స్పందించారు. జగన్ రెడ్డి ప్రెస్ మీట్ గురించి ప్రస్తావించిన సత్యకుమార్ యాదవ్... వైఎస్ జగన్ తాను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేశానన్న విషయాన్ని పూర్తిగా విస్మరించారని, గతం మరిచిన రాజకీయ నాయకులకు భవిష్యత్తు ఉండదని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి రాజకీయాల్లో కూడా ఒక విఫల విద్యార్థి అని అభివర్ణించారు. స్కూల్, కాలేజీల్లో చదివే రోజుల్లో ఆయన బ్యాడ్ స్టూడెంట్‌గా ఉన్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సంక్షేమం, అభివృద్ధి రంగాలలో తన పాలనను పదేపదే సమర్థించుకోవడానికి జగన్ రెడ్డి ప్రయత్నించారని, కానీ గత సంవత్సరం ఎన్నికల్లో ప్రజలు ఆయనను పూర్తిగా తిరస్కరించి నిజం ఏమిటో నిరూపించారని మంత్రి అన్నారు. తదుపరి ఎన్నికల్లో ప్రజలు తనను ఆదరిస్తారని జగన్ రెడ్డి నమ్మడం అంటే పగటి కలలు కనడమేనన్నారు.

### విధ్వంసం నుంచి వికాసం దిశగా..

జగన్ రెడ్డిలా కాకుండా, ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా నడిపించే దార్శనికతకు బ్రాండ్ అంబాసిడర్‌లా ప్రసిద్ధి చెందారని సత్యకుమార్ యాదవ్ ప్రశంసించారు. రాజ్యాంగ విలువల పరిరక్షణ, యువతకు అవకాశాలు సృష్టించే నిజమైన స్ఫూర్తితో చంద్రబాబు ముందుకు వెళ్తున్నారన్నారు. ప్రజాస్వామ్యం పట్ల చంద్రబాబుకు ఉన్న నిబద్ధత గురించి కూడా మంత్రి గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి ఐదేళ్ల విధ్వంసం తర్వాత, రాష్ట్రం అప్పుడు కోల్పోయిన విలువైన సమయాన్ని, అవకాశాలను తిరిగి అందిపుచ్చుకునేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రం ఆకర్షించిన రూ.6 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు, రాజధాని అమరావతి ప్రాంతంలో త్వరితగతి అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, పోలవరం నిర్మాణాన్ని వేగవంతం చేయడం, 20 లక్షల ఉద్యోగాల సృష్టికి నిర్దిష్ట ప్రణాళికలు, మౌలిక సదుపాయాల మెరుగుదల మొదలైన అంశాలను మంత్రి ప్రస్తావించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ పూర్తి మద్దతుతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో 'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్' పందిరి కింద రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

### ప్రజారోగ్యంపైనా జగన్ నిర్లక్ష్యం

అత్యంత కీలకమైన ప్రజారోగ్యాన్ని కూడా జగన్ తీవ్రంగా విస్మరించాలని మంత్రి సత్యకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాన్ని ఆర్భాటంగా ప్రకటించారు గానీ, ఆ ఐదేళ్లలో సాధించిన పురోగతి అత్యంత ఘోరంగా ఉందన్నారు. ఆరోగ్య రంగంలో 'నాడు-నేడు' కింద చేపట్టిన పనుల విషయంలో కూడా ఇదే జరిగిందని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్ల పాలనలో చెప్పిన మాటలకు, చేతలకు మధ్య పొంతనే లేదని మంత్రి స్పష్టం చేశారు. ఏ ఒక్క హామీ విషయంలోనూ చెప్పినట్టు నడుచుకున్న సందర్భం ఒక్కటి కూడా లేదని విమర్శించారు. జగన్ ప్రకటించిన ఏ హామీ కూడా నెరవేరలేదు కాబట్టి, నవరత్నాలన్నీ రాళ్లుగానే మిగిలిపోయాయని సత్యకుమార్ వ్యంగ్యంగా స్పందించారు. అటువంటి వ్యక్తి.. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా తీరును విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

# ఉగాది నుండి రాష్ట్రంలో పీ-4 విధానం

- పేదరిక నిర్మూలనే లక్ష్యం
- ప్రజల నుండి సలహాలు, సూచనల స్వీకరణ
- తరువాతే విధి, విధానాలు ఖరారు
- అధికారులతో సమీక్షలో సీఎస్ విజయానంద్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో వచ్చే ఉగాది నుండి పీ-4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్స్-పార్టనర్ షిప్)విధానం అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.విజయానంద్ వెల్లడించారు. పీ-4 విధానంపై గురువారం రాష్ట్ర సచివాలయంలో అధికారులు, వర్చువల్‌గా పాల్గొన్న జిల్లా కలెక్టర్లతో సీఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4 విధానాన్ని అమలు చేయనున్నట్టు తెలిపారు. ముఖ్యంగా సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న పది శాతం మంది పేదరికంలో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మందికి చేయూతనివ్వడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నదే పీ-4 విధానం ముఖ్య ఆశయమని ఆయన పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో విధి, విధానాల రూపకల్పనకు ప్రజల నుండి సూచనలు, సలహాలు స్వీకరించండంతో పాటు దీనికోసం ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను కూడా రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ సలహాలు, సూచనలు ఆధారంగానే పీ-4 విధానాన్ని అమలు చేస్తామని అన్నారు. పేదలకు సాయం చేసేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు, ఎన్నారైలు తదితరులను ఉగాది రోజు జరిగే పీ-4 ప్రారంభ కార్యక్రమానికి ప్రభుత్వం ఆహ్వానించి వారందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకు రావడం ద్వారా పీ-4 అమలమకు శ్రీకారం చుట్టనున్నట్టు సీఎస్ చెప్పారు.

స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా ప్రతి ఏటా 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా ఆవాసం, గ్రామ, మండల, నియోజకవర్గం, జల్లా స్థాయి విజన్ ప్రణాళికలను రూపొందించాల్సి ఉందని అధికారులకు సీఎస్ విజయానంద్ స్పష్టం చేశారు. ఇందుకుగాను ప్రతి నియోజకవర్గానికి జిల్లా స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించాలని జిల్లా కలక్టర్లను ఆదేశించారు. నోడల్ అధికారికి 6గురు సభ్యుల బృందం.. గ్రామ వార్డు సచివాలయాలకు చెందిన 5గురు, ప్రణాళికాశాఖ నుంచి ఒక ప్రొపెషనల్ సహాయపడతారని తెలిపారు. ప్రణాళికా శాఖ ద్వారా ప్రత్యేక ప్రశ్నావళి ద్వారా వివరాలు సేకరించాల్సి ఉంటుందని, ఈ కన్సల్టెన్సీ సర్వేను ఈ నెల 7వ తేదీ నుండి 22వ తేదీలోగా సేకరించాల్సి ఉందన్నారు. ప్రణాళిక శాఖ ద్వారా జిల్లా స్థాయిలో ఇన్‌చార్జి మంత్రి నేతృత్వంలో వివిధ ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థలు, నిపుణులతో సమావేశాలు నిర్వహించాలని, విద్యాశాఖ ద్వారా పాఠశాలలు, కళాశాలల స్థాయిలో విద్యార్థులకు వ్యాస రచన, వకృత్వ పోటీలు, మున్సిపల్ శాఖ ద్వారా జిల్లా కేంద్రాల్లో పేదరిక నిర్మూలన ఆవశ్యకతపై మారథాన్ వంటివి నిర్వహించాల్సి ఉందని చెప్పారు.

### 500 సీబీపీల ఏర్పాటుకు వెంటనే స్థలాలు గుర్తించాలి

రాష్ట్రంలో 500 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల (సీబీపీ)ను ఏర్పాటు చేసేందుకు రిలయెన్స్ సంస్థ ముందుకు వచ్చిన నేపథ్యంలో వాటి ఏర్పాటుకు అవసరమైన స్థలాలను గుర్తించేందుకు జిల్లా కలెక్టర్లను వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సీఎస్ విజయానంద్ ఆదేశించారు. ప్రతి ప్లాంట్‌కు 25 ఎకరాలు భూమి అవసరం ఉంటుందని, భూములను గుర్తించి సీసీఎల్‌ఏకు అడ్వాన్సు పొజిషన్ కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, వన సంరక్షణ సమితులు వంటి వారిని దీనిలో పూర్తిగా భాగస్వామ్యం చేయడం ద్వారా వీటి ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

### నియోజకవర్గానికో ఎంఎస్‌ఎంఇ పార్కు

రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఎంఎస్‌ఎంఇ పార్కు ఏర్పాటు చేసేందుకు వీలుగా మార్చి 15లోగా సర్వే నిర్వహించాలని అధికారులను సీఎస్ విజయానంద్ ఆదేశించారు. ఎంఎస్‌ఎంఇ సర్వే సక్రమంగా జరిగేలా ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక, ఆర్థికశాఖల ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పీ-4 విధానం అమలు, స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికలో భాగంగా ఆవాసం, గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా ప్రణాళికల రూపకల్పనకు తీసుకోవాల్సిన అంశాలపై వివరించారు. అలాగే పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డా.ఎన్.యువరాజ్ ఎంఎస్‌ఎంఇ సర్వే నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఇంకా ఈ సమావేశంలో ఐటి, ఆర్టిజిఎస్ శాఖల కార్యదర్శి కె.భాస్కర్, ఆర్టీజిఎస్ సిఇఒ దినేష్ కుమార్, వీరపాండ్యన్, కీర్తి, శివ ప్రసాద్, అనంత శంకర్, తదితర అధికారులు పాల్గొనగా వర్చువల్‌గా పలువురు కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.



# ఆలపాటిని మంచి మెజారిటీతో గెలిపించాలి

- ఎమ్మెల్యే నసీర్, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని పిలుపు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై విస్తృతస్థాయి సమావేశం

గుంటూరు (చైతన్యరథం): ఉమ్మడి గుంటూరు-కృష్ణా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత తమ తొలి ప్రాధాన్యం టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కే ఇవ్వాలని, ఇది పట్టభద్రుల భవితకు భద్రత కల్పిస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహం, ఓటింగ్ సరళిపై గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ ఆధ్వర్యంలో గురువారం ఫాన్సీ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, ఏపీ టీడీసీ ఛైర్మన్ డా.నూకసాని బాలాజీ, మాజీ మంత్రి ఆలపాటి రాజా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పట్టభద్రులు వేసే ప్రతి ఓటు యువత భవిష్యత్తుకు గీటురాయిగా మారుతుందన్నారు. ఓటు ఒక చైతన్యమని, ఆలపాటి రాజా వంటి నాయకులకు మద్దతు తెలపడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. గుంటూరు నగరంలో 30 వేలకుపైగా ఎమ్మెల్సీ ఓటర్లు ఉన్నారని, వీరందరూ పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసేలా చైతన్య పరచాలని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఈ సందర్భంగా నసీర్ పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలో ఓటర్లంతా ఆలపాటి రాజాను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని, మరోసారి కూటమి ప్రభుత్వ పనితీరుకు ఇది తీర్పుగా మారుతుందని ఆయన పేర్కొన్నారు.

అనంతరం ఎన్నికల పరిశీలకుడు నూకసాని బాలాజీ మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఓటర్లపై అపార నమ్మకం ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఆలపాటి రాజాను భారీ మెజారిటీతో గెలిపించి తీరుతారని పేర్కొన్నారు.

మాజీ మంత్రి ఆలపాటి రాజా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో శానన మండలిలో పట్టభద్రుల తరపున తాను గళం వినిపిస్తానని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత తమ ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామ కృష్ణ, జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరావు, చిట్టాబత్తిని చిట్టిబాబు, కార్పొరేషన్ డైరెక్టర్ రాజా మాస్టర్, పాకనాటి రామ దేవి, జాగర్లమూడి శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ సజీలా, కార్పొరేటర్ ఎలావుల అశోక్, ఆనంద్ సాగర్, ఎర్రి ధనలక్ష్మి, కార్పొరేటర్ భారతి, కార్పొరేటర్ మీరావలి, టీడీపీ నేతలు, పట్టభద్రులు, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీకి మరో ఎదురు దెబ్బ... టీడీపీలో చేరిన వైసీపీ నాయకుడు



విశాఖపట్నం (చైతన్యరథం): భీమిలి నియోజకవర్గంలో వైసీపీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. ఆనందపురం మండలం రామవరం పంచాయతీకి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, భీమిలి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాకరపూడి వరహాలరాజు, ఆయన కుమారుడు, వైసీపీ పాడేరు ఎన్నికల ఇన్‌ఛార్జ్ శ్రీకాంత్‌రాజు అనుచరులతో కలిసి గురువారం టీడీపీలో చేరారు. ఆనందపురం మండలం శొంఠ్యాంలో జరిగిన బహిరంగ సభలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు టీడీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. 2014-19లో మంత్రి గంటా శ్రీనివాసరావు పెద్దఎత్తున చేసిన అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగానే 2024 ఎన్నికల్లో 92వేల భారీ మెజార్టీ ప్రజలు ఇచ్చారని, మా ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలనే సంకల్పంతో టీడీపీలో చేరినట్లు శ్రీకాంత్‌రాజు తెలిపారు. కణమాం ఎంపీటీసీ సభ్యుడు గొలగాని కృష్ణ, మాజీ సర్పంచ్ సీతారామరాజు, శొంఠ్యాం సొసైటీ మాజీ డైరెక్టర్ సత్తిబాబుతో సహా 200 మంది టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, లొడగల అప్పారావు, తర్లువాడ సర్పంచ్ బీఆర్బీ నాయుడు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, టీడీపీ నాయకులు డీఏఎన్ రాజు, తాత్రాజు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం షాపుల దరఖాస్తు గడువు పెంపు

విజయనగరం (చైతన్యరథం): గుమ్మలక్ష్మీపురం మండలం దుడ్డుఖల్లు గ్రామం పరిధిలో గురువారం దాడులు నిర్వహించి, అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి, 48 ఒరిస్సా మద్యం సీసాలను స్వాదీనం చేసుకున్నట్లు కురుపాం ఎక్సైజ్ సిఐ పి. శ్రీనివాసరావు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం, దుఖాణాలు నిర్వహించినా, పన్ను చెల్లించని మద్యం కలిగి ఉన్న, నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో పార్వతీపురం ఈ.ఎస్.టీ.ఎఫ్.సీఐ శేఖర్ బాబు, ఎస్సై రాజశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధి కురుపాం నియోజకవర్గంలో ఉన్న కల్లుగీత కార్మికులు, కులస్తులకు ప్రభుత్వం కేటాయించిన మద్యం షాపు దరఖాస్తుల నమోదు చేసుకొనుటకు ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 వరకు గడువు పొడిగించినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన కల్లు గీత కార్మికులు, కులస్తుల అభ్యర్థులు పొడిగించిన సమయాన్ని గమనించి దరఖాస్తులు సమర్పించుకోవచ్చున్నారు. దరఖాస్తుతోపాటు కులధృవీకణ పత్రం, స్థానిక నివాస ధృవీకరణపత్రం, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఏదైనా గుర్తింపుకార్డు, 3 పాస్ పోర్టు సైజు ఫోటోలు, దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు (తిరిగి చెల్లించబడని రుసుము) జతచేయాలన్నారు.

## డాలర్ డ్రీమ్స్ ఆవిరి.. తొలివిడతలో భారత్ చేరిన 104మంది

### ఎవరిని కదలించినా కన్నీటి కథలే..!



అమెరికా హోంలాండ్ అధికారుల లెక్కల ప్రకారం 20,407 మంది భారతీయుల దగ్గర సరైన పత్రాలు లేనట్లు గుర్తించారు. వీరిలో 17,940 మందిని వెనక్కి పంపేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. బలవంతంగా అమెరికా నుంచి పంపించి వేయడంతో భారత్ చేరుకున్న 104 మంది భారతీయుల పరిస్థితి దారుణంగా తయారయ్యింది. డాలర్ డ్రీమ్స్ ఆవిరయ్యాయి. భారత్‌కు తరలించిన వాళ్లను కదిలిస్తే కన్నీటికథలు బయటకు వస్తున్నాయి. తమ వాళ్ల ఆచూకీ కోసం ఇన్నాళ్లు తల్లడిల్లిన ఆప్తులు అమృత్‌సర్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. హర్యానాకు చెందిన 33 మంది, గుజరాత్‌కు చెందిన 33 మంది, పంజాబ్‌కు చెందిన 30 మంది, మహారాష్ట్ర, చండీఘడ్‌కు ముగ్గురు చొప్పున భారత్‌కు పంపించారు. అమెరికాకు ఎన్నో ఆశలతో వెళ్లామని, ఇలాంటి పరిస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదు. 40 లక్షల రూపాయలు ఖర్చు చేసి వెళ్లారు. తమ కొడుకుకు ఉజ్వల భవిష్యత్తును ఇస్తానని హామీ ఇచ్చి అమెరికాకు పంపామని కుటుంబసభ్యులు భోరుమన్నారు. కానీ ఇప్పుడు అతను ఖాళీ చేతులతో తిరిగి వచ్చాడని చెప్పారు. తమ కల చెదిరిపోయిందని, ఇప్పుడు ఈ భారీ అప్పును ఎలా తీర్చాలో ఆలోచిస్తున్నామని అంటున్నారు. మొత్తం మీద, ఒకవైపు, వారి కొడుకు తిరిగి రావడంతో కుటుంబం సంతోషంగా ఉండగా, మరోవైపు, అప్పుల భారం వారి తలపై ఉంది. ఎవరి గోడు వారు వెళ్ళబోసుకుని కన్నీటిపర్యవంతమయ్యారు.

## విశాఖ అన్న క్యాంటీన్‌లో భోజనం రుచిచూసిన సినీనటులు

విశాఖపట్నం (చైతన్యరథం): నగరంలోని అన్న క్యాంటీన్లో ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. డ్యాన్స్ మాస్టర్, దర్శకుడు అమ్మ రాజశేఖర్, జబర్దస్త్ నటుడు ముక్కు అవినాష్, 'తల' చిత్రం ద్వారా హీరోగా పరిచయం కానున్న రాగిణి రాజ్, చిత్ర బృందం సభ్యులు అన్న క్యాంటీన్లో భోజనం చేశారు. గురువారం మధ్యాహ్నం స్థానికులతో పాటు క్యూలో నిల్చుని భోజనం చేసిన వీరంతా అక్కడే కాసేపు సరదాగా గడిపారు. ఈ సందర్భంగా అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ.. విశాఖ వాసులతో కలిసి అన్న క్యాంటీన్లో భోజనం చేయడం తాను జీవితంలో మర్చిపోలేనన్నారు. అన్న క్యాంటీన్లో భోజనం చేయడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని నటుడు రాగిణిరాజ్ అన్నారు.



## వైసీపీ లిక్కర్ అక్రమాలపై సీఐడీ విచారణ




ఆంధ్రప్రదేశ్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. గత ప్రభుత్వ హయంలోని మద్యం అక్రమాలపై కూటమి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఏడుగురు పోలీసు ఉన్నతాధికారులతో సిట్ వేయడం ఆసక్తి రేపుతోంది. ఇంతకీ.. ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌లో ఎవరెవరు ఉన్నారు?.. సిట్‌కు కూటమి ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు ఇచ్చింది? అన్నదీ హాట్ టాపిక్‌గా మారింది. ఏపీ రాజకీయాల్లో హీట్ ఏమాత్రం తగ్గడం లేదు. అధికార, ప్రతిపక్షాల విమర్శలు, ప్రతివిమర్శలతో పాలిటిక్స్ కాకరేపుతున్నాయి. మరోవైపు.. కూటమి ప్రభుత్వ వరుస నిర్ణయాలతోనూ మరింత ఏపీ వేడెక్కుతోంది. తాజాగా.. వైసీపీ హయాంలోని మద్యం అక్రమాలకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసేందుకు ఏపీ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ చీఫ్‌గా విజయవాడ సీపీ రాజశేఖరబాబును నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. సిట్ సభ్యులుగా ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ సుబ్బారాయుడు, అడిషనల్ ఎస్పీలు కొల్లి శ్రీనివాస్, శ్రీహరిబాబు, డోన్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు శివాజీ, నాగశ్రీనివాస్‌ను నియమించింది. దానిలో భాగంగా.. 2019 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు జరిగిన మద్యం అక్రమాలపై ఎంక్వైరీ చేయాలని ఏడుగురు సభ్యుల సిట్ బృందానికి ఆదేశాలు ఇచ్చింది. సిట్ దర్యాప్తుకు అన్ని రకాల అధికారాలు కల్పించిన ఏపీ ప్రభుత్వం.. రికార్డులు సీజ్ చేసేందుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక.. జగన్ ప్రభుత్వ హయాంలో ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్‌లో జరిగిన అవకతవకలపై గతంలోనే ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. దీనిపై ఇప్పటికే దర్యాప్తు కొనసాగుతోంది. అయితే.. ఈ దర్యాప్తును మరింత స్పీడ్ పెంచేందుకు సిట్‌ను నియమించాలని ఏపీ ప్రభుత్వానికి డీజీపీ ప్రతిపాదనలు పంపారు. దాంతో.. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. దీనికి సంబంధించి సిట్ అధికారులు అడిగిన నివేదికను ఇవ్వాలని ఎక్సైజ్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. అలాగే.. ప్రతి 15 రోజులకోసారి దర్యాప్తు పురోగతిపై విచారణ నివేదిక ఇవ్వాలని కూడా సిట్‌ను ఆదేశించింది. సీఐడీ డీఐజీ ఆధ్వర్యంలోనే సిట్ పనిచేస్తుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. గత ప్రభుత్వంలో ఏపీలోని మద్యం విక్రయాల్లో వేల కోట్ల నగదు లావాదేవీలు జరిగినట్లు అభియోగాలు ఉన్నాయి. నగదు లావాదేవీలతో పాటు హోలో గ్రామ్‌ల వ్యవహారంలోనూ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే.. లిక్కర్ అక్రమాలపై సాధ్యమైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేసి. సీఐడీ డీజీ ద్వారా రిపోర్ట్ సమర్పించాలని ఏపీ ప్రభుత్వం సిట్‌ను ఆదేశించింది.

## ఏపీ కోళ్లకు అంతుచిక్కని వైరస్... లక్షల్లో మృత్యువాత

భీమవరం (చైతన్యరథం): ఏపీ పౌల్ట్రీల్లో కోళ్ల మృత్యువాత కలకలం రేపుతోంది. అంతుచిక్కని వైరస్‌తో లక్షలాది కోళ్లు మృత్యువాత పడుతుండటం కలవరపెడుతోంది. ప్రధానంగా ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని ప్రతి పౌల్ట్రీలో నిత్యం రోజుకు వేలాది కోళ్లు మరణిస్తున్నాయి. గత 15 రోజుల్లో సుమారు 40 లక్షలకు పైగా కోళ్లు చనిపోయినట్టు అంచనా. డిసెంబర్లోనే మొదలైన అంతుచిక్కని వైరస్ సంక్రాంతి తర్వాత మరింత విజృంభించింది. పశ్చిమ గోదావరి జిల్లా ఉంగుటూరు మండలం బాదంపూడిలోని ఓ పౌల్ట్రీలో ఇప్పటికే 1.60 లక్షల కోళ్లు మరణించాయి. అప్పటివరకు ఆరోగ్యంగా కనిపించిన కోడి అంతలోనే మృత్యువాత పడుతుండటం పౌల్ట్రీ నిర్వాహకులను కలవరపెడుతోంది. సాధారణ మరణాలకు భిన్నంగా వేలాది కోళ్లు చనిపోతుండటం వారికి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. అంతుచిక్కని వైరస్ చాపకింద నీరులా పౌల్ట్రీలకు విస్తరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, అత్తిలి, ఇరగవరం, దేవరపల్లి, ఉండ్రాజవరం తదితర మండలాల్లో దాదాపు 200 పౌల్ట్రీలు ఉన్నాయి. వీటిలో గుడ్లు పెట్టే కోళ్లు 1.30 కోట్ల వరకు ఉండగా.. రోజుకు 1.05 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 245 షెడ్లలో 1.35 కోట్ల కోళ్లు ఉండగా.. వీటిని 245 షెడ్లలో పెంచుతున్నారు. ఈ జిల్లాలో నిత్యం 1.08 కోట్ల వరకు గుడ్ల ఉత్పత్తి జరుగుతోంది. మొత్తంగా రెండు జిల్లాల్లో గుడ్లు పెట్టే కోళ్లు 2.65 కోట్ల వరకు ఉండగా.. నిత్యం 2.13 కోట్ల కోడిగుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. తూర్పు గోదావరి జిల్లాలో అనపర్తి, నిడదవోలు, నల్లజర్ల, గోపాలపురం, కొవ్వూరు, కడియం ప్రాంతాల్లో పౌల్ట్రీలు ఉన్నాయి. ఇవేకాకుండా మాంసానికి వినియోగించే బ్రాయిలర్ కోళ్లను ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో నెలకు 12 లక్షలకు పైగా పెంచుతున్నారు. వీటి సంఖ్య ప్రతి 40 రోజులకు మారిపోతుంటుంది. సాధారణంగా డిసెంబర్, జనవరి మాసాల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువై కొరైజా, సీఆర్డీ (క్రానిక్ రెస్పిరేటరీ డిసీజ్), రానికెట్ వంటి ఊపిరితిత్తుల సంబంధిత వైరస్లు వ్యాపిస్తుంటాయి. సాధారణంగా ఆరోగ్య సమస్యలు, ఇతర కారణాలతో పౌల్ట్రీలోని కోళ్ల సంఖ్యలో రోజుకు 0.05 శాతం లోపు కోళ్లు మృత్యువాత పడుతుంటాయి. లక్ష కోళ్లు ఉన్న పౌల్ట్రీలో రోజుకు 20 నుంచి 50 వరకు కోళ్లు చనిపోతుంటే పరిగణనలోకి తీసుకోరు. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది.



కొద్దిరోజుల క్రితం నాటు కోళ్లలో కనిపించిన వింత లక్షణాలు ఇప్పుడు లేయర్, బ్రాయిలర్ కోళ్లకు వ్యాపించాయి. నాటు కోళ్లతో పోలిస్తే లేయర్ కోళ్లకు వ్యాక్సినేషన్ విషయంలో పౌల్ట్రీ వర్గాలు చాలా జాగ్రత్తలు తీసుకుంటాయి. కోడికి 20 వారాల వయసు వచ్చేనాటికి ఐ డ్రాప్స్, నీటిద్వారా, ఇంజెక్షన్ రూపంలో దాదాపు 23 వరకు వ్యాక్సిన్లు వేస్తారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా కోళ్లు అంతుచిక్కని లక్షణాలతో మృత్యువాత పడుతుండటం పౌల్ట్రీ వర్గాలను కలవరపరుస్తోంది. కొన్ని పౌల్ట్రీల్లో అసాధారణ రీతిలో కోళ్ల మరణాలు సంభవిస్తున్నాయి. లక్ష కోళ్లు ఉంటే రోజుకు 3వేల నుంచి 4వేల వరకు చనిపోతున్నాయి. మూడు లక్షల కోళ్లు ఉన్న ఒక పౌల్ట్రీలో వారం రోజులుగా రోజుకు 13 వేల నుంచి 14 వేల వరకు కోళ్లు మృత్యువాత పడుతున్నట్టు ఉంగుటూరు మండలానికి చెందిన రైతు ఒకరు చెప్పారు.

# జగన్ హయాంలో ఇరిగేషన్‌తో పాటు అన్నీ వ్యవస్థలు విధ్వంసం

**●ఏపీ ఇరిగేషన్ ఎన్జీవోల 2025 సంవత్సర డైరీ ఆవిష్కరణలో మంత్రి నిమ్మల రామానాయుడు**



రాష్ట్రంలో గత ఐదేళ్ల జగన్ పాలనలో ఇరిగేషన్ శాఖతో పాటు అన్ని వ్యవస్థలు విధ్వంసం చేశారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. విజయవాడ రైతు శిక్షణా కేంద్రంలో ఏపీ ఇరిగేషన్ ఎన్ జి ఓ స్ అసోసియేషన్ 2025 డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబులతో కలసి ఆయన డైరీ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ... గత ఐదేళ్ల పాలనలో ఏ ముఖ్యమంత్రి హయాంలో జరగని విధ్వంసం జరిగిందని, ఆ నష్టాన్ని పూడ్చడానికి మంత్రులు, ఉద్యోగులు డబుల్ వర్క్ చేయాల్సి వస్తోందని అన్నారు. ఇరిగేషన్ వ్యవస్థకు సంబంధించి కనీసం కాలువలు, డ్రైన్ల పూడికతీత పనులు గానీ, గేట్లు, డొర్లు, షట్టర్లు, లాకులకు, రొప్స్ కు గ్రేజు పెట్టడం కూడా చేయలేదన్నారు. గుండ్లకమ్మ, అన్నమయ్య డ్యాంలు కొట్టుకుపోవడం, పోలవరం డయాఫ్రమ్ వాల్ విధ్వంసం జరిగాయని తెలిపారు. గత ఐదేళ్ల లో జరిగిన నష్టాన్ని పూడ్చడానికి ఉద్యోగులు,నాయకులు అందరం కలసి పని చేయాలని కోరారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం నిర్మాణం పూర్తి చేసే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవలే షెడ్యూల్ విడుదల చేశారని దానికి అనుగుణంగా పని చేస్తున్నామని అన్నారు. ఇంక వెలిగొండ, చింతలపూడి, హంద్రీనీవా ప్రాజెక్టు లు ఒకటి, రెండేళ్లలో పూర్తి చేసి మిగిలిన మూడేళ్లలో మిగతా ప్రాజెక్టుల నిర్మాణ పనులను సైతం వేగవంతం చేస్తామని తెలిపారు. రాష్ట్రాన్ని కరువు రహిత రాష్ట్రంగా మార్చే శక్తి ఇరిగేషన్ శాఖకు మాత్రమే ఉందన్నారు. మనమంతా సమన్వయంతో పనిచేస్తే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. నేడు సమాజంలో అన్ని వృత్తుల కన్నా ఇరిగేషన్ శాఖ సేవా దృక్పథంతో పని చేస్తుందని అందరికీ అన్నం పెట్టే అన్నదాతలకు సాగునీరు అందిస్తుందన్నారు. జలం ప్రగతికి మూలం అంటూ నీరు వల్లనే ఆనాటి నుంచి నాగరి నాగరికతలు వెరజిల్లుతున్నాయని చరిత్ర చెబుతుంది అన్నారు. ఇరిగేషన్ ఎన్జీవో అసోసియేషన్ నాయకులు నా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి రామానాయుడు తెలిపారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇరిగేషన్ వ్యవస్థలో అనేక విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇరిగేషన్ మంత్రి రామానాయుడుల పనితీరేనంటూ అందుకనుగుణంగా ఉద్యోగులు బాధ్యతతో పనిచేస్తే ప్రజలకు మంచి సేవలు అందించగలమన్నారు. జగన్ ఐదేళ్లలో వ్యవస్థను, పోలవరం ప్రాజెక్టును భ్రష్టు పట్టించారన్నారు. నేడు ఆ పరిస్థితి నుంచి మార్పు వచ్చిందన్నారు. మా ప్రాంతంలో ఆరేళ్లుగా హెచ్.ఎల్.సి నుంచి కుడి కాలువకు నీరు అందకపోవడంతో రెండు మండలాలు కరువు ప్రాంతాలుగా మారాయని, నేడు మంత్రి రామానాయుడు ఒక ఫోన్ కాల్‌తో నీరు వచ్చే పరిస్థితి రావడంతో రైతులు పాలాభిషేకం జరుపుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఎన్సీలు వెంకటేశ్వరరావు, రత్నకుమార్, ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ కె.వి. శివారెడ్డి, ఇరిగేషన్ ఎన్జీవోల రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఏ.విద్యాసాగర్, టెక్నికల్ అసోసియేషన్ కార్యదర్శి సోమయాజులు, పీఏఓ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# సునీల్ కుమార్ చెబితేనే వచ్చారు : రఘురామ కృష్ణంరాజు ఆగ్రహం



ఆకివీడు (చైతన్యరథం): పోలీసు స్టిక్కర్ వేసుకుని సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్ అనుచరులు హల్‌చల్ చేసిన ఘటనపై డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు స్పందించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఆకివీడులో బుధవారం సాయంత్రం ఇన్నోవా కారులో పోలీసు అని స్టిక్కర్ వేసుకుని కొంత మంది వ్యక్తులు మున్సిపాలిటీ వద్ద గొడవ చేశారని అన్నారు. గుత్తికొండ వెంకట జోగారావు పేరు మీద ఆ కారు ఉందని.. సునీల్ కుమార్ చెబితే వాళ్ళు వచ్చినట్టు తాను తెలుసుకున్నానన్నారు. ఇంత విచ్చల విడిగా రౌడీయిజం చేయడానికి చూస్తే ఏం చర్యలు తీసుకుంటారని అన్నారు. సునీల్ కుమార్ అనుచరుడు జోగారావుపై చర్యలు తీసుకోవాలన్నారు. అంబేద్కర్ మిషన్‌కు తనకు సంబంధం లేదని సునీల్ కుమార్ చెప్పగలడా అని ప్రశ్నించారు. నిన్న జరిగిన సంఘటనకు సునీల్ కుమార్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వాళ్ళ కారులో వచ్చి ప్రభుత్వ కార్యాలయంపై దాడి చేశారని.. సునీల్ కుమార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. ఇక్కడ కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. "నా కస్టోడియల్ కేసులో సునీల్ కుమార్ పార్టీ పెట్టుకున్నా నేను వదిలేది లేదు. నా హృదయానికి తెలిసి నేను ఏ తప్పూ చేయడం లేదు" అని రఘురామకృష్ణం రాజు స్పష్టం చేశారు.

# కూటమి నేతలతోనే అభివృద్ధి సాధ్యం : టీడీపీ నేత పిల్లి సత్యనారాయణ



కాకినాడ (చైతన్యరథం): ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరం గెలుపునకు కృషి చేయాలని, కూటమి నేతలతోనే అభివృద్ధి సాధ్యమని కాకినాడ రూరల్ టీడీపీ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ, ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్, విశాఖసౌత్ ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ సీతం రాజ్ సుధాకర్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్, నియోజవర్గ అబ్జర్వర్ కుడుపూడి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి పిలుపునిచ్చారు. పేరాబత్తుల రాజశేఖరం గెలుపు కోసం కరప మండలం నడకుదురు, కరప, గురజనపల్లి, యండమూరు, పాతర్లగడ్డ తదితర గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో ఉండటం వల్ల రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, మోదీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రతి పథకాన్ని ప్రజలకు అందించడానికి పనిచేస్తున్నారన్నారు. కాకినాడ రూరల్ నియోజవర్గం సంబంధించి 12,939 పట్టబద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారని వారిలో రూరల్ మండలంలో 10,472 మంది ఓటర్లు ఉన్నారని.. దీంతో పాటుగా కాకినాడ నగర పరిధిలోని రూరల్ డివిజన్ లలో 1619 మంది, కరప మండలంలో 2467పట్టభద్రులు ఉన్నారన్నారు. నియోజకవర్గంలో 17 బూత్‌లు ఉన్నాయని, పార్టీ ఆదేశాలతో ప్రతి 30 మంది ఓటర్లకు ఒక నాయకుడికి భాద్యతలు అప్పగించడం జరిగిందన్నారు. సుమారు 470మందిని బూత్‌ఇన్‌ఛార్జులు నియమించి ఎన్నికల ప్రచారానికి వెళు_తున్నామన్నారు. కూటమిలో ఉన్న నాయకులు ఏకతాటిపైకి వచ్చి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని పిలుపునిచ్చారు. నాటి ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి పూర్తి సహకారం అందించి 72 వేల పై చిలుకు ఓట్ల మెజారిటీతో కాకినాడ రూరల్ సీటును గెలిపించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించండి



కోరుకొండ (చైతన్యరథం): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్డీయే కూటమి అభ్యర్థి పేరాబత్తులు రాజశేఖరంకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాజమండ్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి వ్యాఖ్యానించారు. గురువారం రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం కోరుకొండ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చెరుకూరి విద్యాలయం, ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో ప్రత్యేక సమావేవాలు నిర్వహించారు. రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పాఠశాలలు, కళాశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గ పరిశీలకులు కొత్తపల్లి ఆశిష్, ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థి గెలుపు మండలికే వన్నె తెస్తుంది

**●పేరాబత్తుల సత్యవేణి, వనమాడి మోహన్ వర్మ**



కాకినాడ (చైతన్యరథం): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రల ఎమ్మెల్సీ ఎన్డీయే కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు మండలికే వన్నె తెస్తుందిని పేరాబత్తుల రాజశేఖర్ సతీమణి పేరాబత్తుల సత్యవేణి, శాసనసభ్యులు వనమాడి కొండబాబు కుమారుడు వనమాడి మోహన్ వర్మ పేర్కొన్నారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్డీయే కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గురువారం పేరాబత్తుల రాజశేఖర్ సతీమణి పేరాబత్తుల సత్యవేణి, కాకినాడ సీటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు కుమారుడు వనమాడి మోహన వర్మ ఎమ్మెఎస్ఎన్ డిగ్రీ కాలేజీ, ఏఎస్‌డీ ఉమెన్స్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల మరియు ఆంధ్ర పాలిటెక్నిక్, ఫిషరీస్ కార్యాలయం, మున్సిపల్ స్కూల్స్ నందు పర్యటించి పట్టభద్రుల ఓటర్లను కలిసి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగస్తులు, విద్యావంతులు, మేధావి వర్గాల ఆశీస్సులతో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ శాసనమండలలో ప్రశ్నించి పోరాటం చేయడం జరుగుతుందని, కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందునే రాష్ట్ర ప్రజలు నిర్భయంగా, ప్రశాంతంగా జీవిస్తున్నారని అన్నారు. జగన్ దుర్మార్గం, విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కాపాడి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ విరామం లేకుండా పని చేస్తున్నారని, కేంద్రంలో రాష్ట్రం కీలకం కాబట్టే కూటమి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి ఎక్కువ నిధులు తీసుకురావడం జరుగుతుందన్నారు. విద్యావంతులు, మేధావులు, ఉద్యోగస్తులు పేరాబత్తుల రాజశేఖర్‌కి మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలుపించాలని, నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వ పథకాలు సబ్సిడీలను సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదుగుదలకు రాజశేఖర్ కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి వీరు, పేరాబత్తుల వరప్రసాద్, వనమాడి హనీషా మోహన వర్మ, పలివెల రవి అనంతకుమార్, కోపనాతి నాగకుమారి, పిర్లలక్ష్మీ ప్రసన్న, కొనాడ ప్రకాష్, చొక్కా గిరి, ఎం.డి అన్సర్, పాలిక నాని, రమ్య, కేవీఎస్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# రాజశేఖరంను గెలిపించండి... నేతల పిలుపు



పెరవలి (చైతన్యరథం): ప్రజాశక్తి పెరవలి ఉభయగోదావరి జిల్లాల ఎన్డీయే కూటమి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపు కోసం నాయకులు ప్రచారం నిర్వహించారు. గురువారం సాయంత్రం పెరవలి గ్రామ పరిధిలో ఉన్న 239 గ్రాడ్యుయేట్ అభ్యర్థులను కలిసి కూటమి అభ్యర్థి రాజశేఖరంను గెలిపించాలని ఓటర్లను ఓట్లు అర్జించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బొడ్డు రామాంజనేయులు ఎంపీటీసీ రాపాక ప్రమీల నియోజవర్గ రైతు సంఘం అధ్యక్షులు సలాది కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ సలాది శ్రీహరి, పంపన మావుళ్ళు, బండారు వెంకటేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఆలపాటి రాజా గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : నక్కా ఆనందబాబు



వేమూరు (చైతన్యరథం) : వచ్చే పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. గురువారం వేమూరు మండలం, గ్రామంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల అవగాహనా సదస్సు, ఎన్నికల క్యాంపైన్ గురించి వేమూరు మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ... ఈనెలలో జరగనున్న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. అదే విధంగా కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఏడు నెలల పాలనలో అనేక విజయాలు సాధించామని, రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే టీడీపీ లక్ష్యమని, రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. రాజా గెలుపు కోసం డోర్ టూ డోర్ క్యాంపైన్ చేయాలన్నారు. ప్రతి ఓటరుని కలసి ప్రభుత్వ విజయాలను తెలియజేయాలన్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు తీసుకొని వచ్చిన కంపెనీలను, పథకాలను గురించి చైతన్యపరచాలి, ప్రతి రోజు మీకు కేటాయించిన 30-40 ఓటర్లను కలసి ఆలపాటి రాజా గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్డీయే కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డ్రోన్‌తో కనిపెట్టారు... జూదగాళ్ల పనిపట్టారు...

మచిలీపట్నం (చైతన్యరథం): అసాంఘిక శక్తుల అణచివేతకు పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ గంగాధరరావు తెలిపారు. జూదకార్యకలాపాలు, బహిరంగ మద్యపానం ఎక్కడ జరిగినా డ్రోన్ సాంకేతికతతో పసిగడతామన్నారు. బందరు మండలంలోని కొత్తపూడి గ్రామ శివారులో జూదం ఆడుతున్నారన్న సమాచారంతో డ్రోన్ కెమెరాల సాయంతో గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దానికి సంబంధించిన వీడియోని ఆయన బుధవారం విడుదల చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



# ఉద్యాన పంటలకు రాష్ట్రంలో ఇకపై మరింత ప్రోత్సాహం : చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో ఉద్యాన పంటలకు కూటమి ప్రభుత్వం రూపంలో ఇకపై మరింత ప్రోత్సాహం లభించనుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను కూడా అనుసంధానం చేసి పండ్లతోటల రైతులకు మేలు చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా పేర్కొన్నారు. ఆ దిశగానే పండ్ల తోటల పెంపకానికి ఉద్యానశాఖ ప్రోత్సాహకాలు అందిస్తోందని, సమీకృత ఉద్యాన మిషన్ పథకం ద్వారా వివిధ రకాల తోటలు, కూరగాయలకు రాయితీని అందిస్తూ ఔత్సాహికులను ముందుకు తీసుకెళ్తుందన్నారు. వినుకొండ మండలం తిమ్మాయపాలెంలో గురువారం డ్రాగన్, జమ సాగును చీఫ్ విప్ జీవీ సందర్శించారు. రైతు అడపాల రామకృష్ణ సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్, జమచెట్లు పరిశీలించి వివరాలు తెలుసుకున్నా రు. సంప్రదాయ పంటలు పక్కనపెట్టి... కొందరు రైతులు పండ్ల తోటలతో మంచి లాభాలు పొం దడం చూస్తే సంతోషంగా ఉందన్నారు. మరీ ముఖ్యంగా డ్రాగన్ ఫ్రూట్, తైవాన్ లెమన్, దానిమ్మ, బత్తాయి, మామిడి, జామ, బొప్పాయి వంటి వాటికి ప్రభుత్వం రాయితీ ఇస్తోందని... మార్కెట్లో కూడా వీటికి డిమాండ్ ఎక్కువ ఉందన్నారు. ఈ అనుభవాల నేపథ్యంలో ఉద్యాన పంటలను మరింత ప్రోత్సాహిస్తామన్న చీఫ్‌విప్ జీవీ ఉపాధిహామీ పథకం ద్వారా ఈ రంగంలోని రైతులకు చేయూతనిస్తామన్నారు. తక్కువ నీటి యాజమాన్యంతో ఎర్రనేలల్లో ఈ పంటల సాగుకి బాగా అనువుగా ఉంటుందని తెలిపారు. సీజనల్ పండ్లు పండే విధంగా రైతులు ప్రణాళిక చేసుకుంటే సంప్రదాయ వ్యవసాయం కంటే వీటిపై రైతులకు ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు.

# నేరస్తులతో జగన్ ఐదేళ్లు పాలన సాగించాడు : బుద్ధా వెంకన్న



విజయవాడ (చైతన్యరథం): జగన్ ఐదేళ్లు నేరస్తులతో పాలన చేశారని తెలుగుదేశంపార్టీ సీనియర్ నేత బుద్ధా వెంకన్న విమర్శించారు. ప్రజలు జగన్ పాలన చూసి కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. గురువారం టీడీపీ కార్యాలయంలో బుద్ధా వెంకన్న మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌పై బుద్ధా వెంకన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌ను మానసిక వైద్య నిపుణులకు చూపించాల్సిందిగా ఆయన భార్య భారతిని కోరుతున్నామని చెప్పారు. 30 సంవత్సరాలు తానే సీఎం అనే భ్రమలో జగన్ ఉన్నారని బుద్ధా వెంకన్న విమర్శించారు. జగన్ ఓడిపోయి 7 నెలలు కాలేదు అప్పుడే భ్రమల్లో జీవిస్తున్నారని ఆక్షేపించారు. వైసీపీ నాయకులే జగన్ మాటలకు విస్తుపోతున్నారని అన్నారు. అధికారంలో ఉండగా కార్యకర్తలు జగన్‌కు కనీసం గుర్తింపు కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు మీడియా ముందుకు వచ్చి గంటల తరబడి మాట్లాడుతున్నారని విమర్శించారు. జగన్ పాలనలో వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు తప్ప ఎవరూ సంతోషంగా లేరని అన్నారు. ఇవాళ మీడియా ముందుకు వచ్చి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని బుద్ధా వెంకన్న విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎవరి భూమి అయినా కబ్జాకు గురైందా? అని ప్రశ్నించారు. జగన్ హయాంలో రాష్ట్రమంతా కబ్జాలే అని ఆరోపించారు. జగన్‌ను ప్రజలు తిరస్కరించి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని చెప్పారు. దమ్ముంటే అసెంబ్లీకి వెళ్లి ప్రజల పక్షాన మాట్లాడాలని అన్నారు. జగన్ పాలనలో అసెంబ్లీలో మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో మహిళలను గౌరవిస్తున్నామని, వైసీపీ నేతలా మాదిరిగా కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం లేదని చెప్పారు. మీడియా ముందుకు వచ్చి జగన్ అబద్ధాలు మాట్లాడవద్దని అన్నారు. జగన్ 2.0 అంటే ఆ 11 సీట్లు కూడా ఉండవని బుద్ధా వెంకన్న విమర్శించారు.

# మునిగిపోతున్న పార్టీని కాపాడుకోవడానికే జగన్ 2.0

## ● 30 ఏళ్ల అధికారంటూ సినిమాకబుర్లు చెబుతున్నాడు : ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): “ఒక్క అవకాశమని రాష్ట్రప్రజల్ని నమ్మించి, శుష్క వాగ్దానాలతో అధికారం చేపట్టి, ఆనక నమ్మి ఓట్లేసిన జనాన్ని, రాష్ట్రాన్ని నామరూపాలు లేకుండా చేసిన జగన్ రెడ్డి పగటి కలలు కంటున్నాడు. తనకు ప్రతిపక్షహోదా ఇవ్వలేదని పవిత్రమైన అసెంబ్లీలో అడుగుపెట్టని వ్యక్తి మరో 30ఏళ్లు అధికారం వెలగబెడతానని ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటు. ముఖ్యమంత్రిగా తాను ప్రజలసంతోషం కోసం పనిచేశానని జగన్ చెప్పడం 8వ వింత. కార్యకర్తలను భవిష్యత్ లో ఉద్ధరిస్తాననడం పచ్చిబూటకం. అధికారంలో ఉన్నప్పుడు పరదాలు.. పోలీస్ వలయాల మధ్య డాబు, దర్పంతో ముఖ్యమంత్రి పదవి అంటే వారసత్వంగా వచ్చిన రాచరికమన్నట్టు విర్రవీగిన వ్యక్తి, ఇప్పుడు నిస్సిగ్గుగా కూటమిప్రభుత్వంపై తన అక్కసు వెళ్లగక్కుతున్నాడు. నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్నట్టు, సొంతపార్టీ వారి ముందు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నాడు. మునిగిపోతున్న పార్టీని, తనని వదిలించుకుంటున్న నాయకుల్ని ఏమార్చడానికే జగన్ 2.0లు.. 30ఏళ్ల అధికారమని సినిమాకబుర్లు అని ప్రత్తిపాటి అన్నారు. కట్టుకథలు, గారడీ మాటలతో ప్రజల్ని వంచించి, ఎడాపెడా పన్నులభారం మోపి, ధరల పెంపుతో వారిని వీరబాదుడు బాదింది జగన్‌రెడ్డి కాదా? పాలన ముసుగులో దుర్మార్గాలు, దోపిడీతో ప్రజల్ని నరకకూపంలోకి, రాష్ట్రాన్ని వెంటిలేటర్ పైకి చేర్చింది కాక, తగుదునమ్మా అంటూ ఇప్పుడు తాను పథకాలతో ప్రజల్ని మెప్పించానని బుకాయిస్తున్నాడు. జగన్ గత ఐదేళ్లు అమలుచేసిన 1.0తోనే జనం శంకగిరి మాన్యాలు పట్టేదుస్థితి వచ్చింది. ఇక ఇప్పుడు ఆయన చెబుతున్న 2.0తో అసలు రాష్ట్రమే ప్రపంచపటం నుంచి కనుమరుగు అవుతుందేమో. ఒక్కఛాన్స్ అని బతిమాలితే నమ్మి ప్రజలు అవకాశమిచ్చారు. అదే తన మొదటి, చివరి ఛాన్స్ అని జగన్ తెలుసుకుంటే మంచిది. ప్రజలపక్షాన చట్టసభల్లో గొంతెత్తడానికి భయం.. ప్రజల్లోకి వెళ్లి తన ప్రభుత్వం చేసిన మేలు ఇదని చెప్పుకోలేని అగత్యం. వెరసి జగన్‌కు అంతిమంగా మిగిలేది ప్రజల చేతిలో ఊహించని ఘోరపరాభవాలు.. సొంతపార్టీ వారి దెప్పిపొడుపుళ్లే. కూటమిప్రభుత్వ 8 నెలల పాలనా నిర్ణయాలు అమలైన హామీలు, ప్రజావిజయాలు ఏవీ జగన్ రెడ్డికి కనిపించవు. ఎందుకంటే టూరిస్ట్ మాదిరి ఎప్పుడో ఒకసారి రాష్ట్రానికి వస్తాడు కాబట్టి. అధికారముంటేనే ఆయనకు రాష్ట్రం, ప్రజలు గుర్తుకొస్తారు. ప్రజల, ప్రభుత్వ భూముల కాజేయడానికి జగన్ అండ్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను తొలిసంతకంతో ఎవరు రద్దు చేశారో జగన్ కి తెలియదు.. హామీకి కట్టుబడి సామాజిక పింఛన్లను రూ.4వేలు, రూ.6వేలు, రూ.10వేలకు పెంచింది చంద్రబాబనే వాస్తవాన్ని జగన్ జీర్ణించుకోలేడు. ఉచిత గ్యాస్ పథకంతో మహిళల ముఖాల్లో కొత్తవెలుగులు నింపింది చంద్రబాబనే నిజాన్ని ఆయన అంగీకరించడు. ప్రజల చేతికే ప్రభుత్వ సేవలు అందించే మనమిత్ర వాట్సాప్ సేవలు జగన్‌కు అర్థంకావు. ఉచిత ఇసుకవిధానం, పారదర్శకమద్యం విధానం, పోలవరం, అమరావతికి కేంద్రమిచ్చిన నిధులు. రైల్వే బడ్జెట్లో ప్రాధాన్యతలు, గ్రౌండ్ రియాలిటీ లు, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ల అమలుచేస్తూ తీసుకున్న తాజా నిర్ణయం జగన్‌కు అనవసర విషయాలు. ఎందుకంటే ఆయన ఆలోచనలన్నీ అవినీతి..దోపిడీ.. అక్రమార్జన.. హత్యారాజకీయాల చుట్టూనే తిరుగుతుంటాయి కాబట్టి. కూటమిప్రభుత్వం అమలుచేసిన హామీలు.. 8నెలల పాలనా ప్రగతిపై ప్రజలమధ్య మాట్లాడే ధైర్యం జగన్ కు లేదు. మునిగిపోతున్న తన పార్టీని, తనని వదిలించుకుంటున్న నాయకులను కాపాడుకోవడానికే జగన్ 2.0 లు.. 30 ఏళ్లు.. ముందు ముందు చూస్తారు అని ముచ్చట్లు చెబుతున్నాడు.” అని ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు.

# తురకా కిషోర్‌ను పట్టించిన చికెన్ !

తురకా కిషోర్.. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో రాష్ట్రవ్యాప్తంగా మారుమ్రోగిన పేరు.. మాచర్ల నియోజకవర్గంలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళ్లిన టీడీపీ నాయకుల కారుపై పెద్ద కర్రతో దాడి చేసిన సంచలనం సృష్టించిన వ్యక్తి తురకా కిషోర్. వైసీపీకి చెందిన తురకా కిషోర్ ఆ తర్వాత మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ కూడా అయ్యాడు. గత ఎన్నికల సమయంలోనూ అల్లర్లకు పాల్పడిన తురకా కిషోర్, అతడి తమ్ముడిపై మాచర్ల పిఎస్ పరిధిలో అనేక కేసులున్నాయి. అయితే ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతోనే తురకా కిషోర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతని కోసం పోలీసులు అనేక చోట్ల గాలింపు చేపట్టారు. అయినా ఆచూకీ దొరకలేదు. ఆరు నెలల పాటు పోలీసులకు దొరకకుండా తప్పించుకున్నాడు. దీంతో తురకా కిషోర్ ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక దృష్టిపెట్టారు. అయితే అజ్ఞాతంలోకి వెళ్లిన వెంటనే ఫోన్ నంబర్‌ను మార్చేశాడు. తెలిసిన వాళ్లెవరితోనూ మాట్లాడటం మానేశాడు. దీంతో అతని ఆచూకీ తెలుసుకోవడం మరింత కష్టంగా మారింది. అయితే హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి ప్రాంతంలో ఉన్న జైపురి కాలనీలో ఉంటున్నట్లు పోలీసులు ఎట్టకేలకు గుర్తించారు. గత ఏడాది డిసెంబర్‌లో పోలీసులు రైడ్ చేసి తురకా కిషోర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు రిమాండ్ విధించింది. ప్రస్తుతం కిషోర్ జైల్లో ఉన్నాడు. కిషోర్ ఫోన్ నెంబర్ మార్చేయడంతో అతన్ని పట్టుకునేందుకు అతని బ్యాంక్ ఖాతాలపై దృష్టిపెట్టారు. ఈ క్రమంలోనే ఫోన్ నెంబర్ మార్చేసినా.. ఫోన్ పే వాడుతున్నట్లు గుర్తించారు. జైపురి కాలనీలోని ఒక చికెన్ షాపులో ఆ ఫోన్ పే ద్వారా చెల్లింపులు చేస్తున్నట్లు సమాచారం సేకరించారు. తరుచుగా అదే షాపులో చికెన్ కొంటున్నట్లు తేల్చిన తర్వాత ఒక నిఘా టీంను హైదరాబాద్ పంపించారు. కిషోర్ కదలికలను తెలుసుకున్న తర్వాత ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత అరెస్ట్ చేశారు. ఆరునెలల పాటు ముప్పతిప్పలు పెట్టిన కిషోర్ ఆచూకీ చివరికి కోడి మాంసం పట్టించింది.

# మంత్రి ఆనం ఆధ్వర్యంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు

◆ 9న ఆత్మకూరుకు మంత్రులు ఫరూక్, నారాయణ, సవిత, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి రాక



నెల్లూరు (చైతన్యరథం): ఆత్మకూరు పట్టణంలో ఈనెల 9న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు ఐదుగురు మంత్రులు, పార్లమెంటు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ మేరకు మంత్రుల పర్యటన ఖరారైంది.

రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విచ్చేయనున్నారు.

9వ తేదీ ఉదయం 9.30 గంటలకు ఆత్మకూరు టిడ్కో గృహ సముదాయంలో శ్రీ సీతారాములు స్వామివారి ఆలయానికి భూమిపూజ, ఉదయం 10.30 గంటలకు పంచాయతీరాజ్ అతిథిగృహ నిర్మాణానికి శంకుస్థాపన, 11 గంటలకు ఆర్‌అండ్‌బి అతిథిగృహం ప్రారంభోత్సవం, 11.30 గంటలకు నూతన బీసీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ప్రారంభోత్సవం కార్యక్రమాల్లో మంత్రులు, ఎంపీ పాల్గొననున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆత్మకూరు బిసి ఆర్‌ఎస్ బాలికల పాఠశాలలో పాత్రికేయుల సమావేశం అనంతరం పాఠశాలల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తారు. ఈ కార్యక్రమాలకు ఆయాశాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.





ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి బైపాస్ సర్జరీ విజయవంతమై సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థిస్తూ కొత్తూరు అభయాంజనేయ స్వామి ఆలయంలో కొబ్బరికాయలు కొట్టి పూజల్లో పాల్గొన్న కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, నాయకులు

# పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవు

◆ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హెచ్చరిక

కోవూరు (చైతన్యరథం): వైద్య సేవలకు సంబంధించి నిర్లక్ష్యాన్ని సహించనని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి డాక్టర్లు, వైద్య సిబ్బందిని హెచ్చరించారు. బుచ్చిరెడ్డి పాళెం కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లో గురువారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హాస్పిటల్ అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో వివిధ వార్డులలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రాణాపాయ పరిస్థితులలో అత్యవసర వైద్య సేవల కోసం వచ్చే రోగుల సౌకర్యార్థం నైట్ షిఫ్టులో తప్పనిసరిగా డాక్టర్ల పర్యవేక్షణ వుండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. అసంపూర్తిగా వున్న అదనపు బ్లాక్ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గుండెపోటుతో బాధ పడుతూ హాస్పిటల్‌లో చికిత్స చేయించుకుంటున్న బుచ్చి 3వ సచివాలయ వి ఆర్ ఓ బట్టు సుధాకర్‌ను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పరామర్శించారు. సిబ్బంది కొరతకు సంబంధించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి పాళెం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ, బుచ్చి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, టిడిపి సీనియర్ నాయకులు ఎంవి శేషయ్య, కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి:ఎమ్మెల్యే

ఆకస్మిక తనిఖీలలో భాగంగా దామరమడుగు ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం తీరు తెన్నులను పరిశీలించారు. 416 మంది సామర్థ్యం వున్న హైస్కూల్‌లో 283 మంది మాత్రమే హాజరయిన సంఘటనకు సంబంధించి ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ నరసింహారావును ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రశ్నించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి రుచి, నాణ్యతలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంపై విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణలో విద్యాకమిటీలు క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. తల్లితండ్రులు సైతం తరచూ పాఠశాలలకు వెళ్లి పరిస్థితులను పరిశీలించాలని కోరారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు అధ్యాపకులతో పాటు తల్లితండ్రులు



కూడా కృషి చేయాలన్నారు. విద్యా ప్రమాణాలు పెంచే దిశగా విద్యాశాఖ మంత్రి లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలన్నారు. విద్యాకమిటీ సభ్యులు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరుశాతం పెంచేలా కృషి చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, చేజర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.


### అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించండి: రైతుల సమస్యలపై జేసీతో భేటీ

కోవూరు (చైతన్యరథం): రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశించారు. కోవూరు నియోజకవర్గం రైతు సమస్యలపై ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గురువారం జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో సమావేశమయ్యారు. ప్రభుత్వం వరి రైతులకు ప్రకటించిన గిట్టుబాటు ధర కల్పించేలా చొరవ తీసుకోవాలని కోరారు. రైతు సేవా కేంద్రాల ద్వారా జరిపే ధాన్యం కొనుగోళ్లలో కీలకపాత్ర పోషించే సహకార సొసైటీ సిబ్బందికి చెల్లించాల్సిన కమీషన్ల తాలూకు బకాయిలు చెల్లించాలని కోరారు. డెల్టా ప్రాంతమైన కోవూరు ప్రాంతంలో ఫిబ్రవరి రెండో వారం నుంచి వరి కోతలు మొదలవుతున్న నేపథ్యంలో రైతులకు ఖాళీ గోతాములు, హమాలీల కొరత రాకుండా చూడాలన్నారు. ధాన్యం రవాణాకు సంబంధించి ఎటువంటి అవాంతరాలు లేకుండా అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, నియోజక పరిధిలోని రైతు నాయకులు, నీటి సంఘ నాయకులు అత్తిపల్లి శివారెడ్డి, ఆదాల శివారెడ్డి, నెల్లూరు రమణారెడ్డి, మందపాటి రమణారెడ్డి, బత్తుల హరికృష్ణ, పాశం శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ గ్రీన్స్ కింద నెల్లూరుకు కేటాయించిన ప్రాజెక్టుల పురోగతి ఏమిటి?

◆లోక్‌సభలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్న

నెల్లూరు (చైతన్యరథం): ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన పథకం కింద దీర్ఘకాలిక లక్ష్యంతో ఆపరేషన్ గ్రీన్స్‌లో భాగంగా సముద్ర రంగంలో రొయ్యలకు సంబంధించి రూ. 158 కోట్ల అంచనా వ్యయంతో 2 ప్రాజెక్టులను నవంబర్ 2022లో కేంద్రం ఆమోదించిందని, నెల్లూరు జిల్లాలో ఆ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి ఏమిటని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం లోక్‌సభలో ఆయన పలు అంశాలపై ఆరా తీశారు. ఆమోదించిన ప్రాజెక్టుల్లో ఒకటి పూర్తయిందనేది వాస్తవమేనా, అలా అయితే రెండవ ప్రాజెక్టు స్థితిగతులేమిటని, ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో తెలియజేయాలన్నారు.



ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ఆపరేషన్ గ్రీన్స్ స్కీమ్ – ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన కింద దీర్ఘకాలిక లక్ష్యాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు సముద్ర రంగంలో రొయ్యలకు సంబంధించిన రెండు ప్రాజెక్టులను మంత్రిత్వ శాఖ ఆమోదించిందని చెప్పారు. ఇందులో ఆల్ఫా మెరైన్ లిమిటెడ్ అనే ఒక ప్రాజెక్ట్ పూర్తయిందని, మరొక ప్రాజెక్ట్ ఫాల్కన్ మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ 12.12.2024న రద్దు చేశారన్నారు. ప్రాజెక్ట్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆమోద పత్రం ప్రకారం ప్రాజెక్టును అమలు చేయడంలో విఫలమైన కారణంగా ప్రాజెక్టు రద్దయిందని మంత్రి వివరించారు.



# అభివృద్ధే అజెండా

◆శంకుస్థాపన చేశానంటే పని పూర్తికావలసిందే..

◆రాజకీయ కక్ష సాధింపు చర్యలు ఉండవు

◆నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్పష్టీకరణ

నెల్లూరు (చైతన్యరథం): అభివృద్ధే తన అజెండా అని, కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశానంటే పని పూర్తికావలసిందేనని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 1 కోటి 20 లక్షల రూపాయలతో సౌత్‌మోపూరు గ్రామంలో అభివృద్ధి పనులకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 7 నెలల్లోనే సౌత్ మోపూరు గ్రామానికి 2 కోట్ల 55 లక్షల రూపాయలు నిధులను అభివృద్ధి పనులకు కేటాయించామని తెలిపారు. రాజకీయ చైతన్యానికి మారుపేరు సౌత్ మోపూరు గ్రామమన్నారు. గత 3 ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా, నన్ను ఆదరించి భారీ మెజారిటీలు ఇచ్చిన గ్రామాల్లో సౌత్ మోపూరు గ్రామం ఒకటని పేర్కొన్నారు.

ఎన్నికవేళ మాత్రమే పార్టీ జెండాలు, అజెండాలు అని, రాజకీయ కక్ష సాధింపు చర్యలు ఉండవని స్పష్టం చేశారు. నా తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రతి ఇంటికి వస్తున్నాడని ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. నన్ను మించి నా తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల మనస్సును గెలుచుకుంటాడని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ తెలిపారు.

# వ్యాపారులకు అండగా ఉంటా

◆ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల భరోసా

ఒంగోలు (చైతన్యరథం): వ్యాపారులకు ఏ సమస్య రాకుండా అండగా ఉంటానని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు భరోసా ఇచ్చారు. ఒంగోలు నగరంలోని దామోదరం సంజీవయ్య కూరగాయల మార్కెట్ (కొత్త మార్కెట్) యార్డు, పరిసర ప్రాంతాలను గురువారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ షాపులు తీసుకొన్నవారిలో చాలా మంది గత ఐదేళ్లుగా మున్సిపల్ కార్పొరేషన్‌కి బకాయిలు చెల్లించలేదన్నారు. ౧, త్వరగా అందరూ బకాయిలు చెల్లించి మీకు ఇచ్చిన షాపుల్లో మాత్రమే వ్యాపారం చేసుకోవాలని సూచించారు. ఈ మార్కెట్ పరిసరాలలో ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కమిషనర్ వెంకటేశ్వరరావు, నగర పార్టీ అధ్యక్షులు కొఠారి నాగేశ్వరావు, కార్పొరేటర్ శైలజ, బండారు మదన్, గుంటూరు రాంబాబు, మున్సిపల్ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.



# ధర్మవరంలో భూ సమస్యలు పరిష్కరించాలి

- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి
- తుంపర్తి రైతులకు న్యాయం చేయాలి
- కలెక్టర్‌కు నివేదిక సిద్ధం చేయాలని మంత్రి అనగాని ఆదేశం



ధర్మవరం (చైతన్యరథం): ధర్మవరం నియోజకవర్గంలోని భూ సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు. గురువారం విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి సత్యప్రసాద్‌ను పరిటాల శ్రీరామ్ కలసి పలు సమస్యలను విన్నవించారు. తుంపర్తి భూ సమస్యలను మంత్రికి వివరించారు. ధర్మవరం రూరల్ మండల పరిధిలో గృహనిర్మాణాల కోసం సేకరించిన వ్యవసాయ పొలాలకు పరిహారం అందక గత ఆరేళ్లుగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని శ్రీరామ్ తెలిపారు. తుంపర్తిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన 90 మంది నిరుపేద కుటుంబాల నుంచి 2017 నవంబర్ 12న గృహ నిర్మాణాల కోసం 210 ఎకరాల భూమిని పోతులనాగేపల్లి రెవెన్యూ పరిధిలో సేకరించారన్నారు. ఒక ఎకరా పొలం 2 కోట్లు విలువ ఉన్న భూములకు, ఒక ఎకరాకు 5 లక్షల పరిహారం చెల్లిస్తామని చెప్పగా కొంతమంది రైతులు మాత్రం పరిహారం తీసుకున్నారని, మెజారిటీ శాతం రైతులు ఒప్పుకోకపోవడంతో ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా అడ్డుకున్న రైతులపై పోలీస్ కేసులు బనాయించారని తెలిపారు. ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించగా రైతులకు న్యాయం చేయమని ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని వివరించారు. అప్పటి నుంచి గత ప్రభుత్వం హయాంలో కూడా రైతులు స్థానిక తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్, సెక్రటేరియట్ చుట్టూ తిరిగినా వారికి న్యాయం జరగలేదన్నారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి ఆ ప్రాంతానికి వచ్చిన సమయంలో ఆయన వాహనశ్రేణికి ఎదురుగా వెళ్లి రైతులు తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పే ప్రయత్నం చేశారు. కానీ అప్పుడు పోలీసులు వారిని రోడ్డుపైనుంచి అన్యాయంగా లాగేసారన్నారు. దీనిని మనసులో పెట్టుకున్న అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి రైతులు పెట్టుకున్న దరఖాస్తు మెమో నెంబర్‌ను రద్దు చేయించారని వివరించారు. అప్పట్లో బాధిత రైతులకు పూర్తిస్థాయిలో హామీ ఇచ్చామని... చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత మీ సమస్యకు పరిష్కారం చూపిస్తామని భరోసా కల్పించమన్నారు. ఇది నమ్మి రైతులు అక్కడ బిజెపి అభ్యర్థి సత్య కుమార్ గెలుపు కోసం ఎంతో కష్టపడి పని చేశారన్నారు. ప్రస్తుతం ఆ రైతులు తమకు పూర్తిస్థాయి పరిహారం ఇస్తారని ఆశలు పెట్టుకున్నారని.. ఇప్పటికే ఈ విషయాన్ని మీ దృష్టికి తీసుకొచ్చామని పరిటాల శ్రీరామ్ అన్నారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి అనగాని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్‌కు ఫోన్ చేశారు. తుంపర్తి గ్రామ రైతులకు న్యాయం జరిగే విధంగా.. పరిహారం ఎంత ఇవ్వాలన్నదానిపై ఆరా తీశారు. దీనిపై మొత్తం నివేదిక సిద్ధం చేయాలన్నారు. తుంపర్తి బాధిత రైతులకు న్యాయం చేస్తామని మంత్రి అనగాని శ్రీరామ్‌కు హామీ ఇచ్చారు.



# సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం

- రూరల్ మండల నాయకులతో ఎమ్మెల్యే పరిటాల సునీత
- ఇళ్లు లేని వారి వివరాలు సేకరించాలని సూచన
- హౌసింగ్, రెవెన్యూ అధికారుతో మాట్లాడిన ఎమ్మెల్యే

అనంతపురం (చైతన్యరథం): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికే తొలి ప్రధాన్యత అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో గ్రామాల్లో ఉన్న సమస్యల గురించి ప్రస్తావించారు. గ్రామాలవారిగా ఎలాంటి సమస్యలు ఉన్నాయన్నది ఆరా తీశారు. ఇందులో ప్రధానంగా ఇంటి పట్టాల విషయంపై చర్చించారు. గతంలో అనంతపురం రూరల్ పరిధిలో కొన్ని లేఔట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. అయితే వాటిలో ఒక్కటి కూడా పూర్తి కాలేదన్నారు. స్థానికులకు ఇళ్ల పట్టాలు దక్కలేదన్నారు. చాలా మందికి అవసరం లేకపోయినా పట్టాలు ఇచ్చారని, అవి నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సునీత హౌసింగ్, రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. ఇప్పటికే అలాంటి వాటి జాబితా సిద్ధం చేశామని.. దీనిపై ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు తెలిపారు. గ్రామాల్లో ఇళ్లు లేని వారి జాబితాను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పారు.

# కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచండి

- ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు
- 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి
- పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆదేశం

పుట్టపర్తి (చైతన్యరథం): కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న విద్యారంగ సమస్యలపై విద్యాశాఖ అధికారులతో గురువారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సమీక్ష నిర్వహించారు. సమీక్షకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి, ఆర్డీఓ సువర్ణ, డీఈవో కిష్టయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ పేద కుటుంబాలకు చెందినవారేనని, వారికి కార్పొరేట్ తరహాలో నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత మన ప్రభుత్వ ఉపాధ్యాయులపై ఉందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతోందని, అందుకు తగ్గట్లుగా విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న కంప్యూటర్లు ,ఫర్నిచర్ తోపాటు విద్యార్థుల రికార్డులను భద్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎంఈఓ లకు , ప్రభుత్వం ప్రధాన ఉపాధ్యాయులకు ఉందనీ ఎమ్మెల్యే తెలిపారు. ఆయా ప్రభుత్వ పాఠశాలలో




ఉన్న విద్యార్థుల రికార్డులతో పాటు ఉపాధ్యాయులకు ,విద్యార్థులకు సంబంధించిన మెటీరియల్స్ ,ఇతర ప్రభుత్వ సామాగ్రిని అత్యంత భద్రంగా ఉండే విధంగా నైట్ వాచ్మెన్లను నియమించుకోనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలా లేని చోట వెంటనే వారిని భర్తీ చేయాలని మండల విద్యాశాఖ అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడు జరిగే పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. నియోజకవర్గంలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించే విధంగా అందుకు తగిన సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అంతేకాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో గదుల కొరత , మరుగుదొడ్ల సమస్య, తాగునీటి సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కింద చాలా ప్రభుత్వ పాఠశాలల్లో గదుల నిర్మాణ పనులు , భవనాల నిర్మాణ పనులు జరిగాయని కొన్నిచోట్ల నిధుల సమస్యతో అర్థాంతరంగా పనులు ఆగిపోయాయని కొంతమంది ఎంఈవోలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై తనకు నివేదికలు ఇస్తే మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో చాలాచోట్ల ఎం ఆర్ సి భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటికి మరమ్మతులు లేదా నూతన భవనాలు నిర్మించే విధంగా ప్రభుత్వం ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వారికి హామీ ఇచ్చారు. అదేవిధంగా నియోజకవర్గంలో ఎక్కడ డ్రాప్ ఔట్స్ ఉండకూడదని అందుకు విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులకు విద్య ప్రాధాన్యతపై అవగాహన కల్పించి విద్యార్థులను సక్రమంగా బడికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు . గత వైసిపి పాలనలో బకాయి పడిన విద్యార్థుల పెండింగ్ బిల్లులను మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో రూ.718 కోట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం విడుదల చేసినట్లు గుర్తు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన ప్రభుత్వ పాఠశాలలోనే ఎక్కువ లభిస్తుందని అర్హత ఉన్న ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలోనే ఉంటారనే విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యా శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్పొరేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ బడులే మిన్న అనే విధంగా పుట్టపర్తి నియోజకవర్గంలో విద్యాశాఖ పనిచేయాలని సూచించారు. సమీక్షలో నియోజకవర్గానికి సంబంధించిన 6 మండలాల విద్యాశాఖ అధికారులు గోపాల్ నాయక్ ,మోహన్ బాబు ,జయచంద్ర ,రెడ్డప్ప, ప్రసాద్ , ఖాదరవలి ,రమణ ,సురేష్ ,జిలాన్ భాష తదితరులు పాల్గొన్నారు.



# 50 కుటుంబాలు టీడీపీలో చేరిక

మంత్రాలయం (చైతన్యరథం): మంత్రాలయం నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు మెచ్చి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. మంత్రాలయంలో 50 కుటుంబాలకు చెందిన వైకాపా నాయకులు టీడీపీ నాయకుడు ఎన్.రాఘవేంద్రరెడ్డి సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అశోక్‌రెడ్డి, వరదరాజు, రఘు, డీసీసీ తిమ్మప్ప, శివ డేవిడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా మధ్వ నవమి వేడుకలు

మంత్రాలయం (చైతన్యరథం): కర్నూలు జిల్లా మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామి మఠంలో పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మఠం అర్చకులు, అధికారులు మధ్వ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. గురువారం మధ్వనవమి పురస్కరించుకొని వెండి సింహాసనంపై మధ్వాచార్యుల బంగారు ప్రతిమను ఉంచి విశేష పూజలు నిర్వహించారు. పీఠాధిపతి భక్తులకు అనుగ్రహ సందేశం ఇచ్చారు. అనంతరం బంగారు రథంపై మధ్వాచార్యుల బంగారు ప్రతిమను, చిత్రపటాన్ని ఉంచి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బంగారు పల్లకిలో బృందావన ప్రతిమను ఉంచి పూజలు చేశారు. శ్రీమఠం ప్రాకారంలో మంగళవాయిద్యాలు, కోలాటాలు, భజనలు వేదమంత్రాల మధ్య మధ్వనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శ్రీ మఠం ప్రకారం చుట్టు బంగారు రథోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు ఫలమంత్ర అక్షింతలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మఠం పండితులు సహాయ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, వ్యాసరాజ ఆచార్, వేద పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.



# అక్రమ వలసదారుల తరలింపు కొత్తేమీ కాదు

◆విదేశాంగ శాఖ మంత్రి

ఎస్ జైశంకర్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: అమెరికా నుంచి అక్రమ వలసదారుల తరలింపు ప్రక్రియ కొత్తదేమీ కాదని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. తాజాగా బుధవారం అమెరికా 104 మంది భారతీయులను స్వదేశానికి పంపించడంపై ఈ మేరకు కేంద్రమంత్రి గురువారం రాజ్యసభలో ప్రకటన చేశారు. వలసదారులకు సంకెళ్లు వేసి పంపిస్తున్నారని విపక్షాలు చేస్తున్న విమర్శలపై స్పందిస్తూ.. తరలింపు సమయంలో వలసదారుల పట్ల దురుసుగా వ్యవహరించకుండా చూసేందుకు అమెరికాతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు.

"అమెరికాలో ఏళ్ల నుంచి అక్రమ వలసదారుల తరలింపు ప్రక్రియ జరుగుతూనే ఉంది. ఇది ఏ ఒక్క దేశానికి సంబంధించిన విధానం కాదు. అన్ని దేశాల అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపిస్తోంది. 2012లో ఈ సంఖ్య 530గా ఉండగా.. 2019లో 2వేలకు పైగా ఉంది. అక్రమ వలసలను అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలి. తమ దేశస్థులు విదేశాల్లో చట్టవిరుద్ధంగా ఉంటే వారిని స్వదేశాలకు రప్పించడం ఆయా దేశాల బాధ్యత" అని జైశంకర్ వివరించారు.

**వారిని బంధించలేదు..**

"అమెరికా నుంచి అక్రమ వలసదారులను స్వదేశాలకు పంపించే ప్రక్రియను ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చూసుకుంటుంది. వలసదారులను ఎయిర్ క్రాఫ్ట్‌లో తరలించే విధానాన్ని 2012 నుంచి అమలు చేస్తుండగా.. నిబంధనల ప్రకారం వారిని నిర్బంధిస్తారు. టాయిలెట్‌కు వెళ్లే సమయంలో అవసరమైతే వాటిని తొలగిస్తారు. సైనిక ఎయిర్ క్రాఫ్ట్, చార్టర్డ్ విమానాలకూ ఇది వర్తిస్తుంది. ఇందులో ఎటువంటి మార్పు లేదు. అయితే, మహిళలు, చిన్నారులను నిర్బంధించలేదని ఐసీఈ అధికారులు మాకు సమాచారం ఇచ్చారు" అని ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. ప్రయాణ సమయంలో వారికి అవసరమైన ఆహారం, అత్యవసర వైద్య సదుపాయాలు సమకూర్చినట్లు తెలిపారు.

**విపక్షాల నిరసనలు**

భారతీయులను అమెరికా వెనక్కి పంపించిన విధానాన్ని లేవనెత్తిన విపక్షాలు పార్లమెంటులో నిరసనలు చేపట్టాయి. దీనిపై చర్చ జరపాలని డిమాండ్ చేశాయి. అమెరికా ప్రభుత్వ యంత్రాంగంతో తీసుకుంటున్న దౌత్యచర్యల గురించి వివరించాలని కోరాయి. దీనిపై లోక్‌సభ స్పీకర్ స్పందిస్తూ.. ఈ అంశం విదేశాంగ మంత్రిత్వ శాఖకు సంబంధించినదని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దృష్టిసారించిందన్నారు. ఇలా ఉభయ సభలకు అంతరాయం కలుగుతోన్న క్రమంలోనే రాజ్యసభలో కేంద్ర మంత్రి దీనిపై ప్రకటన చేశారు.

# 2027లో చంద్రయాన్-4 ప్రయోగం

◆వచ్చే ఏడాది గగన్ యాన్

◆సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి

జితేంద్ర సింగ్ వెల్లడి



న్యూఢిల్లీ: భారత్ చంద్రయాన్-4 సన్నాహాలు చేస్తోందని, 2027లో చంద్రయాన్ మిషన్‌ను ప్రయోగిస్తామని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. ఈ మిషన్‌లో చంద్రుడి నమూనాలను భూమిపైకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ మిషన్‌లో ఎల్వీఎం 3 రాకెట్ వేర్వేరు ప్రయోగాల తర్వాత.. ఐదు వేర్వేరు భాగాలను మూసుకువెళ్లి స్పేస్‌లో అనుసంధానించనున్నట్లు తెలిపారు. వీటిని భూమి కక్ష్యలో ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. చంద్రుడి ఉపరితల నమూనాలను సేకరించి.. తిరిగి భూమికి చేరుకోవడమే చంద్రయాన్-4 మిషన్ లక్ష్యమని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. గగన్‌యాన్ మిషన్ వచ్చే ఏడాది ప్రయోగించనున్నట్లు తెలిపారు. భారతీయ వ్యోమగాములను ప్రత్యేకం వాహనంలో భూమి దిగువ కక్ష్య వరకు పంపి.. తిరిగి సురక్షితంగా భూమిపైకి తీసుకురానున్నట్లు చెప్పారు.

2026లో భారత్ సముద్రయాన్ ప్రయోగం చేపడుతుందని ప్రకటించారు. ఇందులో ముగ్గురు శాస్త్రవేత్తలు జలాంతర్గామి ద్వారా ఆరువేల కిలోమీటర్ల లోతుకు వెళ్లి సముద్ర గర్భంలో అన్వేషణ సాగిస్తారని జితేంద్రసింగ్ పేర్కొన్నారు. గగన్‌యాన్ మిషన్‌తో సహా భారత్ పలు చారిత్రాత్మక మిషన్లకు రూపకల్పన చేస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో సముద్రయాన్ అంశంపై ప్రసంగించిన విషయం తెలిసిందే. జితేంద్ర సింగ్ మాట్లాడుతూ సముద్రయాన్ ద్వారా కీలకమైన ఖనిజాలు, అరుదైన లోహాలు, తెలియని సముద్రజీవ వైవిధ్యం గురించి సమాచారాన్ని సేకరిస్తామన్నారు. గగన్‌యాన్ ప్రాజెక్టు మానవరహిత మిషన్‌ను సైతం అదే ఏడాది నిర్వహిస్తామన్నారు. ఇందులో రోబోట్ వ్యోమ్ మిత్రను సైతం పంపనున్నట్లు పేర్కొన్నారు.

**స్పేస్ సెక్టార్‌లో సూపర్ పవర్ భారత్**

1969లో ఇస్రోను స్థాపించినట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. కానీ, తొలి లాంచ్ ప్యాడ్ స్థాపించేందుకు రెండు దశాబ్దాలకు పైగా 1993 సమయం పట్టిందన్నారు. రెండో లాంచ్ ప్యాడ్‌ను 2004లో నిర్మించారని, అందుకు మరో దశాబ్దం పట్టిందన్నారు. గత పదేళ్లకాలంలో భారత అంతరిక్ష రంగం మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు విస్తరించినట్లు పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం భారీ రాకెట్లను నింగిలోకి పంపేందుకు వీలుగా మూడో లాంచ్ పాడ్ను శ్రీహరికోటలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. చిన్న ఉపగ్రహాల కోసం తమిళనాడులోని టుటికోరిన్ జిల్లాలో కొత్త ప్రయోగ వేదిక కేంద్రాన్ని ఏర్పాటు చేసి.. శ్రీహరికోట స్పేస్ సెంటర్‌ను విస్తరిస్తున్నట్లు తెలిపారు. భారతదేశ స్పేస్ ఎకానమీ ప్రస్తుతం 8 బిలియన్ డాలర్ల విలువ ఉందని.. వచ్చే దశాబ్దం నాటికి 44 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని తెలిపారు. ఇది ప్రపంచంలో భారత్ అంతరిక్ష రంగంలో ఓ సూపర్ పవర్ గా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు.



# ఈసారి సరికొత్తగా పరీక్షా పే చర్చ

◆ప్రధానితో పాటు పలువురు ప్రముఖులు

న్యూఢిల్లీ: పరీక్షల సమయంలో విద్యార్థుల్లో ఒత్తిడి తొలగించడానికి ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన కార్యక్రమమే 'పరీక్షా పే చర్చ'. త్వరలో పరీక్షలు జరగనుండటంతో ఈసారి సరికొత్తగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని మోడీ నిర్ణయం తీసుకున్నారు.

పరీక్షలు అనగానే చాలా మంది పిల్లలు భయపడిపోతారు. ఏడాది మొత్తం చదివినా ఎగ్జామ్స్ అనగానే వణికిపోతారు. పరీక్షలు రాయాలంటే టెన్షన్ పడతారు. అన్ని నెలలు కష్టపడి చదవినా ఒత్తిడి, ఆందోళన, భయం కారణంగా సరిగ్గా రాయలేరు. ఆ తర్వాత మార్కులు తగ్గితే మరింత నిరుత్సాహానికి గురవుతారు. విద్యార్థుల్లోని ఈ భయాన్ని తొలగించి.. పరీక్షలు అంటే ఓ పండుగ, దాన్నో వేడుకలా చూడాలి అంటూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు ప్రధాని నరేంద్ర మోడీ. ప్రతి ఏటా పిల్లల కోసం 'పరీక్షా పే చర్చ' అనే కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. సక్సెస్‌ఫుల్‌గా 7 ఎడిషన్స్ పూర్తి చేసుకున్న ఈ ప్రోగ్రామ్.. నయా ఎడిషన్‌కు అంతా సిద్ధమవుతోంది. ఈ తరుణంలో మోడీ వినూత్న ఆలోచన చేశారు.

**ఈసారి ప్రముఖులకూ అవకాశం..**

విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను మిళితం చేస్తూ 'పరీక్షా పే చర్చ' నిర్వహిస్తున్నారు. అయితే ఇన్నాళ్లూ ఈ కార్యక్రమంలో ఆయన ఒక్కరే పాల్గొంటూ వచ్చారు. కానీ ఈసారి కొత్తగా బాలీవుడ్ స్టార్లు దీపికా పదుకోణ్, విక్రాంత్ మాస్సేతో పాటు ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్‌ను 'పరీక్షా పే చర్చ'కు ఆహ్వానించారు.

బాలీవుడ్ హీరోయిన్ భూమి పెడ్నేకర్, దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్ కూడా 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో పాల్గొననున్నారు. వీరితో పాటు అవనీ లేఖరా, రుజుతా దివేకర్, సోనాలీ సబర్వాల్, రేవంత్ హిమంత్‌సింగ్కా, గౌరవ్ చౌదరి, రాధికా గుప్తా లాంటి ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు కూడా హాజరు కానున్నారు. ఈనెల 10వ తేదీన జరిగే ఈ ప్రోగ్రామ్‌లో నేరుగా కొంతమంది విద్యార్థులు పాల్గొంటారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వేలాది మంది ప్రధానితో కనెక్ట్ అవుతారు. వాళ్లు అడిగే ప్రశ్నలకు మోడీ సమాధానం చెబుతారు. ఈసారి చాలా మంది సెలబ్రిటీలు పాల్గొంటుండటంతో విద్యార్థుల ప్రశ్నలకు వాళ్లు కూడా సమాధానాలు ఇవ్వడంతో పాటు జీవితంలో తాము ఎదుర్కొన్న అనుభవాలు, నేర్చుకున్న పాఠాలు పంచుకుంటారని సమాచారం.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

# నలుగురు మావోల మృతి

ఛత్తీస్‌గఢ్ : వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని ఎదురుదెబ్బ తగులుతోంది. గురువారం ఛత్తీస్‌గడ్‌లోని నారాయణపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలకు, మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. పలువురు గాయపడినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం నుంచి మాఢ్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కాగా.. భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా భారీఎత్తున వరుసగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నారు. గత ఐదురోజుల క్రితం బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసు వర్గాలు ధృవీకరించాయి. ఆపరేషన్ కగార్ పేరుతో చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న దండకారణ్యం మొత్తాన్ని భారీగా భద్రతా బలగాలు నలువైపులా చుట్టుముట్టి వరుసగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నారు. జనవరి 16న బీజాపూర్ జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోగా.. అగ్రనేతలు తప్పించుకున్నట్లు బస్తర్ ఐజి పి.సుందర్‌లాల్ తెలిపారు.

## కూలిన మిరాజ్ యుద్ధ విమానం

◆ఇద్దరు పైలట్లు సురక్షితం

భారత వైమానిక దళానికి చెందిన ట్విన్ సీటర్ మిరాజ్ 2000 ఫైటర్ జెట్ గురువారం శివపురి సమీపంలో కూలిపోయింది. శిక్షణలో భాగంగా గాల్లోకి ఎగిరిన విమానం ప్రమాదవశాత్తూ బహ్రేటా సాని గ్రామ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో కుప్పకూలింది. ఫైటర్ జెట్ కూలిన వెంటనే పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. అయితే, అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. అందులో ఉన్న ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. గాయపడ్డ పైలట్లను ఆసుపత్రికి తరలించారు.

ఢిల్లీ విమానాశ్రయంలో

## 10 కిలోల బంగారం పట్టివేత

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన ఇద్దరు ప్రయాణికుల వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న 10 కిలోల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిఘా వర్గాల సమాచారం మేరకు గురువారం ఇటలీలోని మిలాన్ నుంచి ఢిల్లీ వచ్చిన విమానంలోని ప్రయాణికులను అధికారులు తనిఖీ చేశారు. ఈక్రమంలో ఇద్దరి ప్రవర్తన అనుమానాస్పదంగా కన్పించడంతో వారి బ్యాగేజీలను స్కాన్ చేశారు. అందులో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కన్పించలేదు. దీంతో ఆ ప్రయాణికులను తనిఖీ చేయగా.. ప్రత్యేకంగా డిజైన్ చేసిన బెల్ట్‌లను గుర్తించారు. వాటిని పరిశీలించగా ఇద్దరి వద్దా 5 కిలోల చొప్పున వందల కొద్దీ బంగారు నాణేలు బయటపడ్డాయి. ఎలాంటి పత్రాలు లేని ఈ బంగారాన్ని అక్రమంగా దేశంలోకి తీసుకొస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తంగా 10.092 కిలోల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.7.8 కోట్ల పైనే ఉంటుందని అంచనా వేస్తున్నారు. నిందితులిద్దరూ కశ్మీర్‌కు చెందినవారుగా గుర్తించారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం వారిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

# డబ్ల్యుహెచ్ఓ నుండి వైదొలగిన అర్జెంటీనా

◆కొవిడ్-19 వైరస్‌ను పసికట్టడంలో విఫలంపై

విమర్శలు ఎదుర్కొంటున్న డబ్ల్యుహెచ్ఓ

ప్రపంచ ఆరోగ్య సంస్థ పనితీరుపై ప్రపంచ దేశాలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయి. ముఖ్యంగా ప్రపంచాన్ని గడగడలాడించిన కొవిడ్-19 సమయంలో డబ్ల్యుహెచ్ఓ సరైన రీతిలో వ్యవహరించలేదన్న విమర్శలు ఉన్నాయి. చైనాలోని వూహాన్ నుంచి వ్యాపించిన ఆ వైరస్‌ను పసికట్టడంలో ఆ సంస్థ విఫలమైందని ప్రపంచ దేశాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డబ్ల్యుహెచ్ఓ నుంచి వైదొలుగుతున్నాయి. అగ్రరాజ్యం అమెరికా ఇప్పటికే తన నిర్ణయాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా మరోదేశం ఆ జాబితాలోకి చేరింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలుగుతున్నట్లు అర్జెంటీనా తాజాగా ప్రకటించింది. కొవిడ్ మహమ్మారిని కట్టడి చేయడంలో విఫలం, ఇతర కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు అర్జెంటీనా అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. అధ్యక్ష ప్రతినిధి మాన్యుయెల్ అడోర్నీ ఓ సమావేశంలో




ప్రసంగిస్తూ ఈ మేరకు ప్రకటన చేశారు. అర్జెంటీనా ఏ అంతర్జాతీయ సంస్థను తన సార్వభౌమాధికారంలో జోక్యం చేసుకోవడానికి అనుమతించబోదని స్పష్టం చేశారు. డబ్ల్యుహెచ్ఓ స్వతంత్రంగా పని చేయడం లేదని, దాని నిర్ణయాలు బాహ్య ఒత్తిడికి లోబడి ఉంటాయని ఆరోపించారు. మానవ చరిత్రలోనే అత్యంత ప్రమాదకరమైన కొవిడ్ సమయంలో డబ్ల్యుహెచ్ఓ సరిగా పని చేయలేదని తెలిపారు.

కాగా, అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన వెంటనే డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి తప్పుకుంటున్నట్లు ఆదేశాలు ఇచ్చారు. వాస్తవానికి ప్రపంచ ఆరోగ్య సంస్థకు అమెరికా అవసరం చాలా ఉందని, కానీ ఏం జరుగుతుందో చూద్దామని ట్రంప్ అన్నారు. ఒకవేళ వీలైతే మళ్లీ డబ్ల్యుహెచ్ఓలో కలిసే అవకాశాలు ఉన్నట్లు కూడా ఆయన చెప్పారు. కొవిడ్-19ను నియంత్రించడంలో డబ్ల్యుహెచ్ఓ విఫలమైందని, చైనాలోని వుహాన్ నుంచి వ్యాపించిన ఆ వైరస్‌ను పసికట్టడంలో ఆ సంస్థ విఫలమైందని, అవసరమైన సంస్కరణలను చేపట్టలేక పోయిందని, సభ్య దేశాల నుంచి రాజకీయ ఐకమత్యాన్ని తీసుకురావడంలో అసమర్థంగా వ్యవహరించినట్లు ట్రంప్ ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ మేరకు జెనీవాకు చెందిన ఆ సంస్థ సభ్యత్వం నుంచి వైదొలుగుతున్నట్లు వెల్లడించారు.

## గాజా స్వాధీనంలో తప్పేముంది

◆ట్రంప్‌నకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మద్దతు

పాలస్తీనీయుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనపై అంతర్జాతీయంగా విమర్శలు తలెత్తాయి. దీనిపై తాజాగా స్పందించిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ట్రంప్‌నకు మద్దతు పలికారు. ఆయన చేసిన ప్రతిపాదనలో తప్పేమీ లేదన్నారు.



ఇజ్రాయెల్ భీకర దాడుల కారణంగా గాజా శిథిలాల కుప్పగా మారింది. అయినవారిని కోల్పోయి ఎంతోమంది పౌరులు నిరాశ్రయులుగా మారారు. అయితే ఈ అంశంపై ఇటీవల ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. తాము గాజాను స్వాధీనం చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు. పాలస్తీనీయులను తరలించి ఆ ప్రాంతాన్ని తాము హస్తగతం చేసుకోవాలని అనుకుంటున్నట్లు వెల్లడించారు. ధ్వంసమైన భవనాలను పునరుద్ధరించి.. ఆ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తామన్నారు. అక్కడి ప్రజలకు అపరిమిత సంఖ్యలో ఉద్యోగాలు కల్పించవచ్చు, ఇళ్లు నిర్మించవచ్చని ట్రంప్ పేర్కొన్నారు. అయితే గాజాను స్వాధీనం చేసుకోవాలనే ప్రతిపాదనపై అంతర్జాతీయంగా విమర్శలు గుప్పుమన్నాయి. దీనిపై నెతన్యాహు మాట్లాడుతూ.. "ట్రంప్ ఆలోచనలో తప్పేమీ లేదు. ఒకవేళ గాజా వాసులు ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లిపోవాలని నిర్ణయించుకుంటే అలాగే చేయవచ్చు. లేదా అక్కడే ఉండాలని అనుకుంటే ఉండొచ్చు. ఏదేమైనా గాజాను పునర్నిర్మించాలి" అని ఓ అంతర్జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు.

"హమాస్‌కు వ్యతిరేకంగా పోరాడేందుకు అమెరికా దళాలను గాజాకు పంపడం, ఆ ప్రాంత పునరుద్ధరణకు ఆర్థిక సహాయం చేస్తానని చెప్పడాన్ని నేను నమ్మలేకపోయా" అని నెతన్యాహు అన్నారు. గాజాలో ఉద్రిక్తతల కారణంగా నిరాశ్రయులుగా మారిన పాలస్తీనీయులకు అరబ్ దేశాలు ఆశ్రయం కల్పించాలని ఇటీవల ట్రంప్ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ప్రతిపాదనను ఆయా దేశాలు ఖండించాయి.

## చైనా డీప్ సీక్‌పై దక్షిణ కొరియా నిషేధం

ఏఐ రంగంలో తాజా సంచలనం చైనాకు చెందిన డీప్ సీక్ ఒకవైపు దూసుకెళుతుండగా మరోవైపు దీనిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీని వాడకంపై ఇప్పటికే పలు దేశాలు నిషేధం విధించగా.. తాజాగా దక్షిణ కొరియా సైతం ఆ జాబితాలో చేరింది. ఆ దేశ రక్షణ, వాణిజ్య కంప్యూటర్లలో డీప్ సీక్‌పై వాడకాన్ని నిషేధిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 'డీప్ సీక్ వినియోగంపై పలు దేశాల నుంచి వస్తున్న ఆందోళనల నేపథ్యంలోనే దానిని నిషేధించాలని నిర్ణయించుకున్నాం. ఇంటెలిజెన్స్ అధికారులు దీని వినియోగంలో జాగ్రత్తలు




వహించాలి. యూజర్లకు చెందిన వ్యక్తిగత సమాచార సేకరణ వ్యవస్థకు సంబంధించిన వివరాలు అస్పష్టంగా ఉన్నాయి' అని రక్షణ, వాణిజ్య మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా తెలిపాయి. ఆ దేశ పర్యావరణ మంత్రిత్వశాఖ కూడా ఇదే హెచ్చరికలు జారీ చేసినట్లు తెలుస్తోంది.తొలుత కెనడాకు చెందిన ఫీరూట్ సెక్యూరిటీ సంస్థ దీనిని గుర్తించి అసోసియేట్ ప్రెస్ వార్తాసంస్థతో పంచుకుంది. ఈ వివరాలను స్వతంత్ర కంప్యూటర్ నిపుణులు ధ్రువీకరించారు. అయితే డేటా బదిలీ జరిగిందా? లేదా అన్నది మాత్రం ఈ సంస్థలు గుర్తించలేదు. ఈ ఆరోపణలపై అటు డీప్ సీక్ గానీ, చైనా మొబైల్ గానీ స్పందించలేదు. ఈ నేపథ్యంలో డీప్ సీక్ సేవలపై ఆస్ట్రేలియా, ఇటలీ, తైవాన్ దేశాలు ఇప్పటికే నిషేధం విధించాయి. ప్రభుత్వ కంప్యూటర్లు, డివైజుల వాడకంపై ఆస్ట్రేలియా నిషేధం విధించింది. వ్యక్తిగత డివైజులపై మాత్రం ఎలాంటి నిషేధం లేదు. డీప్ సీక్ వాడకంపై అప్రమత్తంగా ఉండాలని పౌరులకు అక్కడి ప్రభుత్వం సూచించింది. ప్రైవసీపై ఆందోళనలు పరిష్కరించడంలో డీప్ సీక్ విఫలం అయిన నేపథ్యంలో దేశంలో చాట్‌బాట్‌ను బ్లాక్ చేస్తున్నట్లు ఇటలీ డేటా ప్రొటెక్షన్ అథారిటీ వెల్లడించింది. ప్రభుత్వ సంస్థల్లో డీప్ సీక్ వినియోగాన్ని నిషేధిస్తూ తైవాన్ కూడా ఇదే తరహా ఆదేశాలు జారీ చేసింది.

## బంగ్లాదేశ్‌లో మళ్లీ హింసాత్మక ఘటనలు

◆ షేక్ ముజిబుర్ రెహమాన్

చారిత్రక నివాసానికి నిప్పు

బంగ్లాదేశ్‌లో తాజాగా మళ్లీ హింసాత్మక ఘటనలు చెలరేగాయి. బంగబంధుగా పేరొందిన షేక్ ముజిబుర్ రెహమాన్ చారిత్రక నివాసంపై దాడి జరిగింది. కొందరు నిరసనకారులు ఆయన నివాసంపై దాడి చేసి నిప్పంటించారు. అనూహ్యంగా పదవి కోల్పోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న షేక్ హసీనా సామాజిక మాధ్యమం వేదికగా ప్రసంగిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

ఆమె ప్రసంగంలో మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేయాలని అవామీ లీగ్ పార్టీకి ఆమె పిలుపునిచ్చారు. ఈనేపథ్యంలోనే ఢాకాలో ఘటనలు చెలరేగినట్లు తెలుస్తోంది. ఇంటికి నిప్పు పెట్టడంపై సైతం ఆమె స్పందించారు. 'వారు ఒక భవనాన్ని కూల్చివేయగలరు. కానీ, చరిత్రను కాదు. దీనిని వారు గుర్తించుకోవాలి' అని పేర్కొన్నారు. ఈ ఇల్లు అధికారవాదం, ఫాసిజానికి చిహ్నమని నిరసనకారులు పేర్కొన్నారు. అంతేకాక.. 1972 నాటి రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



హసీనా తండ్రి ముజిబర్ రెహమాన్‌కు బంగబంధుగా పేరుంది. బంగ్లాదేశ్ విముక్తి పోరాటాన్ని భారత్ సాయంతో పూర్తిచేశారు. అనంతరం 1975లో ఆయన అధికార నివాసంలో ఉండగా సైన్యం దాడి చేసి ఆయనతో సహా ఇంట్లో వారిని చంపేసింది. రెహమాన్‌తో సహా ఆ కుటుంబంలో మొత్తం 18 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో హసీనా, ఆమె సోదరి రెహానా జర్మనీలో ఉండటంతో బతికిపోయారు. బంగ్లా చరిత్రలో ముజిబర్ నివాసం ఒక ఐకానిక్ చిహ్నంగా గుర్తింపు పొందింది. అవామీ లీగ్ పాలనలో దీనిని మ్యూజియంగా మార్చారు.

## ఉత్తరకొరియాకు కలిసొచ్చిన ఉక్రెయిన్ యుద్ధం

◆ఉక్రెయిన్‌ను ఓ ప్రయోగశాలగా

మార్చుకున్న కిమ్

ఉక్రెయిన్‌పై రష్యా దళాలు మిత్రదేశాల ఆయుధాలకు పదును పెట్టి మరీ ఎక్కుపెడుతున్నాయి. తాజాగా ఉత్తర కొరియాకు చెందిన క్షిపణులను ప్రయోగించింది. కానీ, ఇవి అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించడం చూసి సైనిక నిపుణులు ఆశ్చర్యపోతున్నారు. వాస్తవానికి 2023 నుంచే ప్యాంగ్యాంగ్ నుంచి దిగుమతి చేసుకొన్న ప్రొజెక్టైల్స్‌ను వినియోగిస్తోంది. కానీ, ఇటీవల కాలంలో కచ్చితత్వం ఆశ్చర్యకర స్థాయిలో మెరుగుపడిందని ఉక్రెయిన్ మిలటరీ అధికారులు పేర్కొన్నారు.

గత కొన్ని వారాల్లో దాదాపు 20 ఉ.కొరియా బాలిస్టిక్ క్షిపణులను రష్యా దళాలు ప్రయోగించాయి. అన్నీ 50-100 మీటర్ల లోపు తేడాతో ల్యాండ్ అయ్యాయి. తొలుత ఈ మార్పును గతేడాది డిసెంబర్‌లో గుర్తించారు. ఈ పరిణామాలు కేవలం మాస్కోకే కాదు.. ప్యాంగ్యాంగ్‌కు కూడా ప్రయోజనకరమని చెబుతున్నాయి.

కిమ్ సేనలు తమ క్షిపణుల సామర్థ్యాన్ని పరీక్షించుకొని.. మెరుగుపర్చుకోవడానికి ఉక్రెయిన్‌ను ఓ ప్రయోగశాలగా మార్చుకొన్నాయని నిపుణులు అనుమానిస్తున్నారు. దీనిపై సియోల్‌కు చెందిన ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాలసీ స్టడీస్‌కు చెందిన యాంగ్ యూకే మాట్లాడుతూ.. ఈ పరిణామాలు దక్షిణ కొరియా, జపాన్, అమెరికాకు ప్రధాన ముప్పుగా పరిణమిస్తాయన్నారు. "ఇది కొరియా ద్వీపకల్పం.. ప్రపంచ సుస్థిరతపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది" అని హెచ్చరించారు.

ఉత్తర కొరియా కొన్నాళ్లుగా శరవేగంగా క్షిపణులను అభివృద్ధి చేస్తోంది. ముఖ్యంగా ఇంటర్మీడియట్ రేంజి క్షిపణులకు అణు వార్‌హెడ్‌లను అమర్చగలమని ఇటీవల ప్రకటించింది. వాస్తవానికి ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాతో జట్టుకట్టక ముందు వరకు ప్యాంగ్‌యాంగ్ ఒంటరిగా ఉంది. పెద్దగా ఆయుధ పరీక్షలను



కూడా నిర్వహించలేక పోయింది. కానీ, రష్యా సౌజన్యంతో ఇప్పుడు క్షిపణుల కచ్చితత్వాన్ని గణనీయంగా మెరుగుపర్చుకొంది.

వోల్గా రీజియన్ లో రష్యా రహస్య పరీక్షలు

మాస్కో యారీ క్షిపణిని రాడార్ల నుంచి తప్పిస్తూ ప్రయోగించేలా సాధన చేస్తోంది. దీనికి వోల్గా రీజియన్‌ను అది ఎంచుకొన్నట్లు అల్ అరేబియా పత్రిక పేర్కొంది. మంచుతో కప్పేసిన అడవుల్లో వీటిని నిర్వహిస్తోంది. ఈ క్షిపణిని ట్రక్ పైనుంచి లేదా బొరియల్లో నుంచి ప్రయోగించే అవకాశం ఉంది.

## బందీలపై హమాస్ అకృత్యాలు

పౌరులను బందీలుగా చేసుకుని ఇజ్రాయెల్‌పై సుదీర్ఘకాలంగా పోరాడుతోంది హమాస్ గ్రూప్. తమ చెరలో ఉన్న వారిపై హమాస్ మిలిటెంట్లు పాల్పడిన దారుణాలకు సంబంధించిన కథనాలు అనేకం వెలుగులోకి వచ్చాయి. అయితే, తాజాగా మరో సంచలన విషయం బయటపడింది. తన సొంత సభ్యులనే హమాస్ హింసకు గురిచేసి, మరణదండన విధించినట్లు తెలుస్తోంది. అది కూడా బందీలపై అకృత్యాలకు పాల్పడ్డారన్న కారణం వల్లేనట..! ఇజ్రాయెల్ పురుషులపై లైంగిక దాడికి పాల్పడినట్లు గుర్తించిన కొందరు మిలిటెంట్లపై హమాస్ కఠిన చర్యలు తీసుకుందని తెలుస్తోంది. ఆ గ్రూప్ నుంచి బయటకు వచ్చిన రహస్య పత్రాల ద్వారా ఈ విషయం వెల్లడవుతోంది.

# భారత్ జోరు.. ఇంగ్లాండ్ బేజారు!



- తొలి వన్‌డేలో 4 వికెట్లతో టీమిండియా ఘన విజయం
- అర్ధశతకాలతో రాణించిన గిల్, అయ్యర్, అక్షర్
- 38.4 ఓవర్లలోనే 249 పరుగుల లక్ష్యసాధన
- బౌలింగ్‌లో మెరిసిన రాణా, జడేజా



ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమ్ ఇండియా వన్డే సిరీస్‌లోనూ బోణీ కొట్టింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నాగ్‌పూర్ వేదికగా గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. 4 వికెట్ల తేడాతో ప్రత్యర్థి ఇంగ్లీష్ జట్టును చిత్తు చిత్తుగా ఓడించింది. ఇంగ్గాండ్ నిర్దేశించిన 249 పరుగుల లక్ష్యాన్ని కేవలం 38.4 ఓవర్లలోనే ఛేదించి.. తొలి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (87: 96 బంతుల్లో 14 ఫోర్లు) చెలరేగి ఆడాడు. ఓ వైపు కండరాల నొప్పి వెంటాడుతున్నా.. అద్భుతమైన పోరాటం చేశాడు. అక్షర్ పటేల్ (52: 47 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్స్), శ్రేయస్ అయ్యర్ (59, 36 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకాలు సాధించారు. ఓపెనర్లు జైస్వాల్ (15), రోహిత్ శర్మ (2) మరోసారి నిరాశ పరిచారు. ఇంగ్లాండ్ బౌలర్లలో సోఫ్రా ఆర్చర్, మహమూద్, బెతెల్, రషీద్ తలో వికెట్ తీశారు.

### ఆదిలోనే ఎదురుదెబ్బ

249 పరుగుల సాధారణ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన భారత్‌ను ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. జోఫ్రా ఆర్చర్ వేసిన ఐదో ఓవర్లో ఓపెనర్ జైస్వాల్ (15) షాట్‌కు పయత్నించి.. కీపర్ సాల్ట్ చేతికి చిక్కాడు. ఆ తర్వాతి ఓవర్లోనే కెప్టెన్ రోహిత్ శర్మ (2).. లివింగ్టన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. అయితే తొలి డౌన్లో వచ్చిన శుభ్‌మన్‌గిల్ క్రీజులో నిలదొక్కుకున్నాడు. రెండో డౌన్లో వచ్చిన శ్రేయస్ అయ్యర్‌తో కలిసి ఇన్నింగ్స్ నిర్మించాడు. ఇద్దరూ కలిసి మూడో వికెట్ కు 113 పరుగులు చేశారు. ఈ క్రమంలో ఇద్దరూ అర్ధశతకాలు పూర్తి చేసుకున్నారు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని బెతెల్ విడగొట్టాడు. 16వ ఓవర్ చివరి బంతికి శ్రేయస్ వికెట్ల ముందు దొరికిపోయాడు. అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన అక్షర్ పటేల్ అదే జోరు కొనసాగించాడు. గిల్‌తో కలిసి ఇంగ్లండ్ బౌలింగును ఎడాపెడా బాదేశారు. విజయానికి మరో 28 పరుగుల దూరంలో ఉండగా.. రషీద్ బౌలింగ్లో అక్షర్ పటేల్ బౌల్డయి.. భారత అభిమానులను తీవ్రంగా నిరాశపరిచాడు. మిడిలార్డర్లో వచ్చిన రాహుల్ (2) రషీద్ బౌలింగ్లో కాట్ అండ్ బౌల్డ్ గా వెనుదిరిగాడు. స్వల్ప వ్యవధిలోనే మహమూద్ బౌలింగ్లో భారీ షాట్‌కు ప్రయత్నించిన గిల్.. బట్లర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాట పట్టాడు. అయితే, హార్దిక్ పాండ్య (9), రవీంద్ర జడేజా (12) బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడి లక్ష్యాన్ని పూర్తి చేశారు.

### ఇంగ్లాండ్ 248 ఆలౌట్

అంతకు ముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లీష్ జట్టు 47.4 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ బట్లర్ (52: 67 బంతుల్లో 4 ఫోర్లు), బెతెల్ (51: 64 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో ఆకట్టుకున్నారు. ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ (43: 26 బంతుల్లో 5-ఫోర్లు, 3-సిక్స్‌లు) మెరుపు వేగంతో ఇన్నింగ్స్ ప్రారంభించినప్పటికీ.. డకెట్‌తో సమన్వయ లోపంతో రనౌట్‌గా వెనుదిరిగాడు. మరో ఓపెనర్ డకెట్ (32: 23 బంతుల్లో 6 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మిగతా వారెవరూ పెద్దగా రాణించలేదు. అరంగేట్ర బౌలర్ హర్షిత్ రాణా తొలి మ్యాచ్‌లోనే అద్భుత ప్రదర్శన చేశాడు. కీలకమైన 3 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. రవీంద్ర జడేజా కూడా మూడు వికెట్లు తీయగా అక్షర్ పటేల్, మహ్మద్ షమీ, కుల్‌దీప్ యాదవ్ తలో వికెట్ తీశారు.

### ఆరంభం అదిరినా...

తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ప్రారంభంలో టీమ్ ఇండియాను కాస్త భయపెట్టింది. ఓపెనర్లలో సాల్ట్ ఓ వైపు వరుస ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడుతుండగా.. అతడికి డకెట్ చక్కని సహకారం అందించాడు. హర్షిత్ రాణా వేసిన ఆరో ఓవర్లో మూడు సిక్సులు, రెండు ఫోర్ల సాయంతో ఏకంగా 26 పరుగులు బాదేశారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని హార్దిక్ పాండ్య విడగొట్టాడు. ఎనిమిదో ఓవర్ చివరి బంతికి సాల్ట్ భారీ షాట్ ఆడగా.. బౌండరీ లైన్ వద్ద శ్రేయస్ అయ్యర్ అద్భుత పీల్డింగ్ చేశాడు. సాల్ట్ మూడో రన్ కోసం ప్రయత్నించగా డకెట్ వద్దని వారించడంతో.. వెనక్కి వెళ్లే క్రమంలో సాల్ట్ రనౌటయ్యాడు. ఆ తర్వాతి ఓవర్లోనే డకెట్, హ్యారీ బ్రూక్ (0) వికెట్లను హర్షిత్‌రాణా పడగొట్టాడు. దీంతో ఇంగ్లండ్ పరుగుల వేగం అనూహ్యంగా తగ్గిపోయింది.

### బట్లర్, బెతెల్ అర్ధశతకాలు

మిడిలార్డర్లో వచ్చిన బట్లర్, బెతెల్ క్రీజులో నిలదొక్కుకుంటూ ఆడారు. అనవసర పరుగుల కోసం ప్రయత్నించకుండా జాగ్రత్తపడ్డారు. ఒక్కో ఓవర్లో 2, 3 పరుగులు మాత్రమే వస్తున్నా సహనంతో ఆడారు. ఈ జోడీని అక్షర్ పటేల్ విడగొట్టాడు. అర్ధశతకం పూర్తి చేసుకున్న బట్లర్ 33వ ఓవర్ చివరి బంతికి భారీ షాట్ కోసం ప్రయత్నించి.. హార్దిక్ పాండ్య చేతికి చిక్కి అవుటయ్యాడు. తరువాత లివింగ్‌స్టోన్, బ్రైడన్ కార్సే పెద్దగా స్కోరు చేయకుండానే వెనుతిరిగారు. నిలకడగా అడుతూ అర్ధశతకం పూర్తి చేసుకున్న బెతెల్ 43వ ఓవర్‌లో రవీంద్ర జడేజా బౌలింగ్లో ఎల్బీగా వెనుదిరిగాడు. చివర్లో వచ్చిన జోఫ్రా ఆర్చర్ (21నాటౌట్, 18 బంతుల్లో, 3 ఫోర్లు, 1 సిక్స్ కొంచెం దూకుడుగా ఆడటంతో ఇంగ్లాండ్ 47.4 ఓవర్లలో 248 పరుగులు సాధించింది.

### కోహ్లి దూరం..

మోకాలి నొప్పు కారణంగా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడని కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. టాస్ సమయంలో జట్టును ప్రకటించిన రోహిత్.. విరాట్ ఈ మ్యాచ్‌లో ఆడట్లేదని స్పష్టత ఇచ్చాడు. కుడి మోకాలు నొప్పిగా ఉండటంతో అతడికి విశ్రాంతి ఇచ్చామని చెప్పాడు. కోహ్లీ స్థానంలో యంగ్ బ్యాటర్ యశస్వి జైస్వాల్‌ను తీసుకున్నామని పేర్కొన్నాడు. అయితే నిన్న మొన్నటి వరకు ఫిట్‌గా ఉన్న కోహ్లీ ప్రాక్టీస్ సెషన్స్‌లో జోరుగా బ్యాటింగ్ సాధన చేస్తూ కనిపించాడు. అందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. మరి.. అతడికి మ్యాచ్‌కు ముందు గాయమైందా? లేదా బుధవారం నాటి నెట్ సెషన్‌లో మోకాలికి దెబ్బ తగిలిందా? అనేది క్లారిటీ లేదు. ఈ మ్యాచ్‌లో ఆడని కోహ్లీ.. రెండో వన్డే నాటికి కోలుకుంటాడేమో చూడాలి.

---

భారత్-పాక్ పోరు..

# బయటకు చెప్పినంత తేలిగ్గా ఉండదు

- మాజీ కోచ్ రవిశాస్త్రి



ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ఈ నెల 19న ప్రారంభమవుతుండగా, భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య ఈ నెల 23న మ్యాచ్ జరగనుంది. ఐసీసీ టోర్నీల్లో మినహా.. మరెక్కడా ఈ రెండు జట్లు తలపడే అవకాశాలు లేకపోవడంతో ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఈ రెండు దేశాల మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఇటీవల భారత్ పాక్ మ్యాచ్‌పై ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ స్పందించాడు. దీన్ని ఇతర మ్యాచులు మాదిరిగానే చూస్తామని వ్యాఖ్యానించాడు. అయితే, ఇలాంటి మాటలు గతంలో తాను కూడా చెప్పినట్లు మాజీ కోచ్ రవిశాస్త్రి గుర్తు చేసుకున్నాడు. గంభీర్ వ్యాఖ్యలకు తాను మద్దతు ఇచ్చినా వాస్తవ పరిస్థితి విభిన్నంగా ఉంటుందని రవిశాస్త్రి పేర్కొన్నాడు.

నేను ఏడేళ్లపాటు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించా. అప్పట్లో నన్నూ ఇదే ప్రశ్న అడిగేవారు. నేను కూడా గంభీర్ చెప్పినట్లే చెప్పా. కానీ, మనం ఆలోచించే దానికంటే భారీ అంచనాలు ఉంటాయి. మేం మీడియా కోసం మాత్రం అలా చెప్పేవాళ్లం. లోతుగా వెళ్తే మాత్రం.. తప్పకుండా విజయం సాధించాల్సిందే. లేకపోతే మళ్లీ వచ్చే మ్యాచ్ వరకూ దీనిగురించే చర్చిస్తారు. గతంలో ఎన్ని విజయాలు సాధించామనేది అభిమానులు పట్టించుకోరు. గత పది మ్యాచుల్లో పది లేదా తొమ్మిది గెలిచినా మాట్లాడుకోరు. కానీ, ఒక్క మ్యాచ్‌లో ఓడినా చాలు మళ్లీ భారత్ - పాకిస్థాన్ మ్యాచ్ వచ్చే వరకూ ఆ ఓటమి గురించి మాట్లాడుతూనే ఉంటారు. ట్యాక్సీ డ్రైవం కావొచ్చు.. సాధారణ పౌరుడు, విద్యార్థి, సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి, రిటైర్ట్ ఉద్యోగి, వ్యాపారి.. ఏ వర్గానికి చెందిన వ్యక్తులైనా సరే... భారత జట్టుకు ఏమైంది, ఇలా ఓడిపోయింది అని అడుగుతారు. మళ్లీ ఆ రెండు జట్ల మధ్య మ్యాచ్ వచ్చే వరకూ ఆ ఓటమి గురించి అడుగుతూనే ఉంటారు. పాకిస్థాన్‌లోనూ ఇదే పరిస్థితి ఉంటుంది. దాయాదుల పోరంటే ఇతర మ్యాచ్‌లతో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ఉంటుంది. 2021లో టీ20 ప్రపంచకప్‌లో భారత్‌పై పాక్ గెలిచింది. ఆ తర్వాత మనం విజయం సాదించాం. ఇప్పుడు 50 ఓవర్ల క్రికెట్ మ్యాచ్. అనుభవపరంగా పాక్ కంటే టీమ్ ఇండియా ఉత్తమంగా ఉందని రవిశాస్త్రి తెలిపాడు.

## ఛాంపియన్స్ ట్రోఫీకి కమిన్స్ దూరం

### -అధికారికంగా ప్రకటించిన క్రికెట్ ఆస్ట్రేలియా

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఆస్ట్రేలియా జట్టుకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే స్టార్ అల్‌రౌండర్లు మిచెల్ మార్ష్, మార్కస్ స్థొయినిస్ జట్టుకు దూరమవ్వగా.. తాజాగా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కూడా ఈ టోర్నీకి అందుబాటులో ఉండటం లేదు. అతడితో పాటు ఫాస్ట్ బౌలర్ జోష్ హేజెల్‌వుడ్ కూడా దూరమయ్యాడు. ఈ విషయాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా గురువారం అధికారికంగా ప్రకటించింది. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియా గత నెల జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే.

# పంత్ పెద్దమనసు

- యాడ్స్ ఆదాయంలో పదిశాతం పేదలకు



టీమిండియా స్టార్ క్రికెటర్ రిషభ్ పంత్ పెద్ద మనసు చాటుకున్నాడు. తనకు యాడ్స్ ద్వారా వచ్చే ఆదాయంలో 10 శాతం పేదలకు ఆర్థిక సాయంగా అందించనున్నట్లు ప్రకటించాడు. 'రిషభ్ పంత్ ఫౌండేషన్' (ఆర్‌పీఎఫ్) ద్వారా ఈ సాయం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు పంత్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక వీడియోను పోస్టు చేశాడు. కఠిన సమాయాల్లో ఎలా ధైర్యంగా ఉండాలో తనకు ఎదురైన అనుభవాల ద్వారా నేర్చుకున్నట్లు తెలిపాడు. ఇక క్రికెట్ తనకు అన్నీ ఇచ్చిందని, తన వాణిజ్య సంపాదనలో 10 శాతం ఆర్‌పీఎఫ్‌కి విరాళంగా ఇస్తానని చెప్పాడు. ఈరోజు నా దగ్గర ఉన్నదంతా అందమైన క్రికెట్ క్రీడ వల్ల వచ్చిందే. ఒక్కోసారి మన జీవితంలో అనుకోకుండా చోటుచేసుకునే ఘటనలు జీవిత పాఠాలు నేర్పిస్తాయి. కొన్ని సంవత్సరాల క్రితం నేను అలాంటి కఠిన పరిస్థితులను ఎదుర్కొన్నా. అందుకే ఇంకా ఎక్కువ కృతజ్ఞతతో ఉండాలని నిర్ణయించుకున్నా. జీవితంలో నేను నేర్చుకున్నది ఒకటే.. ఆశ వదులుకోకుండా, ఎల్లప్పుడూ నవ్వుతూ ఉండటం. నా ఆట ద్వారా నేను పొందిన దానిలో కొంత భాగం ప్రజలకు ఇచ్చి వారిలోనూ చిరునవ్వులను తీసుకురావడం అన్నది ఇప్పుడు నా లక్ష్యం. తిరిగి ఇవ్వడం ద్వారా వచ్చే ఆనందం మాటల్లో చెప్పలేనిది. నా వాణిజ్య ఆదాయంలో 10 శాతం రిషబ్ పంత్ ఫౌండేషన్ కోసం అంకితం చేస్తున్నా. ఆర్‌పీఎఫ్ నాకు చాలా ప్రియమైన ప్రాజెక్ట్. దాని లక్ష్యాలు నా హృదయానికి దగ్గరగా ఉన్నాయి. వచ్చే రెండు నెలల్లో దీని పూర్తి వివరాలు వెల్లడిస్తా. మీ ప్రేమ, ఆశీస్సులు, మద్దతుకు ధన్యవాదాలు" అని పంత్ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నాడు.

ఇక పంత్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అతని అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గొప్పవాళ్లు ఎప్పుడూ గొప్పగానే ఆలోచిస్తారంటూ కామెంట్స్ చేస్తున్నారు. కాగా, రిషభ్ పంత్ సుమారు 10 ఉత్పత్తులకు ప్రచారకర్తగా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం టీమిండియాలో మూడు ఫార్మాట్లలోనూ కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. అటు ఐపీఎల్‌లోనూ ఈసారి టోర్నీ చరిత్రలోనే అత్యధిక ధర (రూ.27కోట్లు) దక్కించుకుని రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే.

## బ్లో అప్

రిద్ధికుమార్



# ఇండస్ట్రీకి కాంపౌండ్లు లేవు



చిత్ర పరిశ్రమ అంతా ఒకటేనని, దయ చేసి కాంపౌండ్లు కట్టొద్దని యువ కథానాయకుడు విశ్వక్సేన్ హితవు పలికారు. ఆయన కీలక పాత్రలో రామ్ నారాయణ్ దర్శకత్వంలో రూపొం దుతున్న చిత్రం "లైలా". ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న థియేటర్లకు రానుంది. ఈ రొమాంటిక్ యాక్షన్ చిత్రంలో విశ్వక్ అబ్బాయిగా, అమ్మాయిగా రెండు కోణాలున్న పాత్రలో కనువిందు చేయనున్నారు. గురువారం చిత్ర ట్రైలర్ విడుదలైన సందర్భంగా మీడియా ప్రశ్నలకు విశ్వక్ సమాధానమిచ్చారు.

'మీ ఈవెంట్లకు నందమూరి హీరోలను తెస్తారు. సడెన్‌గా బాస్‌ను తీసుకొచ్చారు. ఆ కాంపౌడ్ నుంచి ఇటు వచ్చారా'? అని ఒక విలేకరి అడగ్గా, విశ్వక్ అదిరిపోయే రిప్లై ఇచ్చారు. "కాంపౌండ్లు మీరు వేస్తుంటారు. మాకున్నది ఒకటే కాంపౌండ్. ఇది మా ఇంటిది. ఇండస్ట్రీలో అవేమీ లేవు. అంతా ఒకటే. ఇక -బాస్ ఈజ్ బాస్. మమ్మల్ని అభిమానించే వాళ్ళెలా ఉంటారో.. మేము అభిమానించే వాళ్లూ ఉంటారు. అనుబంధం ఉందని, ప్రతిసారి వాళ్లను పిలిచి ఇబ్బంది పెట్టలేం కదా. ఒక హీరోను ఈవెంటుకు పిలవడానికి 100 కారణాలుంటాయి. నిర్మాతతో అనుబంధం, హీరోతో స్నేహం ఇలా చాలా ఉంటాయి" అని ఆన్సరిచ్చారు.

# కత్రినాను కలిసిందక్కడే!



బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్, నటి కత్రినా కైఫ్ కొన్నేళ్ల క్రితం వైవాహిక బంధంలోకి అడుగు పెట్టిన విషయం తెలిసిందే. పెద్దల అంగీకారంతో వివాహం చేసుకుని అందరి దృష్టిని ఆకర్షించింది ఈ జంట. వివాహం జరిగి నాలుగేళ్లు అవుతున్నా.. తాము ఎప్పుడు పరిచయమైంది? ఎలా కలిశాం? అనే విషయాలను వీరిద్దరూ ఎప్పుడూ వెల్లడించలేదు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న విక్కీ కౌశల్ తన ప్రేమ, పెళ్లి గురించి మాట్లాడారు. కత్రినాతో తొలి పరిచయాన్ని తాను ఎప్పటికీ మర్చిపోనన్నారు. "2019లో ఓ అవార్డుల కార్యక్రమానికి నేను హోస్టుని. వేదికగా తొలిసారి కత్రినా కైఫ్ పరిచయమైంది. ఆమె సినిమాల్లోని పలు పాపులర్ పాటలకు మేమిద్దరం సరదాగా స్టెప్పులేశాం. ఆ వీడియో ఆన్‌లైన్‌లో ఫుల్ వైరలైంది. నిజం చెప్పాలంటే అది పూర్తిగా స్క్రిప్టెడ్. నేను ఆమెను ఏం అడగాలి? ఆమె ఏవిధంగా బదులివ్వాలి అనేది నిరంతరం మాకు ఆ షో నిర్వాహకులు చెబుతూనే ఉంటారు. స్టేజ్ మీదకు వచ్చే ముందు కూడా మేమిద్దరం మాట్లాడుకున్నాం. పలు విషయాల గురించి తను సరదాగా మాట్లాడింది. తొలి పరిచయంలోనే తను చాలా స్వీట్ అనిపించింది. కొంతకాలానికి మామధ్య పరిచయం స్నేహంగా మారింది. ఆ తర్వాత ప్రేమ, పెళ్లి జరిగింది" అని విక్కీ కౌశల్ చెప్పారు. "కత్రినా మంచి నటి. ఆమె యాక్ట్ చేసిన చాలా చిత్రాలు చూశా. 'వెల్కమ్', 'సింగ్ ఈజ్ కింగ్' చిత్రాలు నాకెంతో ఇష్టం" అన్నారు. విక్కీ కౌశల్ ప్రస్తుతం 'చావా' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు.

# చెల్లిని చూస్తుంటే గర్వంగా ఉంది

'లవ్‌యాపా' అంటూ యూత్‌ఫుల్ లవ్ స్టోరీతో పలకరించనున్నారు ఖుషీ కపూర్. ఆమె ప్రధానపాత్రలో నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది. తాజాగా చిత్రబృందానికి విషెస్ చెప్పిన జాన్వీకపూర్ తన చెల్లి ఖుషీని చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. "ఎంత కష్టమైనప్పటికీ నీకు నచ్చిన దాన్ని చాలా నిజాయితీగా, శ్రద్ధగా చేస్తున్నందుకు నిన్ను చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది ఖుషీ. వినోదం, హాస్యంతోపాటు ఎమోషనల్ సన్నివేశాలతో కూడిన రొమాంటిక్ కామెడీ చిత్రం రేపటి నుంచి అన్ని థియేటర్లలో సందడి చేస్తుంది. నేను ఈ సినిమా చూసి కచ్చితంగా భావోద్వేగానికి గురవుతాను. ఎందుకంటే ఎమోషనల్ సీన్లలో నా ఖుషీ ఏడవడం బిగ్‌స్క్రీన్‌పై చూసినప్పుడు తట్టుకోలేను" అని రాసుకొచ్చారు. 'లవ్‌యాపా' స్పెషల్ టీ షర్ట్ వేసుకున్న జాన్వీ.. తన సినిమాల విడుదల తేదీలలో ఖుషీని కూడా తన ఫొటో ఉన్న టీ షర్ట్ ధరించాలని కోరారు.



# నలిగిపోయినట్టుంటే నచ్చదు!



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం తండేల్. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న సినిమా ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా అభిమానులు అడిగిన పలు ప్రశ్నలకు సాయిపల్లవి ఇచ్చిన సమాధానాలు.

సాయిపల్లవి ఖాళీ సమయంలో ఏం చేస్తుంది? అని ఓ అభిమాని అడిగితే.. -'నేను నాలా ఉండటానికి ప్రయత్నిస్తా. సినిమాలు చూస్తా. వంట చేయాలనుకుంటా కానీ, చేయలేను. ఆర్డర్ పెట్టి తినేస్తా. తోటపనిచేస్తా. క్యారెట్లు పండిస్తా' అని ఆన్సరిచ్చారు. 'వాట్సాప్ స్టిక్కర్స్ వాడతారా?' అన్న ప్రశ్నకు -కోతుల సింబల్స్ చూపించారు. 'అబ్బాయిలు ఎలాంటి డ్రెస్సులు వాడితే నచ్చుతారు' అని అగిడినపుడు -నాకు పెద్దగా అవగాహన లేదు. కాకపోతే -నలిగిపోయిన బట్టలు వేసుకుంటే నాకు నచ్చదు. నా ఫ్యామిలీలో ఎవరైనా అలా కనపడితే, వెంటనే వాటిని సరిచేయడానికి ప్రయత్నిస్తా' అని ఆన్సరిచ్చారు. అర్థమైందిగా.. సాయిపల్లవిని కలిసే అవకాశం వస్తేమాత్రం -ఇస్త్రీ బట్టలేసుకుని వెళ్లాలన్న మాట.

## జాంబీ రెడ్డికి సీక్వెల్?

టాలీవుడ్‌లో గత ఏడాది సంక్రాంతికి వచ్చిన భారీ హిట్ చిత్రం "హను మాన్". రికార్డు వసూళ్లు అందుకున్న సినిమా అదరగొట్టింది. మరి ఈ సినిమాకి గ్రాండ్ సీక్వెల్‌గా "జై హనుమాన్"ని కూడా ఇపుడు చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ సినిమాపై కూడా భారీ అంచనాలు నెలకొనగా ఇపుడు ఈ సీక్వెల్ కాకుండా ఇదే కాంబినేషన్ నుంచి మరో మ్యాడ్ సీక్వెల్ వస్తుంది అని తెలుస్తోంది. హను మాన్ కంటే ముందు వచ్చిన క్రేజీ సినిమా "జాంబీ రెడ్డి" ఎలా ఎంటర్టైన్ చేసిందో అందరికీ తెలిసిందే. మరి ఈ సినిమా వచ్చి నిన్నటితో నాలుగేళ్లు పూర్తయింది. అయితే ఈ సినిమాకే ఇపుడు ప్రశాంత్ వర్మ, తేజ సజ్జలు సీక్వెల్ కూడా ప్లాన్ చేస్తున్నట్టుగా రూమర్స్ వినిపిస్తున్నాయి. మరి దీనిపై అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది. అలాగే తేజ చేసిన సస్పెన్స్ పోస్ట్ కూడా వైరల్ గా మారింది. దీనితో ఈ సినిమా సీక్వెల్ కూడా వస్తుందా అనేది చూడాలి మరి.



# 'జాక్'గా జొన్నలగడ్డ సిద్ధూ

టాలీవుడ్ యంగ్ అండ్ స్టార్ హీరోస్‌లో స్టార్ ఎంటర్టైనర్ డీజే టిల్లు హీరో సిద్ధూ జొన్నలగడ్డ కూడా ఒకడు. మరి సిద్ధూ హీరోగా నటించిన ఓటీటీ హిట్ చిత్రం కృష్ణ అండ్ హిజ్ లీలా సినిమా థియేటర్స్‌లో రీరిలీజ్‌కి రాబోతుండగా.. ఈ సినిమా కాకుండా తననుంచి ఇపుడు రాబోతున్న మరో సినిమా "జాక్". దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ తెరకెక్కించిన సినిమా పట్ల మంచి బజ్ మొదటి నుంచి ఉండగా ఇపుడు ఈ సినిమా నుంచి మేకర్స్ టీజర్‌కి డేట్ అండ్ టైంని ఇచ్చేసారు. దీనితో రేపు ఫిబ్రవరి 7న ఉదయం 11 గంటల 7 నిమిషాలకి రిలీజ్ చేస్తున్నట్టుగా అనౌన్స్ చేసేసారు. మరి ఈ క్రేజీ థ్రిల్ రైడ్ ఎలా ఉంటుందో చూడాల్సిందే. ఇక ఈ చిత్రంలో వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా నటించగా బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మాణం వహిస్తున్నారు. అలాగే ఈ ఏప్రిల్ 10న సినిమా గ్రాండ్‌గా రిలీజ్‌కి రాబోతుంది.